



**సి.పి.ఐ (మావోయిస్టు) కేంద్రకమిటీ సభ్యుడూ, దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి**
**కామ్రేడ్ రామన్న (రావుల శ్రీనివాస్)కు అరుణారుణ జోహార్లు**



ప్రియమైన కామ్రేడ్,
చరిత్ర నియమానుసారం, చరిత్ర పురోగమనం కోసం
జీవితాన్ని అంకితం చేసావు.
అందుకే చరిత్ర నీ ఆశయాలనూ, లక్ష్యాన్ని
అనివార్యంగా మోసుకెళ్తుంది, ప్రతిష్టిస్తుంది కూడా.
నీవు కూడా చరిత్ర ఆసాంతం చరిత్ర సృష్టికర్తల హృదయాల్లో
సదా నిలిచిపోతావు.

# బోల్షివిక్

సంపుటి: 7 సంచిక: 2 సి.పి.ఐ (మావోయిస్టు) ఎ.ఒ.బి. సమాచార పత్రిక జులై-డిసెంబర్ 2019

## లోపలి పేజీల్లో...

1. వర్తమాన దేశీయ, అంతర్జాతీయ పరిస్థితి - 3
2. ప్లీనం తీర్మాణాలు - 7
3. సైద్ధాంతిక కృషికి మొదటి స్థానాన్నివ్వాలి - 11
4. శత్రు గుఢాచారి వ్యవస్థ - 17
5. 370 ఆర్టికల్ - 19
6. రామజన్మభూమి - 21
7. బాక్సైట్ తవ్వకాల నిలిపివేత - 22
8. అమరుల జీవిత చరిత్రలు - 24
9. పోరాట స్రవంతి - 41

**అమరులకు నివాళి**

# మీ త్యాగాల వెలుగులో ప్రజాయుద్ధ మార్గం ప్రకాశవంతమైంది!
# లక్ష్యం చేరేదాక మీరు చూపిన మార్గాన్ని వదలం!!



భారత దేశంలో ప్రస్తుతం నెలకొని వున్న అర్ధ భూస్వామ్య, అర్ధవలస సమాజాన్ని కూకటివేళ్ళతో పెళ్ళగించి, నూతన ప్రజాస్వామిక వ్యవస్థనూ, ఈ క్రమంలో సోషలిజాన్ని, అంతిమంగా కమ్యూనిజాన్ని స్థాపించే లక్ష్యంతో సి.పి.ఐ మావోయిస్టు పార్టీ నేతృత్వంలో ప్రజలు వీరోచితంగా ఉద్యమిస్తున్నారు. ఈ ఉద్యమాన్ని అణచి వేసి, తమ అధికారాన్ని సుస్థిరం చేసుకొనేందుకూ, దోపిడీ పీడనలను కొనసాగించేందుకు ఈ దేశ దోపిడీ పాలక వర్గాలైన దళారీ, నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గాలు, వారి యజమానులైన సామ్రాజ్యవాదులు తమ రాజ్యాంగ యంత్రం ద్వారా పార్టీపైన, పి.ఎల్.జి.ఎ.పైన, ప్రజలపైన తీవ్రమైన సాయుధ అణిచివేతను కొనసాగిస్తున్నారు. ఈ అణచివేత 2009 సెప్టెంబర్ నుండి గ్రీన్‌హంట్ బహుముఖ, సైనిక దాడి రూపంలో మరింత తీవ్రతరం అయింది. ఈ దాడి అత్యంత పాశవికంగా, క్రూరంగా, మోసపూరితంగా కొనసాగుతున్నది. విరుద్ధ ప్రయోజనాల  కోసం జరుగుతున్న ఈ యుద్ధంలో ప్రజల రాజ్యాధికారాన్ని నెలకొల్పే లక్ష్యంతో దోపిడి వర్గాల రాజ్యంతో వీరోచితంగా పోరాడుతూ అనేక మంది ప్రజల ఉత్తమ పుత్రులు, పుత్రికలు తమ అమూల్యమైన ప్రాణాలను తృణప్రాయంగా అర్పిస్తున్నారు. చరిత్ర పురోగమనానికి తమ వంతు కర్తవ్యంగా వీరోచితమైన త్యాగాలను చేస్తూ గొప్ప విప్లవ సాంప్రదాయాలను నెలకొల్పుతున్నారు. 2019 జులై నుండి డిసెంబర్ వరకు దేశవ్యాప్తంగా పదుల సంఖ్యలోనే పార్టీ, పి.ఎల్.జి.ఎ, ప్రజాసంఘాల సభ్యుల నాయకత్వంతో పాటు, సాధారణ ప్రజలు నేలకొరిగారు. ఎ.ఓ.బిలో కామ్రేడ్ రాకేష్ (డి.వి.సి.ఎమ్-పి.ఎల్ కమాండర్),  కామ్రేడ్ రమేష్ (ఎ.సి.ఎమ్-సెక్షన్ కమాండర్), కామ్రేడ్ స్వేత (ఎ.సి.ఎమ్- డిప్యూటీ కమాండర్), కామ్రేడ్ సొమ్లు (ఎ.సి.ఎమ్), కామ్రేడ్ విమల (ఎ.సి.ఎమ్), కామ్రేడ్ మంగు (పి.ఎమ్), కామ్రేడ్ శాంతి (పి.ఎమ్), కామ్రేడ్ అజయ్ (పి.ఎమ్), కామ్రేడ్ బుద్రి (పి.ఎమ్), కామ్రేడ్ దన్ను (పి.ఎమ్), కామ్రేడ్ సుజాత (పి.ఎమ్), కామ్రేడ్ భూమాల్ (పి.ఎమ్)లతోపాటు, పెదబయలు ఏరియా, రంగినిగూడ గ్రామంలో పార్టీ సీనియర్ సభ్యుడు చిన్నారావును పోలీసులు విచారణ పేరుతో పట్టుకునిపోయి, చిత్రహింసలకు గురిచేసి లాకప్‌లో హత్య చేశారు. దేశ వ్యాపితంగా అనేక మంది కామ్రేడ్స్ శత్రువుతో విరోచితంగా పోరాడుతూ అమరులైనారు. మన ఈ కామ్రేడ్స్ అమరత్వం పార్టీకి, ఉద్యమానికి ఎనలేని నష్టాన్ని కల్పించింది. వారి కుటుంబాలకు, శ్రేయోభిలాషులకు తీవ్రమైన దుఃఖాన్ని నింపింది. ఈ పరిస్థితులలో అమరుల కుటుంబాల, శ్రేయోభిలాషుల దుఃఖంలో పాల్పంచుకుంటూ, వారికి ఎస్.జడ్.సి ప్రగాఢ సంతాపాన్ని తెలియ జేస్తున్నది. అలాగే అమరుల ఆశయాలను సఫలీకృతం చేస్తామని ప్రతిజ్ఞ చేస్తూ, వారికి తలవంచి వినమ్రంగా శ్రద్ధాంజలి ఘటిస్తున్నది.

మన అమరుల త్యాగాలు మన వెంటనే వున్నాయి. వారి త్యాగాలతో మన మార్గం ప్రకాశవంతమైంది. మన పురోగమనంలో వారిస్తున్న ఉత్తేజం మనకు నూతన శక్తినీ, చైతన్యాన్ని అందిస్తున్నది. అందుకే వారు సదా చిరస్మరణీయులు.

# వర్తమాన అంతర్జాతీయ, దేశీయ పరిస్థితులు

## (ఎ.ఓ.బి 3వ మహాసభ, 3వ ప్లీనం ఆమోదించినది 30-10-2019)

### అంతర్జాతీయ పరిస్థితి

సామ్రాజ్యవాద సాధారణ సంక్షోభంలో భాగంగా, 1970లలో ప్రారంభమైన ఆర్థిక, ద్రవ్య సంక్షోభం, 2008లో అమెరికాలో 'గృహ ఋణాల సంక్షోభం' రూపంలో మరింత తీవ్రరూపం దాల్చింది. ప్రస్తుతం ఈ ద్రవ్య, ఆర్థిక సంక్షోభం, నేడు అన్ని దేశాలకూ వ్యాప్తి చెంది, ప్రపంచ పెట్టుబడిదారీ విధానాన్ని అతలాకుతలం చేస్తున్నది. ఈ పరిస్థితిని, బూర్జువా ఆర్థిక వేత్తలు సైతం మందగమనమని చెబుతున్నారు. వాస్తవంగా ప్రపంచ ఆర్థికవ్యవస్థ తిరోగమనంలో ఉంది. ఈ పరిస్థితిని ఎదుర్కొనేందుకు సామ్రాజ్యవాదులవద్ద సరైన పరిష్కారాలు లేవు. ఎంతసేపటికీ **'సప్లై', 'డిమాండ్'**లకు ఉద్దీపన కల్పించే పాత పరిష్కారాల అమలులో తలమునకలవుతున్నారు. వాస్తవంగా ఈ దిద్దుబాటు చర్యలేవీ పెట్టుబడిదారి విధానాన్ని సంక్షోభం నుండి గట్టెక్కించలేవు. ఈ విషయం గత చరిత్ర రుజువు చేసినదే. ఇటువంటి పరిస్థితులలోనే, అంటే ప్రపంచ ద్రవ్య, ఆర్థిక సంక్షోభాలు తీవ్రతరమైనప్పుడే, చరిత్రలో మొదటి, రెండవ ప్రపంచ యుద్ధాలతో పాటు, విప్లవ వెల్లువలు వచ్చాయి.

నేడు కూడా అంతర్జాతీయంగా, సుదీర్ఘకాలంగా ఆర్థిక, ద్రవ్య సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న సామ్రాజ్యవాదం, దాని నుండి కోలుకొనే అవకాశాలు కనిపించడం లేదు. ఈ నేపథ్యంలోనే, వెనకబడిన దేశాలలో సంస్కరణలను వేగవంతం చేయడం పేరుతో, దోపిడీ పాలక వర్గాలు ప్రజలను తీవ్రమైన దోపిడీ, పీడనలకు గురి చేస్తున్నారు. ఈ నయా ఉదారవాద విధానాల(సంస్కరణలు)ను వ్యతిరేకించే పీడిత ప్రజలనూ, ప్రజాస్వామిక, విప్లవ సంస్థలను క్రమంగా అణచివేసేందుకు పాలకవర్గాలు ఫాసిజాన్ని అమలు చేస్తున్నాయి. ఈ ఫాసిజం 'దేశభక్తి', 'జాతీయత'ల ముసుగులో అమలవుతూ మధ్య తరగతిలోని ఒక సెక్షన్‌లో ఉన్మాదాన్ని రేకెత్తించి, అశేష శ్రామిక ప్రజానీకంపై క్రూరమైన దాడి చేస్తున్నది. పార్లమెంటు ముసుగులో కూడా ఈ ఫాసిజం కొనసాగుతున్నది. నేడు యూరప్, లాటిన్ అమెరికా ఖండాలలోని కొన్ని దేశాలలో మితవాద (ఫాసిస్టు) పార్టీలు పార్లమెంటరీ ఎన్నికలలో గెలిచి, అధికారాన్ని కైవసం చేసుకుంటున్నాయి. ఇది అత్యంత ప్రమాదకరమైన ధోరణి. మరోవైపు పెద్ద సామ్రాజ్యవాద శక్తులు మార్కెట్‌లను కబ్జా చేసుకొనేందుకు తలపడ్తున్నాయి. సామ్రాజ్యవాదులు వారి తైనాతీలైన దళారీ పాలకవర్గాలు ద్రవ్య, ఆర్థిక సంక్షోభం నుండి బయట పడేందుకు చేపడ్తున్న ఈ చర్యలన్నీ ప్రపంచంలో మూడు మౌలిక వైరుధ్యాలను తీవ్రతరం చేస్తున్నాయి.

ప్రస్తుతం సామ్రాజ్యవాదుల మధ్య పోటీ ఆర్థిక రంగంలో 'వాణిజ్య యుద్ధాల' రూపంలో వ్యక్తం అవుతుండగా, సైనికరంగంలో మధ్య ప్రాచ్యం(పశ్చిమాసియా)లో, ఇండోపసిఫిక్ ప్రాంతంలో వాటి మధ్య పోటీ తీవ్రతరమవుతున్నది. ఈ పోటీ నేడు పోలరైజ్ అవుతున్న రెండు కూటముల మధ్య కన్పిస్తున్నది. ముఖ్యంగా అమెరికా, పశ్చిమ యూరప్, ఆస్ట్రేలియా, జపాన్, భారత్, ఒక కూటమిగా తయారవుతుంటే, చైనా, రష్యా, ఇరాన్, వెనిజులా, ఉత్తరకొరియా వంటి దేశాలు మరో కూటమిగా తయారయ్యేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ ఘర్షణలు పెరిగేకొద్దీ, ఆయా దేశాల పాలకవర్గాల స్వార్థప్రయోజనాల ప్రాతిపదికన ఈ సమీకరణలలో కూడా మార్పులు రావచ్చు. నేడు అమెరికా తన పాత మిత్రుల(ఇటలీ, పశ్చిమ యూరప్ దేశాలు)తో ఘర్షణలు పడుతూ, ఆఫ్ఘనిస్తాన్, సిరియా వంటి దేశాలలో తన సాయుధ బలగాలను కొనసాగించలేకపోతున్నది. ఆర్థికంగా, రాజకీయంగా బలహీనపడుతున్నది. మరోవైపు రష్యా తన పాత ప్రభావిత ప్రాంతాలపై తిరిగి పట్టును సంపాదించుకొనేందుకు ప్రయత్నిస్తున్నది. చైనా తన మార్కెట్‌ల విస్తరణకు వివిధ రూపాలలో దూకుడుగా వ్యవహరిస్తున్నది. మొత్తంగా ఈ సామ్రాజ్యవాద పెద్ద శక్తుల మధ్య ఘర్షణ తీవ్రతరమవుతున్నది.

అయితే రోజురోజుకు ప్రజల తీవ్ర ఆగ్రహానికి గురి అవుతున్న సామ్రాజ్యవాదాన్నీ, దాని తైనాతీలను పూర్తిగా ధ్వంసం చేసి, విప్లవాల వెల్లువను సృష్టించేలా విప్లవ పార్టీలు, జాతి విముక్తి పోరాట సంస్థలు బలంగా లేవు. ఇటువంటి పరిస్థితులలో ఎక్కడికక్కడ ఆయా దేశాలలో సామ్రాజ్యవాదులకూ, వారి తైనాతీలకు వ్యతిరేకంగా ఉధృతమవుతున్న ప్రజా పోరాటాలకు నిజమైన విప్లవకర కార్మికవర్గ పార్టీలు నేతృత్వం వహిస్తూ, బలోపేతం అవుతూ, ప్రపంచ వ్యాపితంగా ఉన్న విప్లవ పార్టీలతో సమన్వయం నెరుపుతూ, ఒక విప్లవ కేంద్రాన్ని ఏర్పర్చుకోవడమే నేటి కార్మికవర్గ పార్టీల కీలక కర్తవ్యం.

### దేశీయ పరిస్థితి

కొద్ది రోజుల క్రితం వరకూ "ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మాంద్యంలో ఉన్నప్పటికీ, భారత ఆర్థిక వ్యవస్థ పురోగమిస్తున్నదనీ, దూసుకువెళ్తున్నదనీ, దీని మూలాలు (ఫండమెండల్స్) చాలా బలమైనవని" వ్యాఖ్యానిస్తూ, చంకలు కుద్దుకున్న పాలకపార్టీలు, వారి ఆర్థికవేత్తలు నేడు భారత ఆర్థిక వ్యవస్థ మందగమనంలో

ఉందని కొందరూ, మాంద్యంలోకి వెళ్ళిందని కొందరూ, అసలు తిరోగమనంలోనూ, సంక్షోభంలోను ఉందని మరి కొందరు తలలు పట్టుకొని కూర్చున్నారు. అయితే ఇది తాత్కాలికమేననీ, చక్రభ్రమణం లాంటిదని సంతృప్తి పడుతున్నవారు కూడా ఇందులో కొందరు ఉన్నారు.

వాస్తవంగా నేడు భారత ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న సంక్షోభం చాలా తీవ్రమైనదీ, వ్యవస్థీకృతమైనది. మోడీ ప్రభుత్వం గడిచిన కొన్నేళ్ళ నుంచి జి.డి.పిని ఎక్కువ చేసిచూపే గణన పద్ధతిని అనుసరిస్తున్నప్పటికీ, ఈ ఆర్థిక సంవత్సరంలో (ఏప్రిల్-జూన్ మొదటి త్రైమాసికంలో) వృద్ధిరేటు, గత 6 సంవత్సరాలలోకెల్ల కనిష్ఠస్థాయి 5 శాతానికి పడిపోయింది. నిరుద్యోగం 45 ఏళ్ళ గరిష్టస్థాయికి చేరింది. ఆటో మొబైల్స్, రియల్‌ఎస్టేట్, స్థిరాస్తి రంగాలతో పాటు, బిస్కెట్ కంపెనీల వంటి ఇతర ఉత్పాదక రంగాలలో సైతం గిరాకిలేక అవి మూత పడుతుండటంతో, లక్షలమంది కార్మికులు వీధుల్లోకి నెట్టివేయబడుతున్నారు. లక్షలాది కోట్ల(10లక్షలకోట్లు) రూపాయల మొండి బకాయిలతో బ్యాంకింగ్ రంగం కుదేలైంది. రూపాయి విలువ అధోపాతాళానికి వెళ్ళింది. ఆసియాలో అత్యంత బలహీనంగా ఉన్న కరెన్సీ భారత రూపాయే. ఈ విధంగా చెప్పుకుంటూపోతే భారత ఆర్థిక వ్యవస్థ దివాళా తీసిందనడానికి మరెన్నో ఉదాహరణలు చెప్పుకోవచ్చు.

పై పరిస్థితిని ఎదుర్కోవడానికి మోడీ ప్రభుత్వం, ప్రజలు రిజర్వ్‌బ్యాంక్‌లో దాచుకున్న పొదుపు మొత్తాలను కాజేసింది. భారత దళారీ పాలకవర్గాలకు తొత్తులాగా వ్యవహరిస్తున్న రిజర్వ్‌బ్యాంక్, రూ॥ 1.76 లక్షల కోట్లను డివిడెండ్, కంటింజెన్సీ, మిగులు నిధుల పేర్లతో మోడీ ప్రభుత్వానికి బంగారుపళ్ళెంలో పెట్టి వినయంగా అర్పించుకున్నది. ఈ ప్రజాధనాన్ని మోడీ ప్రభుత్వం విదేశీ, దేశీయ కార్పొరేట్ సంస్థలకు రాయితీలు, ప్రోత్సాహకాలు, ఉద్దీపనల పేరుతో దోచిపెడ్తున్నది. ఈ సంవత్సరం బడ్జెట్ ప్రకటించిన తరువాతనే, బడా కార్పొరేట్ సంస్థలకు ప్రభుత్వం రూ॥ 1.45 లక్షల కోట్లను పన్ను రాయితీలుగా ప్రకటించింది. ఇంకా ఇలాంటి ప్రజావ్యతిరేకమైన, పాలకవర్గలకు ముఖ్యంగా సామ్రాజ్యవాదులకు అనుకూలమైన నిర్ణయాలు తీసుకుంటున్నప్పటికీ, విధానాలు రూపొందిస్తున్నప్పటికీ, ఆర్థిక వ్యవస్థలో చురుకుదనాన్ని పుట్టించలేకపోతున్నామని వాపోతున్నది. ఇప్పటికీ భీమా, బ్యాంకింగ్, గనులు, రక్షణ, ఉత్పత్తి, మీడియా చివరకు వ్యవసాయం, విద్య, వైద్యం, చేతి వృత్తులు, రీటైల్ వంటి రంగాలలో ఎఫ్.డి.ఐని అనుమతించింది. వీటన్నింటిలో వందశాతం అనుమతికి సన్నాహాలు చేస్తున్నది. లాభాలు గడిస్తున్న పబ్లిక్ రంగ పరిశ్రమల వాటాలను కార్పొరేట్ సంస్థలకు కారుచౌక ధరలకు అమ్మి, ఒకలక్ష కోట్లకు పైగానే పోగెయ్యాలని చూస్తున్నది. ఇలా పోగేసిన నిధులన్నిటినీ దోపిడీ పాలకవర్గాల ప్రయోజనాలకు కట్టబెడుతూ, పెట్టుబడిదారి విధానం ఎదుర్కొంటున్న సంక్షోభాన్ని పరిష్కరించాలని ప్రయత్నిస్తున్నది. సామ్రాజ్యవాదులు, దళారీ, నిరంకుశ బూర్జువా వర్గం దోచుకోవడానికి ఇంకా ఎన్నో సులభతర వాణిజ్య (ఈజ్ ఆఫ్ డూయింగ్) పద్ధతులను ప్రవేశపెడ్తున్నప్పటికీ, చిల్లిపడిన భారత ఆర్థికనావ తీరం చేరేలా లేదు. అసలు పెద్దనోట్ల రద్దుతోనే భారత ఆర్థికవ్యవస్థ క్షీణత వేగం పుంజుకున్నదని ప్రముఖ బూర్జువా ఆర్థికవేత్తలు సైతం వ్యాఖ్యానిస్తున్నారు. ఈ మధ్యనే నోబెల్ బహుమతిని పొందిన అభిజిత్‌బెనర్జీ ఈ విషయాన్ని నొక్కి వక్కాణించడంతో పాటు, భారత ఆర్థిక వ్యవస్థ చాలా బలహీనంగా ఉందనీ, కుప్పకూలే ప్రమాదం లేకపోలేదని హెచ్చరించాడు. మోడీ ప్రభుత్వం మొదటి ఐదు సంవత్సరాల కాలంలో చేపట్టిన పెద్దనోట్ల రద్దు, జి.ఎస్.టి సంస్కరణలు భారత ఆర్థిక వ్యవస్థను సంక్షోభం నుండి బయటపడేయ్యకపోగా, మరింత అగాధంలోకి నెట్టాయి. భారత ఆర్థిక వ్యవస్థకు, అచ్చేదిన్ అంతరించాయని బూర్జువా ఆర్థికవేత్తలు సైతం వాఖ్యానించడం సాధారణమైపోయింది.

పై నేపథ్యంలోనే అంటే 'సంస్కరణల' పేరుతో పీడిత ప్రజలను మరింత, మరింత దోపిడీ పీడనలకు గురి చేస్తున్న పరిస్థితులలో, పాలకవర్గాలపై ప్రజలలో పెరుగుతున్న అసంతృప్తినీ, ఆగ్రహాన్ని చల్లార్చేందుకూ, తిరుగుబాట్లను అణచివేసేందుకు మన దేశంలో కూడా పాలకవర్గాలు ఫాసిజాన్ని ఒక రాజకీయ సాధనంగా ఎంచుకున్నాయి. ఈ నేపథ్యంలో సామ్రాజ్యవాదులు, ముఖ్యంగా అమెరికన్ సామ్రాజ్యవాదుల, వారికి సేవ చేసే భారత దళారీ బూర్జువా, హిందుత్వ భూస్వామ్య శక్తుల, హిందూ ఫాసిస్టు సంస్థల (ఆర్.ఎస్.ఎస్, వి.హెచ్.పి వంటి) అండదండలతో మోడీ నేతృత్వంలోని బి.జె.పి తిరిగి అధికారంలోకి వచ్చింది. నేడు దేశంలో ఫాసిజం, బ్రాహ్మణవాద హిందూ స్వభావాన్ని కలిగి, ముస్లింమత మైనారిటీలనూ, దళితులనూ, ఆదివాసీలనూ, మహిళలనూ, పీడిత జాతులనూ, పీడిత వర్గాలనూ, లౌకికవాదులనూ, ప్రజాస్వామిక వాదులనూ, విప్లవ శక్తులను అణచివేసేందుకు తీవ్రమైన దాడిని కొనసాగిస్తున్నది. చివరికి ప్రతిపక్షాలను సైతం ఆర్థిక దాడుల ద్వారా లొంగదీసుకొంటున్నది. మరోవైపు మోడీ అనేక అంతర్జాతీయ వేదికలపై టెర్రరిజానికి వ్యతిరేకంగా గొంతు చించుకుంటూ, భారతదేశానికి సీమాంతర ఉగ్రవాదం ప్రమాదమంటూ, పాకిస్థాన్ వ్యతిరేక ఉన్మాదాన్ని రెచ్చగొడుతూ, దేశభక్తి ముసుగులో మధ్య తరగతిలోని ఒక సెక్షన్‌ను ఆకర్షిస్తున్నది. వారిలో కొద్ది మందిని తన హిందూఫాసిస్టు నిర్మాణాలలోకి సంఘటిత పరుస్తున్నది. మోడీ ప్రభుత్వం రెండవసారి అధికారంలోకి రాగానే ఆర్టికల్ 370, 35(ఎ)లను రద్దు చేసి, కశ్మీర్ జాతి ప్రజల ఆకాంక్షలపై అమానవీయంగా దాడి చేసింది. ఎన్.ఆర్.సి (జాతీయ పౌరసత్వ రిజిస్టర్) పేరుతో అసాంలో ముస్లీంలను 'అక్రమ వలసదారులు'గా ముద్ర వేసి, భయోత్పాతానికి గురి చేస్తున్నది. గోసంరక్షణ పేరుతో దళితులపైన, ముస్లిం మైనారిటీలపైన 'మాబ్‌లించింగ్' పద్ధతిలో జరుగుతున్న దాడులు మరింత క్రూరమైన రూపాలను తీసుకొంటున్నాయి. ఎన్.ఐ.ఎ, ఉపా చట్టాలకు సవరణలు చేసి, వాటిని మరింత క్రూరంగా మార్చింది. ప్రజలు పోరాడి సాధించుకున్న

సమాచార హక్కు చట్టాన్ని బలహీనపర్చింది. నూతన జాతీయ విద్యా విధానం, నూతన అటవీ హక్కుల చట్టం మొదలగు 'ముసాయిదా చట్టాలలో' సామ్రాజ్యవాదుల, దేశీయ దళారీ, నిరంకుశ బూర్జువా, హిందూ బడా భూస్వామ్య శక్తుల ప్రయోజనాలకు అనుగుణమైన విషయాలనూ, విధానాలను జొప్పించింది. 'రియల్‌ఎస్టేట్', 'దివాలాస్మృతి' చట్టాలను సైతం సామ్రాజ్యవాద ద్రవ్య సంస్థలకు దోచిపెట్టేందుకే తెచ్చింది. ఇప్పుడు దేశంలో అన్ని వర్గాల, అన్ని సెక్షన్‌ల, అన్ని రంగాల ప్రయోజనాలు విదేశీ, దేశీయ కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలకు లోబర్చి వుంచడమే 'దేశభక్తి'గా చలామణి చేస్తున్నారు. ఇందుకు భిన్నంగా మాట్లాడేవారినీ, వ్యవహరించేవారిని దేశద్రోహులుగా ముద్రవేస్తూ, వారిపై ఫాసిస్టు దాడులు కొనసాగిస్తున్నారు.

నేడు మోడీ ప్రభుత్వం దేశంలో సామ్రాజ్యవాదుల, దళారీ నిరంకుశ బూర్జువా భూస్వాముల ప్రయోజనాలను నెరవేర్చే 'బ్రాహ్మణీయ హిందూ రాజ్యాన్ని' స్థాపించమే ప్రధాన లక్ష్యంగా పని చేస్తున్నది. ఈ లక్ష్యానికి ప్రధాన ఆటంకంగా, మన పార్టీ నేతృత్వంలో పురోగమిస్తున్న విప్లవోద్యమం ఉంటున్నదని భావిస్తున్నది. అందుకే విప్లవోద్యమాన్ని సంపూర్ణంగా నిర్మూలించేందుకు, అత్యంత ఫాసిస్టు స్వభావం కలిగిన ఆపరేషన్ 'సమాధాన్' దాడిని కొనసాగిస్తున్నది. చివరకు విప్లవోద్యమానికి మద్దతు తెలిపే ప్రజాస్వామికవాదులనూ, మేధావులను అర్బన్ మావోయిస్టులంటూ, వారిపై అక్రమ కేసులు బనాయించి జైళ్ళపాలు చేస్తున్నది. నేడు భారత దోపిడీ పాలకవర్గాలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించుకొనేందుకు ప్రధానంగా బలప్రయోగంపైన, సాయుధ బలగాలపైన ఆధారపడేందుకు నిర్ణయించుకున్నాయి. ఈమధ్య దేశ రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ సైనికులతో మాట్లాడుతూ "నేడు దేశం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చివరి ఆశ మీరే"నంటూ ప్రకటించాడు. అయితే మోడీ ప్రభుత్వం కొనసాగిస్తున్న ఫాసిస్టు విధానాలు, దేశంలో నాలుగు మౌలిక వైరుధ్యాలను తీవ్రతరం చేస్తున్నాయి. అదే విధంగా నిజమైన విప్లవకర కార్మికవర్గ పార్టీ నేతృత్వంలో పీడితవర్గాల, పీడిత సెక్షన్‌ల ప్రజలూ, వాటికి నేతృత్వం వహిస్తున్న ఇతర సంస్థలు ఐక్యమై బ్రాహ్మణవాద హిందూ ఫాసిజాన్ని ఓడించాల్సిన చారిత్రక కర్తవ్యాన్ని నిర్దేశిస్తున్నాయి.

**ఆంధ్రప్రదేశ్ - ఒడిశా పరిస్థితి**

ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాలలో ఏప్రిల్-మే, 2019లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వై.ఎస్.ఆర్.సి.పి పార్టీ, బి.జె.డి పార్టీలు అధికారంలోకి వచ్చాయి. ప్రాంతీయ పార్టీలుగా ఇవి కూడా దేశంలో దళారీ, నిరంకుశ బూర్జువా భూస్వామ్య వర్గాలకు రాజకీయంగా ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. సామ్రాజ్యవాదులకు సేవచేసే స్వభావంతో ఎల్.పి.జి విధానాలను అమలు పరచడంలో పోటీ పడ్తున్నాయి. పీడిత ప్రజలనూ, వారికి నేతృత్వం వహిస్తున్న విప్లవ పార్టీలను అణచివేయడంలో కేంద్రంతో కుమ్మక్కు అవుతూ, అత్యంత క్రూరంగా ఫాసిస్టు పద్ధతులు అమలు చేస్తున్నాయి.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వై.ఎస్.ఆర్.సి.పి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత రాష్ట్రంలో అవినీతి లేని పాలన, నిరుద్యోగ నిర్మూలన అంటూ, గ్రామ వాలంటీర్లు, గ్రామ సచివాలయాల ఏర్పాటుతో, పరిపాలనా వ్యవస్థలో కొన్ని మార్పులనూ, మోసపూరిత సంస్కరణలనూ, పథకాలను ప్రవేశపెడుతూ, ప్రజలకు తమ ప్రభుత్వంపై భ్రమలు కల్పించి తమ దోపిడీని కొనసాగించడానికి తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నది. ముఖ్యంగా మన ఉద్యమ ప్రాంతంలోని ప్రజలను పోరాటాల నుంచి పక్కదారి పట్టించడానికి విశాఖ మన్యంలో బాక్సైట్ జి.ఒ నంబర్ 97ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. మరోవైపు ప్రజా ఉద్యమాలనూ, విప్లవోద్యమాన్ని అణచివేయడానికి తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నది. రాష్ట్ర హోంమంత్రి సుచరిత కొత్తగా గిరిజన బెటాలియన్, మహిళా బెటాలియన్‌ను ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. విశాఖ మన్యంలో కొత్తగా పోలీసు క్యాంపుల ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి. నిరంతరం కూంబింగ్‌లను కొనసాగిస్తున్నారు. విశాఖ మన్యంలో గత 3 నెలల కాలంలోనే మూడుసార్లు పి.ఎల్.జి.ఎ బలగాలపై పోలీసుల దాడి జరిగింది. మరోవైపు మానసిక యుద్ధాన్నీ, పార్టీపై దుష్ప్రచార దాడిని తీవ్రతరం చేస్తూ, లొంగుబాట్లను పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నారు. కమ్యూనిటీ పోలీసింగ్, ఫ్రెండ్లీ పోలీసింగ్ పేర్లతో జనమైత్రి శిబిరాలనూ, పోలీసు సంస్కరణలను పెద్ద ఎత్తున అమలు చేస్తున్నారు. నాయకత్వ నిర్మూలనకూ, దళాల నిర్మూలన కోసం తీవ్రంగా ప్రయత్నాలు కొనసాగిస్తూ, ఇంటలిజెన్సీ వ్యవస్థనూ, ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్‌ను బలోపేతం చేసుకుంటున్నారు. అయితే జగన్ ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణలు, పథకాలు కేవలం వై.ఎస్.ఆర్.సి.పి పార్టీకి అనుకూలంగా ఉండే వారికి మాత్రమే లబ్ధి చేకురుస్తున్నాయి. అవి విశాల ప్రజానీకానికి ఉపయోగపడకపోగా, వారి మౌలిక సమస్యలు రోజురోజుకు తీవ్రతరమవుతున్నాయి. మరోవైపు ఈ సంస్కరణల అమలులో జరుగుతున్న అవకతవకలు, అవినీతి కారణంగా ఘర్షణలు తలెత్తుతున్నాయి. అంగన్‌వాడీలు, ఏ.ఎన్.ఎమ్‌లు, రేషన్ డిపో డీలర్లు తమ ఉద్యోగాల తొలగింపుకు వ్యతిరేకంగా ఆందోళనలు చేస్తున్నారు. ప్రజల మౌలిక సమస్యలు సంస్కరణల ద్వారా పరిష్కారం కావు. కనుక ప్రజలు పోరాడక తప్పదు. ఈ నేపథ్యంలో మనం జగన్ ప్రభుత్వ బహుముఖ దాడిని బహిర్గతం చేస్తూ, నిర్బంధాన్ని చొరవగా ప్రతిఘటిస్తూ, వివిధ సమస్యలపై ప్రజలను కదిలించాల్సిన అవసరం ఉంది. ప్రజల మౌలిక సమస్యలు పరిష్కారం అయ్యే నూతన ప్రజాస్వామిక విప్లవ విజయం కోసం ప్రజలను సంఘటితం చేయాలి.

ఒడిశా రాష్ట్రంలో బి.జె.డి నవీన్‌పట్నాయక్ ప్రభుత్వమే మళ్ళీ 5వ సారి అధికారాన్ని చేపట్టింది. గత 20 ఏళ్ళుగా అధికారంలో వున్న నవీన్ ప్రభుత్వం అమలు జరిపిన విధానాలు సామ్రాజ్యవాద అనుకూలమైనవి, ప్రజావ్యతిరేకమైనవి. అయినప్పటికీ, మళ్ళీ

అధికారంలోకి రావడానికి ప్రధానంగా రాష్ట్రంలో ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ తన గత పాలనా వైఫల్యాల నుంచి ప్రజల విశ్వాసాన్ని పొందలేకపోవడం, కేంద్రంలోని బి.జె.పి ప్రభుత్వ వైఫల్యాలను బి.జె.డి సమర్థవంతంగా ఉపయోగించుకోగలగడం (పెద్ద నోట్ల బదిలీ, జి.ఎస్.టి, నిరుద్యోగ సమస్యలు ...వగైరా). రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని కోటి సంతకాల సేకరణ చేపట్టడం, చత్తీస్‌ఘడ్-ఒడిశాల మధ్య జలవివాదాన్ని(మహానది) తమకనుకూలంగా ఉపయోగించుకోవడంతో పాటుగా, ప్రజల వెనకబాటుతనాన్నీ, ఒడిశా ప్రాంతీయతనూ, సెంటిమెంట్లను ఉపయోగించుకున్నది. కలియా యోజనా (రైతాంగానికి ఋణమాఫీ, నిరుద్యోగ భృతి) వంటి పథకాలతో ప్రజలను మోసపుచ్చటానికి ప్రయత్నించింది. వీటన్నింటితోపాటు, తమకు అత్యంత అనుకూలంగా పని చేస్తున్న నవీన్‌ను తిరిగి అధికారంలోకి తేవటానికి కార్పొరేట్ సంస్థలు వేల కోట్లు ఖర్చుపెట్టీ, మీడియాను కొనివేసి, పెద్ద ఎత్తున డబ్బులు పంపిణీ చేసి, నవీన్‌ను గెలిపించారు. అయితే నవీన్ ప్రభుత్వం కొనసాగిస్తున్న ప్రజావ్యతిరేక విధానాల కారణంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా వివిధ సెక్షన్‌ల ప్రజల ఆందోళనలు తీవ్రతరమవుతున్నాయి. ముఖ్యంగా రాష్ట్రంలో వ్యవసాయ రంగంలో అభివృద్ధి లేకపోవడం, సంక్షోభతీవ్రత పెరగడం వలన రైతాంగ ఆత్మహత్యలు కొనసాగుతూనే ఉన్నాయి. నిరుద్యోగం, ఉపాధిలేమి కారణంగా దేశంలో ఎక్కడా లేనంతగా ఒడిశా నుంచి పెద్ద ఎత్తున వలసలు కొనసాగుతున్నాయి. కాంట్రాక్ట్ బేస్డ్ ఉద్యోగాలలో అతి తక్కువ వేతనాలు, ఉద్యోగ భద్రత లేకపోవడం వంటి సమస్యలతో అసంఘటిత రంగాల కార్మికులు ఆందోళనలు చేస్తున్నారు. రాష్ట్రంలోని 3 రీజియన్‌లలో తీవ్రమైన అసమానభివృద్ధి వుంది. కోస్టల్ బెల్ట్‌లోని సంపన్నవర్గాల ప్రయోజనాలకు అధిక ప్రాధాన్యతను ఇస్తూ, రాష్ట్రంలో రాజకీయలలో, ఉద్యోగాలలో, వ్యాపారాలలో వీరి ఆధిపత్యమే ఉడటం వలన ఇతర ప్రాంతాలు అభివృద్ధికి నోచుకోక తీవ్ర పేదరికంలో మగ్గిపోతున్నాయి. అన్నింటికంటే ముఖ్యంగా ప్రభుత్వం, రాష్ట్రంలోని ఖనిజ సంపదను అంతర్జాతీయ, దేశీయ కార్పొరేట్లకు దోచిపెట్టడానికి, వారితో అనేక ఎమ్.ఒ.యులు కుదుర్చుకున్న ఫలితంగా, లక్షలాది మంది ఆదివాసీలు, పీడిత ప్రజలు నిర్వాసితులుగా మారుతున్నారు. పర్యావరణం దెబ్బతింటున్నది. ప్రభుత్వం ఒకవైపు ప్రజలను నిర్వాసితులను గావించే విధానాలు అమలు చేనస్తూ, పోలవరం డ్యాంను వ్యతిరేకిస్తున్నట్లు ఫోజు పెడుతున్నది. ప్రజలను మోసం చేసే ప్రభుత్వ పథకాలను ఎన్.జి..ఒల ద్వారా అమలు చేయించే కాంట్రాక్టులను కుదుర్చుకున్నది. అవినీతి ఆరోపణలను (శారదా చిట్‌ఫండ్స్) ఎదుర్కొంటూ ప్రజల అసహ్యానికీ, ఆగ్రహానికి గురవుతున్నది. ఈ విధంగా ఒడిశా రాష్ట్రంలో నవీన్ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల ఫలితంగా మౌలిక వైరుధ్యాలు తీవ్రతర మవుతున్నాయి. మరోవైపు నవీన్ ప్రభుత్వం ఉద్యమిస్తున్న ప్రజలపైనా, ఆ ఉద్యమాలకు నాయకత్వం వహిస్తున్న విప్లవ, ప్రజాస్వామిక సంస్థలపైన తీవ్రమైన నిర్బంధాన్ని అవలంభిస్తున్నది. ముఖ్యంగా మావోయిస్టు ఉద్యమాన్ని నిర్మూలించడానికి ప్రయత్నిస్తున్నది.

**ప్రియమైన కామ్రేడ్స్,**

నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా 'సమాధాన్' పేరుతో కొనసాగించే నూతన వ్యూహాత్మక బహుముఖదాడిని ఓడించడానికి, మన ప్రజాయుద్ధం సాధించిన విజయాల్ని కాపాడుకోవడానికి దేశవ్యాప్తంగా ప్రజా బాహుళ్యాన్ని మేల్కొల్పి విశాలమైన ఉద్యమాన్ని నిర్మించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. కనుక బ్రాహ్మణీయ హిందూ ఫాసిజాన్ని అన్ని రకాల అభివృద్ధి నిరోధక, ఫాసిస్టు విప్లవ ప్రతీఘాతుక శక్తులను కూకటివేళ్ళతో పెకిలించి, నిజమైన ప్రజాస్వామిక ఫెడరల్ రిపబ్లిక్‌ను స్థాపించే లక్ష్యంతో పోరాడాలి.

---

"విప్లవ అగ్రగాములుగా అనేక మందికి శిక్షణనివ్వడం అవసరం. రాజకీయంగా దూరదృష్టి కలిగిన వాళ్ళు, పోరాట, ఆత్మత్యాగ స్ఫూర్తి కలిగిన వాళ్ళకు శిక్షణ నివ్వాలి. విశాల హృదయం ఉన్నవాళ్ళు, విధేయంగా, చురుకుగా సూటిగా ఉన్నవాళ్ళు, ఎన్నడూ తన స్వార్థప్రయోజనాల గురించి ఆలోచించనివాళ్ళు, జాతి, సమాజ విముక్తికోసం మనస్ఫూర్తిగా పనిచేసేవాళ్ళు కష్టాలకు వెరవకుండా, దృఢంగా ఉంటూ, కష్టాల నడుమ ధైర్యంగా పురోగమించేవాళ్ళు, ఎల్లప్పుడూ తామే ఆధిపత్యంలో ఉండాలని కోరుకోకుండా, వెలుగులోకి రావాలని కోరుకోకుండా ఉన్నవాళ్ళు, కానీ ఆచరణాత్మక స్పృహ ఉన్నవాళ్ళు -చైనాలో ఇటువంటి అగ్రగామి శక్తులు ఉంటే చైనా విప్లవ కర్తవ్యాలు విజయవంతంగా పరిపూర్తి అవుతాయి"

- (పెకింగ్ రివ్యూ 1970 ఆగస్టు 14 నెం 33)

# ఎ.ఒ.బి 3వ మహాసభ, 3వ ప్లీనం ఆమోదించిన తీర్మానాలు











## 1. అమరులకు జోహార్లు

ఎ.ఒ.బి జోన్ 3వ మహాసభ, 2వ ప్లీనాన్ని 2013 ఫిబ్రవరిలో జరుపుకున్నాం. గడిచిన 6 సంవత్సరాల, 8 నెలల కాలంలో మన పార్టీపైన, విప్లవోద్యమంపైన ప్రభుత్వం కొనసాగిస్తున్న పాశవిక ఆపరేషన్ గ్రీన్‌హంట్, 'సమాధాన్' బహుముఖ దాడినీ, బ్రాహ్మణీయ హిందూ ఫాసిజాన్ని వీరోచితంగా ఎదుర్కొంటూ, దేశవ్యాప్తంగా కేంద్రకమిటీ సభ్యుల నుంచి సాధారణ ప్రజల వరకు వందలాది మంది కామ్రేడ్స్ అమరులయ్యారు. ఎ.ఒ.బి జోన్‌లో కూడా పార్టీ కేంద్ర కర్తవ్యాన్ని, జోన్ ప్రధాన, తక్షణ కర్తవ్యాల అమలుకు కృషి చేస్తూ, ఎస్.జడ్.సి సభ్యుల నుంచి సాధారణ ప్రజల వరకు 136 మంది నూతన ప్రజాస్వామిక విప్లవ విజయానికై తమ అమూల్యమైన ప్రాణాలను అర్పించారు. వీరిలో 41 మంది మహిళా కామ్రేడ్స్ ఉన్నారు. స్థాయిల వారిగా చూస్తే, ఎస్.జడ్.సి సభ్యులు నలుగురి (కామ్రేడ్స్ మహిత, గంటిప్రసాదం, దయ, ప్రసాద్)తోపాటు, డి.వి.సి స్థాయి కామ్రేడ్స్ 10 మంది, ఎ.సి/పి.పి.సి స్థాయి కామ్రేడ్స్ 39 మంది, పార్టీ సభ్యులు/దళ సభ్యులు 25 మంది, మిలీషియా 31 మంది, పార్ట్ టైం పార్టీ సభ్యులు/సంఘ సభ్యులు ఆరుగురు, పార్టీ సానుభూతిపరులు ముగ్గురు, బహిరంగ ప్రజాసంఘాల నాయకులు ఐదుగురు, సాధారణ ప్రజలు 13 మంది అమరులయ్యారు. వీరి అమరత్వం పార్టీకి, ఎ.ఒ.బి ఉద్యమానికి ఎనలేని నష్టాన్ని కలిగించింది. వీరి కుటుంబ సభ్యులకూ, శ్రేయోభిలాషులకు

తీవ్రమైన దుఃఖాన్ని కలిగించింది. ఈ అమరుల త్యాగం వెలకట్టలేనిది. అమరులు సదా చిరస్మరణీయులు, అనుసరణీయులు.

ఎ.ఒ.బి 3వ మహాసభ, 3వ ప్లీనం ఈ సందర్భంగా అమరుల కుటుంబాలకు, బంధుమిత్రులకు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తున్నది. అలాగే అమరుల త్యాగాల స్ఫూర్తితో, వారి ఆశయాలను తుదకంటా కొనసాగిస్తామని ప్లీనం ప్రతిజ్ఞ చేస్తున్నది.

## 2. జైలు కామ్రేడ్స్‌పై తీర్మానం

2013 ప్లీనం తర్వాత మన ఎ.ఒ.బి జోన్ పరిధిలో గ్రామ స్థాయి నుంచి పై కమిటీల వరకు అనేక మంది కామ్రేడ్స్ అరెస్టులై, జైళ్ళలో ఉన్నారు. శతృవు పెట్టిన చిత్రహింసలకు వారు లొంగలేదు. ఎల్.ఐ.సి పాలసీలో భాగంగా అమలు జరిపిన అనేక కుటిల పన్నాగాలకు లొంగలేదు. అటువంటి వారిని దీర్ఘకాలిక శిక్షలకు గురిచేసి, వారి మనోనిబ్బరాన్ని దెబ్బతీయాలని చూసినా, వారు శతృ శిబిరంలో పార్టీ గౌరవాన్ని, పోరాట సాంప్రదాయాలను కొనసాగిస్తున్నారు.

2014లో జైలు అధికారుల దుర్మార్గాలకు, అవినీతికి వ్యతిరేకంగా పోరాడుతూ, వారి నిర్లక్ష్యానికి, దుర్మార్గానికి విశాఖ జైలులో కామ్రేడ్ మంగరాజు అమరుడయ్యాడు. మల్కనగిరి, కొరాపుట్ జైళ్ళలో మరొక నలుగురు కామ్రేడ్స్ అమరులయ్యారు. వారికి ఈ ప్లీనం జోహార్లు చెబుతోంది.

1995లో సుబ్బరామిరెడ్డి కిడ్నాప్ కేసులో యావజ్జీవ కారాగార శిక్ష విధించబడిన కామ్రేడ్ పంతగి బాలవెంటక గణేష్ జైలులో విప్లవ శిబిరంలో ఉండి, నేటికి స్ఫూర్తిదాయకంగానే ఉన్నాడు. ఇప్పటికీ ప్రభుత్వం అతనిని విడుదల చేయకుండా జైలులోనే ఉంచింది.

వినీల్‌కృష్ణ కేసులో యావజ్జీవ శిక్ష విధించబడి, 7 సంవత్సరాల నుంచి కామ్రేడ్ దివ్య జైలులోనే ఉన్నది. దేశంలోని ఇతర ప్రాంతాలలో మన ఉద్యమ సంబంధంలో అరెస్టులయ్యి, అనేక మంది జైళ్ళలో దృఢంగా ఉండి, పోరాట స్ఫూర్తిని కొనసాగిస్తున్నారు. ఈ కామ్రేడ్స్ అందరికీ ఈ ప్లీనం విప్లవ జేజేలు తెలుపుతోంది. దేశీయంగానూ, అంతర్జాతీయంగాను సామ్రాజ్యవాద వ్యతిరేక, ప్రజాస్వామిక, ఇంకా ఇతర ఉద్యమాలలోనివారు అరెస్టుల అయి శతృ శిబిరంలో కూడా దృఢంగా ఉన్న వారికి కూడా ఈ ప్లీనం విప్లవ జేజేలు తెలుపుతోంది.

జైలులో ధైర్యంగా, మరోనిబ్బరంతో ఉండి, శతృవుకు వ్యతిరేకంగా పోరాడుతూ, స్ఫూర్తిని కలిగిస్తున్న వారి విడుదల కోసం జైలు బయట సంఘీభావ ఉద్యమాలు కొనసాగించాలనీ, వారికి అన్ని విధాల సహాయ సహకారాలు అందించవలసిన అవసరాన్ని ఈ ప్లీనం తెలియజేస్తోంది.

## 3. పర్యావరణ సంక్షోభంపై తీర్మానం

పెట్టుబడిదారీ సామ్రాజ్యవాదం అనుసరిస్తున్న విధ్వంసకర విధానాల వలన, ప్రకృతి వనరుల సంక్షోభం ఏర్పడుతున్నది. ముఖ్యంగా పెట్టుబడిదారీ విధానంలోని అరాచకపు ఉత్పత్తి ఫలితంగా, భూమి మీద భరించలేనంత స్థాయిలో వ్యర్థపదార్థాలు పేరుకుపోతున్నాయి. ఈ విధానాల ఫలితంగా పర్యావరణం ప్రమాదంలో పడింది. ఈ ప్రమాదపు వ్యక్తీకరణలుగా పెరుగుతున్న వరద బీభత్సాలు, కరువులు, భూకంపాలు, అడవులు తగలబడటం వగైరా రూపాలు ఉన్నాయి. అయితే పాలకవర్గాలు పర్యావరణ పరిరక్షణ పేరుతో నాటకీయంగా అనేక ఒప్పందాలు కుదుర్చుకుంటున్నాయి. వీటిలో ప్యారిస్ ఒప్పందం అతి ముఖ్యమైనది. ఈ ఒప్పందం ప్రకారం సామ్రాజ్యవాద దేశాలతోపాటు, ప్రపంచంలోని అన్ని దేశాలు పర్యావరణ పరిరక్షణకు అవసరమైన చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా పారిశ్రామల నిర్వహణ వలన వెలువడుతున్న కార్బన్ ఉద్గారాలను నియంత్రించాలి. కానీ సామ్రాజ్యవాదులు, వారి దళారీలైన వెనుకబడిన దేశాల పాలకవర్గాలు తమ లాభాపేక్షకై ఈ ఒప్పందాలను ఉల్లంఘిస్తున్నారు. చివరికి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అత్యంత అహంభావంతో, నిర్లక్ష్యపూరితంగా ఈ ఒప్పందం నుంచి అమెరికా వైదొలగుతున్నదని ప్రకటించాడు. ఈ దోపిడీ వర్గాలు మొత్తం భూగోళాన్నే ప్రమాదపు అంచుల్లోకి నెడుతున్నాయి. కనుక మన దేశంలో జరుగుతున్న వర్గపోరాటంలో భాగంగా పర్యావరణాన్ని రక్షించుకొనేందుకు సామ్రాజ్యవాదులకూ, వారి తైనాతీలైన దళారీ, నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గాలకు వ్యతిరేకంగా పోరాటం చేపట్టాలి. ప్రస్తుతం మోడీ నేతృత్వంలోని బి.జె.పి ప్రభుత్వం సామ్రాజ్యవాదులకు అంటకాగుతూ, 'మేక్ఇన్ఇండియా' నినాదం ముసుగులో దేశంలోకి విదేశీ పెట్టుబడులను ఆహ్వానిస్తూ, దేశ సంపదను వారికి తాకట్టు పెట్టడమే కాకుండా, పర్యావరణ విధ్వంసానికి కూడా కారణం అవుతున్నది. కనుక మనం నిర్వహిస్తున్న ప్రజాయుద్ధంలో భాగంగా, పర్యావరణ పరిరక్షణకు ప్రజలను చైతన్యపరుస్తూ, పోరాటంలోకి సమీకరించాలని ఈ ప్లీనం పిలుపునిస్తున్నది.

## 4. నిర్బంధంపై తీర్మానం

ఫాసిస్టు నరహంతక, సామ్రాజ్యవాదుల పెంపుడు కుక్క నరేంద్రమోడీ నాయకత్వంలో బి.జె.పి ప్రభుత్వం 2014లో అధికారంలోకి వచ్చిన నాటి నుంచి, ప్రత్యేకించి మన ఉద్యమం మీద, ఇంకా దేశంలోని మిగిలిన సాయుధ పోరాటాల మీద అణచివేత దాడిని పెంచుకుంటూ వస్తున్నది. 2017లో కేంద్ర హోం మంత్రి, కరుడగట్టిన భూస్వామి రాజనాథ్‌సింగ్ నాయకత్వంలో, కౄర అధికారులైన అజిత్‌దోవల్ (రక్షణ సలహాదారు), విజయ్‌కుమార్‌ల సలహాలతో 'సమాధాన్' దాడి వ్యూహాన్ని రూపొందించారు. ఈ దాడిలో భాగంగా ప్రభుత్వ సాయుధ బలగాల సంఖ్యను, క్యాంపులను పెంచడం, మిలటరీ ఇన్‌స్ట్రక్టర్‌లచే శిక్షణ అందించడం, కమ్యూనికేషన్ వ్యవస్థను బలోపేతం చేయడం, కేంద్ర, రాష్ట్ర బలగాల మధ్యనూ, సరిహద్దు కలిగిన ఉద్యమ రాష్ట్రాల బలగాల

మధ్యను సమన్వయంలో మెరుగుదల సాధించడం, హ్యూమన్, టెక్నికల్ ఇంటలిజెన్సీలను మెరుగుపరిచి, సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకోవడం, సమాచార ఆధారిత దాడులు చేసి, నాయకత్వాన్ని, కార్యకర్తలను నిర్మూలించడం వగైరా నిర్బంధ ప్రక్రియలను వేగవంతం చేశారు.

ప్రభుత్వంలోని వివిధ డిపార్ట్‌మెంట్‌లు ఉద్యమ నిర్మూలనే లక్ష్యంగా పని చేస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ ఉద్యోగుల నుంచీ, వివిధ స్వచ్ఛంద సంస్థల నుంచీ, బూర్జువా పార్టీల సభ్యుల నుంచి ఇన్‌ఫార్మర్ వ్యవస్థను తయారు చేస్తున్నాయి. ఉద్యమ నిర్మూలనకు సంస్కరణల పరంపర కొనసాగిస్తున్నాయి. ముఖ్యంగా పోలీసు డిపార్ట్‌మెంటు ద్వారానే అన్ని ప్రభుత్వ కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి. విద్యార్థులు, యువతను తమ సంస్కరణలతో ఆకర్షించి, వారి నుంచి ఇన్‌ఫార్మర్ వ్యవస్థను తయారు చేసుకుంటున్నాయి. ఒక పద్ధతి ప్రకారం మానసిక యుద్ధాన్నీ, దుష్ప్రచార దాడినీ, సరెండర్లను మొదలైన వాటిని నిరంతరం కొనసాగిస్తున్నాయి. పోలీసు అధికారులు ఉద్యమంలో పని చేస్తున్న కార్యకర్తలకూ, కొద్దిమంది క్యాడర్లకు సరెండర్ కావాలని ఉత్తరాల రాయడం ద్వారా మానసిక ఒత్తిడిని కలిగించే పద్ధతిని అనుసరిస్తున్నారు.

ప్రభుత్వాలు 'అర్బన్ మావోయిస్టుల' పేరుతో ప్రజా సంఘాల నాయకుల, విప్లవ మేధావుల మీద బూటకపు కేసులు పెట్టి, సుదీర్ఘ కాలం జైళ్ళలో బంధిస్తున్నాయి. మోడీ ప్రభుత్వ ఫాసైజేషన్‌లో భాగంగా కోర్టులు సైతం అత్యంత దుర్మార్గంగా వికలాంగుడు, ప్రజాస్వామికవాది, మేధావి అయిన సాయిబాబాతోపాటు, మరి కొంతమందికి యావజ్జీవ కారాగార శిక్షలు విధించాయి. ఆర్.ఎస్.ఎస్, భజరంగ్‌దళ్ వంటి ఫాసిస్టు ముఠాలు నరేంద్ర దభోల్కర్, ఎమ్. ఎమ్. కల్బుర్గి, గౌరీ లంకేష్, వంటి ప్రజాస్వామిక మేధావులను హత్యలు చేసి, మిగిలిన వారిని బెదిరింపులకు గురి చేస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా ఉద్యమాలను అణచివేసే ఉద్దేశ్యంతో గతంలో నుంచి కొనసాగుతున్న క్రూర నల్ల చట్టాలను మరింత క్రూరంగా మార్చివేస్తున్నాయి. 'ఉపా' చట్టంలో మార్పులు చేసి, ఏ వ్యక్తినైనా టెర్రరిస్టుగా ప్రకటించి, వారి ఆస్తులను స్వాధీనం చేసుకునే అధికారం ప్రభుత్వం తన చేతిలోకి తీసుకుంది. ఎన్.ఐ.ఎ చట్టంలో మార్పులు చేసి, పోలీసు అధికారులకు మరిన్ని అధికారాలు అప్పజెప్పింది. కేంద్ర ప్రభుత్వం సమాచార హక్కు చట్టంలో మార్పులు చేసి, దానిని నిరుపయోగం చేసింది.

బి.జె.పి. రెండవసారి అధికారంలోకి వచ్చిన తర్వాత అమిత్‌షాను హోంమంత్రిని చేసి, కాశ్మీర్‌కు స్వయంనిర్ణయాధికార హక్కును కల్పించే 370, 35 (ఎ) ఆర్టికల్స్‌ను రద్దు చేసింది. కశ్మీర్ ప్రాంతమంతటా 7లక్షల సాయుధ బలగాలను పెట్టి, నిరంతర కర్ఫ్యూలతో కశ్మీర్‌ను జైలుగా మార్చివేసింది. కశ్మీర్ ఉద్యమాన్ని పాకిస్థాన్ ప్రేరేపిత టెర్రరిస్టు ఉద్యమంగా ప్రచారం చేస్తూ, కశ్మీర్ ప్రజలపై భారతదేశంలో వ్యతిరేతను పెంచుతున్నది. కశ్మీర్ ప్రజలకు మద్ధతు ఇస్తున్న మేధావులను దేశ ద్రోహులని ముద్ర వేసి, అక్రమ అరెస్టులు, గృహనిర్బంధాలు వంటి చర్యలుకు పూనుకుంటున్నది.

అంతే కాకుండా కేంద్ర, రాష్ట్రా ప్రభుత్వాలు వివిధ మిలటరీ నిపుణులతోపాటు, అతి క్రూరత్వం కలిగిన పోలీసు అధికారులతో విప్లవోద్యమం మీద పరిశోధన పత్రాలను తయారు చేయిస్తున్నాయి. ఈ పత్రాలతోపాటు, సెమినార్లు జరిపి, వాటి నుంచి వచ్చిన సంశ్లేషణను దృష్టిలో పెట్టుకొని, తన అణచివేత వ్యూహాన్ని రూపొందించుకుంటున్నాయి.

మొత్తంగా చూసినప్పుడు సాయుధ ఉద్యమాలను అణచివేయడం, విప్లవకారులను పెద్ద ఎత్తున హత్య చేయడం, క్రూరమైన చట్టాల ద్వారా ప్రజాసంఘాల ఉద్యమకారులను, ప్రజాస్వామిక మేధావులను అరెస్టులు చేయడం, వారి ఆస్తులు స్వాధీనం చేసుకోవడం, తిరిగి వీరి మీదనే దుష్ప్రచారం చేయడం వంటి పద్ధతులలో అణచివేతను సాగిస్తున్నది.

ఈ ప్లీనం ఈ భారీస్థాయి ఫాసిస్టు అణచివేతను వ్యతిరేకిస్తున్నది. 'సమాధాన్' పేరుతో జరుగుతున్న ఫాసిస్టు దాడికి వ్యతిరేకంగా యావత్తు ప్రజానీకాన్ని చైతన్య పరుస్తూ, విశాల ప్రజా రాశులను ఐక్యం చేస్తూ, ప్రజలను పోరాడేందుకు సిద్ధపర్చాలని పార్టీ కార్యర్తలకూ, క్యాడర్లకు ప్లీనం పిలుపునిస్తున్నది.

## 5. కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే ఆర్టికల్స్ 370, 35(ఎ)ల రద్దుపై తీర్మాణం

బ్రాహ్మణీయ హిందూ ఫాసిస్టు మోడీ ప్రభుత్వం జమ్ము-కశ్మీర్ రాష్ట్రాన్ని ప్రభుత్వ సాయుధ బలగాలతో దిగ్బందించి, రాష్ట్రానికి ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే ఆర్టికల్స్ 370, 35(ఎ)లను రద్దు చేస్తూ, జమ్ము-కశ్మీర్ పునర్వ్యవస్థీకరణ బిల్లు-2019ని అత్యంత నిరంకుశంగా, ప్రతిపక్షాల గొంతును సైతం నొక్కివేసి, మూకబలంతో ఆగస్టు 5, 6 తేదీలలో పార్లమెంటుచే ఆమోదింప చేసింది. దీనికి వెంటనే ఆమోదముద్ర వేస్తూ, దేశ రాష్ట్రపతి గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశాడు. ఈ చట్టం ప్రకారం ప్రజలు తమ కనీస హక్కులను సైతం కోల్పోయారు. దీని ప్రకారం రాష్ట్రాన్ని రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా –అసెంబ్లీతో కూడిన కేంద్రపాలిత ప్రాంతంగా జమ్ము-కశ్మీర్‌ను, అసెంబ్లీలేని కేంద్రపాలిత ప్రాంతంగా లడాక్ ప్రాంతాన్ని –పునర్వ్యవస్థీకరించారు.

ఆజాదీ కశ్మీర్‌ను సాధించుకునే లక్ష్యంతో, విడిపోయే హక్కుతో స్వయం నిర్ణయాధికార, ప్రజాస్వామిక ఆకాంక్షలతో 70 సంవత్సరాలుగా సాగుతున్న కశ్మీర్ ప్రజల పోరాటాన్ని క్రూరంగా ఉక్కుపాదంతో అణచివేయడం కోసం, కేంద్రంలోని అధికార హిందూ ఫాసిస్టు మోడీ-అమిత్‌షా-మోహన్‌భాగవత్ ముఠా లోక్‌సభలో తమకుగల మందబలాన్ని ఉపయోగించుకొని, జమ్ము-కశ్మీర్ రాష్ట్ర ప్రత్యేక ప్రతిపత్తిని రద్దు చేయడం ద్వారా వారే రూపొందించుకున్న

దేశ రాజ్యాంగాన్ని ఘోరంగా కూని చేసింది. ఇది కశ్మీర్‌ను మరోసారి దురాక్రమణ చేయడం తప్ప, మరొకటి కాదు. ఈ ఫాసిస్టు చర్యను ఈ ప్లీనం తీవ్రంగా ఖండిస్తున్నది.

## 6. 'నూతన అటవీ ముసాయిదా చట్టం-2019' పైనా, పట్టాలు లేని ఆదివాసీలను అడవుల నుంచి తరిమేయాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపైన తీర్మానం

2019లో తిరిగి అధికారంలోకొచ్చిన బ్రహ్మణీయ హిందూ ఫాసిస్టు మోడీ నేతృత్వంలోని బి.జె.పి ప్రభుత్వం దేశంలోని ముఖ్యంగా అటవీ ప్రాంతంలోని జల్, జంగల్, జమీన్‌లను తమ ప్రభువులైన సామ్రాజ్యవాదులకు కట్టబెట్టడానికి పథకాలు రూపొందిస్తున్నది. ఆదివాసీలు పోరాడి సాధించుకున్న చట్టాల(1/70 చట్టం, పెసాచట్టం, అటవీ హక్కులచట్టం)ను మోడీ ప్రభుత్వం నిర్వీర్యపరుస్తూ, 'నూతన అటవీ ముసాయిదా చట్టం-2019'ని తెచ్చేందుకు కుట్ర చేస్తున్నది. ఈ చట్టం వలన మొత్తం దేశంలోని మరియు మన ఎ.ఒ.బి ప్రాంతంలోని ఆదివాసీల జీవనాదారాలైన జల్, జంగల్, జమీన్‌లతోపాటు, వారి అస్తిత్వానికే ప్రమాదం ఏర్పడబోతున్నది. ఇప్పటికే మన ఉద్యమ ప్రాంతంలోని కొన్ని గ్రామాలలో ప్రజలు సాగుచేసుకుంటున్న పోడు భూములను అటవీశాఖ బలవంతంగా ఆక్రమించుకుంటున్నది. పోడు వ్యవసాయం చేసుకుంటున్న ప్రజల మీద కేసులు పెట్టి, జైళ్ళకు పంపుతున్నది. కనుక మోడీ ప్రభుత్వం ముందుకు తెస్తున్న ఆదివాసీ వ్యతిరేక నూతన అటవీ ముసాయిదా చట్టం-2019కి వ్యతిరేకంగా పోరాడుదాం.

29 డిసెంబర్, 2006నాడు భారత ప్రభుత్వం షెడ్యూల్ తెగలు, అడవులలో నివసిస్తున్న ఇతరుల కోసం 'అటవీ హక్కుల గుర్తింపు చట్టా'న్ని ఉనికిలోకి తెచ్చింది. ఈ చట్టాన్ని 'నూతన అటవీ చట్టం'గా కూడా ప్రజలు వ్యవహరిస్తున్నారు. మన దేశ అడవులలో నివసిస్తున్న ఆదివాసీలతోపాటు, ఆదివాసేతరులకు ఈ చట్టం ప్రకారం 10 ఎకరాల సాగు భూములకు పట్టాలు లభిస్తాయి. అయితే ఈ చట్టం వచ్చి 14 సంవత్సరాలు గడుస్తున్నా, ఆచరణలో పట్టాలిచ్చే కార్యక్రమం 'ఎక్కడ వేసిన గొంగడి అక్కడే' అన్న చందంగా ఒక్క అడుగు కూడా ముందుకు కదలలేదు. కానీ, ఇప్పుడు ఇదే దోపిడీ రాజ్యంలోని రాజ్యాంగ యంత్రంలో భాగంగా ఉన్న సుప్రీంకోర్టు ఫిబ్రవరి 13, 2019న మనదేశంలోని అడవులలో పట్టాలు లేకుండా ఉంటున్న ఆదివాసీలను మరియు ఇతరులను ఖాళీ చేయించాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ ఆదేశాలకు వ్యతిరేకంగా దేశ వ్యాపితంగా ఆదివాసీలు, ప్రజాస్వామికవాదులు, విప్లవ పార్టీలు పెద్ద ఎత్తున ఉద్యమించారు. దీంతో సుప్రీంకోర్టు తన ఆదేశాలను తాత్కాలికంగా ఉపసంహరించుకున్నది. అయితే తిరిగి ఎప్పుడో ఒకసారి ఈ ఆదేశాలు అమలులోకి వచ్చే ప్రమాదం ఉన్నది. కనుక ఈ దోపిడీ ప్రభుత్వాలు ఒకవైపున తాము చేసిన చట్టాలకనుగుణంగా పట్టాలు ఇచ్చే విషయంలో బాధ్యాతా రాహిత్యంగా వ్యవహరిస్తూ, మరోవైపు పట్టాలు లేనివారిని అడవుల నుంచి వెళ్ళగొట్టాలనే ఆదేశాలను జారీ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ, నూతన అటవీ చట్టం-2006కు అనుగుణంగా పట్టాలకోసమై ఆదివాసీ రైతాంగాన్ని సమీకరించి పెద్ద ఎత్తున ఉద్యమం చేపట్టాలి.

## 7. ఆర్.టి.సి కార్మికుల పోరాటంపై తీర్మాణం

పోరాటాల గడ్డ అయిన తెలంగాణ రాష్ట్రంలోని ఆర్.టి.సి కార్మికులు 30 రోజులుగా సమ్మె చేస్తున్నారు. కరుగట్టిన భూస్వామ్య, దళారీ, బూర్జువా వర్గాల ఏజెంటు ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు తలబిరుసుకు చెంపదెబ్బలాగా ఈ పోరాటం కొనసాగుతోంది. ప్రధానంగా ఇది ఆర్.టి.సి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్నది. ఈ మధ్య కాలంలో కార్మికవర్గం అత్యంత చైతన్యపూర్వకంగా, సంఘటితంగా పోరాడుతున్న ఉద్యమంగా దీనిని చెప్పుకోవచ్చు. ముఖ్యంగా ఈ పోరాటం ప్రజల, ఉద్యోగ వర్గాల, పార్టీల మద్దతును కూడా తీసుకొని ముందుకు పోతున్నది. ఈ పోరాటం నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగాలలోని వివిధ డిపార్ట్‌మెంట్‌ల ఉద్యోగులకు, కార్మికులకు ప్రేరణ కలిగించేదిగా ముందుకెలుతోంది. అందువలన ఈ కార్మిక పోరాటం ప్రాధాన్యతను సంతరించుకుంటున్నది.

ఈ ప్లీనం ఈ పోరాటానికి విప్లవ జేజేలు తెలుపుతోంది. ఈ పోరాటానికి సంఘీభావంగా రకరకాల రూపాలలో మద్దతు తెలియజేయవలసిందిగా ఆంధ్ర, ఒడిశా ప్రాంతాలలోని కార్మికవర్గానికీ, రైతాంగానికీ, విద్యార్థి, ఉద్యోగ, మేధావి రంగాలకు విజ్ఞప్తి చేస్తున్నది. అలాగే తెలంగాణ ఆర్.టి.సి కార్మికులు తమ న్యాయమైన డిమాండ్‌ను సాధించుకునే వరకు పోరాటాన్ని కొనసాగించగలరని ఈ ప్లీనం ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నది.

## 8. విధ్వంసకర అభివృద్ధికీ, నిర్వాసిత్వానికి వ్యతిరేకంగా పోరాడాలి

భారత దళారీ పాలకవర్గాలు తమ యజమానులైన ప్రముఖ సామ్రాజ్యవాదుల ప్రయోజనాలను ఈడేర్చేందుకు అనుసరిస్తున్న దివాళాకోరు ఆర్థిక విధానాలనే 'అభివద్ధి' కోసం జరుగుతున్న విధానాలుగా ప్రజలను మోసం చేస్తున్నాయి. వీరి అభివృద్ధి నమూనాలో గనులు, ప్రత్యేక ఆర్థిక మండళ్ళు(స్పెషల్ ఎకనామిక్ జోన్స్), పారిశ్రామిక కారిడార్లు, నౌకాశ్రయాలు, విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, నగరాలు, పట్టణాల సుందరీకరణ, స్మార్ట్ సిటీలు, ల్యాండ్ బ్యాంకులు వగైరా భారీ నిర్మాణాలు ఉన్నాయి. ఈ నిర్మాణాల వల్ల కోట్లాది మంది ప్రజలు నిర్వాసితులవుతున్నారు. ప్రధానంగా అటవీ ప్రాంతంలో నివసించే ఆదివాసీ ప్రజానీకం పెద్ద ఎత్తున నిర్వాసితులవుతున్నారు. వీరు తమ విలువైన జీవన వనరుల(జల్, జంగల్, జమీన్)ను కోల్పోయి, నిలకడ గల ఆదాయాలు లేని

తరువాయి భాగం 16వ పేజీలో...

# సైద్ధాంతిక కృషికి మొదటి స్థానాన్నివ్వాలి

చైనా ప్రజా విముక్తి సైన్యం కామ్రేడ్ మావో ఆలోచనా విధానం మార్గదర్శకత్వంలో పుట్టి పెరిగింది. మన "ప్రగతిశీల రాజకీయ కృషి" కర్తవ్యం ప్రజల్లో "ప్రగతిశీల రాజకీయ చైతన్యాన్ని" నింపడమేననీ, "గొప్ప రాజకీయ పోరాటాల కోసం పార్టీనంతటినీ ఐక్యం చేయడంలో మనం గ్రహించాల్సిన కీలకమైన ఆ సంబంధం సైద్ధాంతిక కృషి" అని కామ్రేడ్ మావో పదే పదే ఎత్తి చూపారు.

1929 డిసెంబర్‌లో, చైనా కార్మికుల, రైతుల ఎర్రసైన్యాన్ని స్థాపించిన కొద్ది రోజులకు కామ్రేడ్ మావో ఎర్రసైన్యపు నాల్గవ సైన్యం తొమ్మిదవ పార్టీ కాంగ్రెస్ కోసం రాసిన పేరు పొందిన తీర్మాణంలో -సైన్యాన్ని నిర్మించే క్రమంలో సిద్ధాంతానికీ, రాజకీయాలకూ మొదటి స్థానాన్నివ్వాలనీ, సైన్యంలో ఒక దృఢమైన, కార్మికవర్గ సైద్ధాంతిక, రాజకీయ నాయకత్వాన్ని నెలకొల్పాలనీ, శుద్ధ మిలటరీ దృక్పథాన్నీ, ఇతర కార్మికవర్గేతర భావాలనూ రూపుమాపాలని ఎత్తిచూపారు. మార్క్సిజం-లెనినిజం-మావో ఆలోచన ప్రాతిపదికగా చైనా ఎర్రసైన్యాన్ని నిర్మించడానికీ, అది ఒక నిజమైన రాజకీయ దృఢత్వం కలిగిన ప్రజాసైన్యంగా మారడానికి ఈ తీర్మాణం వీలు కల్పించింది.

గత దశాబ్దాల్లో చైనా ప్రజాసైన్యం పార్టీ రాజకీయ కృషి అనే చక్కని సంప్రదాయాన్ని పరిరక్షించి ముందుకు తీసుకుపోతూ వచ్చింది. దాన్ని తన స్వంత సృజనాత్మకతతో నిరంతరం సుసంపన్నం చేస్తూ వచ్చింది. సైద్ధాంతిక కృషిని సంఘటితపర్చడం పట్ల అది అత్యంత శ్రద్ధ వహించింది. ఫలితంగా అందులో మిలటరీ, పాలనా సంబంధిత కార్యకర్తలతో సహా అందరూ పాత్ర వహించారు. పరిస్థితుల నేపథ్యంలో వివిధ కాలాల్లోని కర్తవ్యాలను దృష్టిలో ఉంచుకొని అది మార్క్సిజం-లెనినిజం-మావో ఆలోచనా విధానంలో సైనికుల్ని ఎడ్యుకేట్ చేస్తుంది. మార్క్సిజం-లెనినిజం విశ్వజనీన సూత్రాన్ని చైనా విప్లవ నిర్దిష్ట ఆచరణతోనూ, నిర్మాణంతోనూ మేళవించే భావనను కూడా అది వారికి బోధిస్తుంది. ఈ విధంగా మన సైన్యం తన శ్రేణుల కార్మికవర్గ చైతన్యాన్ని నిరంతరం పెంచగలిగింది. ప్రజాసైన్యంలో తాము పొందిన శిక్షణ, ఎడ్యుకేషన్‌ల కారణంగా లక్షలాది సాధారణ రైతాంగమూ, కార్మికులూ, ఎందరో విద్యార్థులూ పెటీ బూర్జువా వర్గానికి చెందిన ఇతర మేధావులూ క్రమంగా తమను తాము (ఆచరణలోనూ, ఆలోచనలోనూ) విప్లవీకరించుకున్నారు. దృఢచిత్తులైన, రాజకీయంగా చైతన్యవంతులైన యోధులుగా తయారయ్యారు. విప్లవానికీ, నిర్మాణానికీ ప్రధాన అండదండలుగా నిలిచారు.

ప్రజావిముక్తి సైన్యం తన రాజకీయ, సైద్ధాంతిక కృషిలో ప్రోది చేసుకున్న అనుభవాల గని మన పార్టీకీ, ప్రభుత్వానికి అమూల్యమైన సంపద అనడం నిస్సందేహం. అన్ని కాలాల్లోని మన కృషికీ అది ఎంతో విలువైనది.

చారిత్రక అభివృద్ధిలో సిద్ధాంతమూ, భావజాలమూ ముఖ్యమైన పాత్ర వహిస్తాయని మార్క్సిస్టు-లెనినిస్టులు మొదటి నుండీ చెప్తూ వచ్చారు. మానవులు పనులు చేస్తారు. వారి కార్యకలాపాలను భావజాలం నియంత్రిస్తుంది. ఎన్నో రకాల సామాజిక సిద్ధాంతాలున్నాయి. పురోగామి, విప్లవకర భావాలు సామాజిక అభివృద్ధిని పెంపొందించి, దాని నుండి పుట్టుకొచ్చే నూతన కర్తవ్యాలను నెరవేరుస్తాయి. పాత, వెనుకబడిన లేదా అభివృద్ధి నిరోధక భావాలు సామాజికాభివృద్ధిని అడ్డుకుంటాయి లేదా దాన్ని వెనక్కి తీసుకుపోతాయి. సమాజ భౌతిక జీవితంలోని అభివృద్ధి ముందు ఉంచిన నూతన సామాజిక కర్తవ్యాల నుంచి కొత్త సామాజిక భావజాలమూ, సిద్ధాంతాలు పుట్టుకొస్తాయి. ఒకసారంటూ ముందుకు వచ్చాక అవి ఒక బలమైన శక్తిగా మారతాయి. లేదా కొన్ని పరిస్థితుల్లో ఒక నిర్ణయాత్మక శక్తిగా కూడా మారతాయి. సామాజికాభివృద్ధి ముందు ఉంచిన నూతన కర్తవ్యాలను ప్రజలు ఇంకా అవగాహన చేసుకోనప్పుడు, లెనిన్ చెప్పినట్లుగా, "విప్లవ సిద్ధాంతం లేకుండా విప్లవం లేదు" అని అనుకున్నప్పుడు, విప్లవకర భవజాలాన్నీ, సిద్ధాంతాల్నీ సృష్టించడం, ప్రచారం చేయడం నిర్ణయాత్మకంగానూ, ప్రథమ ప్రాధాన్యత కలదిగానూ ఉంటుంది. విప్లవ సిద్ధాంతం ఎంత వేగంగా, ఎంత లోతుగా వ్యాప్తి చెందితే, విప్లవోద్యమమూ అంత వేగంగానూ, అంత శక్తివంతంగానూ రూపొందుతుంది. మార్క్స్ "ప్రజలలో పట్టు సంపాదించుకున్నాక సిద్ధాంతం కూడా భౌతికశక్తిగా మారుతుంది" అన్నారు. "మానవుల చైతన్యం వస్తుగత ప్రపంచాన్ని ప్రతిబింబించడమే కాక, దాన్ని సృష్టిస్తుంది కూడా" అని కూడా లెనిన్ అన్నారు.

సరిగ్గా ఈ కారణం రీత్యానే మార్క్సిస్టు-లెనినిస్టులు ఏ పనిని మొదలు పెట్టాలన్నా సైద్ధాంతిక నిర్మాణంతోని మొదలు కావాల్సి ఉంటుంది. అంటే ప్రజల మానసిక స్థితి మీదా, తమ ఆచరణలో వారు ఏ సిద్ధాంతాల్ని అనుసరిస్తున్నారు అనే దాని మీదా, వారి భావజాలం వాస్తవాలతో సరిపోలుతుందా లేదా అనే దాని మీదా ఆ పని మంచిగా చేయగల్గుతామా లేదా? ఆ కర్తవ్యాన్ని విజయవంతంగా పరిపూర్తి చేయగల్గుతామా లేదా అనేది నిశ్చయాత్మకంగా ఆధారపడి ఉంటుంది. విప్లవకర భావాలున్న ప్రజలు మాత్రమే విప్లవ కృషిని కొనసాగించగల్గుతారు. విప్లవ పార్టీలు, పురోగామి విప్లవ శక్తులూ విప్లవ భావాలను ప్రచారం చేస్తాయి.

గతంలో, రాజ్యాధికార స్వాధీనం కోసం, కార్మికవర్గం విప్లవ భావాలను మొదటగా ప్రచారం చేసి, ప్రజలను ఉత్తేజపరచాల్సి వచ్చింది. ఆ తర్వాత వారిని విప్లవ విజయం కోసం చైతన్యయుతంగా పోరాడేలా సమీకరించాల్సి వచ్చింది. ఇప్పటికీ విప్లవకర ఆలోచనను

ప్రచారం చేయడాన్ని అంటే సైద్ధాంతిక కృషిని ప్రథమ కర్తవ్యంగా చూపాల్సిన అవసరం ఉన్నదా? అంటే కార్మికవర్గం అధికారంలోకి వచ్చాక, కార్మికవర్గ పాలకపార్టీ ప్రజలకు సోషలిస్టు విప్లవంలోనూ, సోషలిస్టు నిర్మాణంలోనూ నేతృత్వం వహిస్తున్న నేటి సమయంలో కూడా ఈ అవసరం ఉన్నదా?

మన పార్టీ ఇప్పుడు పరిపాలించే పార్టీ. అది ఇప్పుడు రాజ్యాధికారానికి అధినేత. ప్రభుత్వ అధికారం ద్వారా అది తన పనిని కొనసాగిస్తుంది. మన పాలనాపరమైన, ఆర్థికపరమైన కృషి రోజురోజుకూ మరింత సంక్లిష్టంగా, భారీగా తయారవుతోంది. చాలా పనుల్లో పాలనాపరమైన ఆదేశాలివ్వాల్సి ఉంటుంది. ఇటువంటి పరిస్థితుల్లో, కేవలం ఆదేశాల మీదా, అధికారం మీదా నిర్మాణపరమైన నాయకత్వం మీదా ఆధారపడి కర్తవ్యాల్ని నెరవేర్చగలం అని కొందరు భావించవచ్చు. ఆర్థిక కృషిలో కూరుకుపోతే సరిపోతుందనీ, సైద్ధాంతిక కృషి పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించనవసరం లేదనీ, ప్రజల, కార్యకర్తల సైద్ధాంతిక పరిస్థితుల గురించి పట్టించుకోనవసరం లేదనీ వారు భావించవచ్చు. లేదా ఏదైనా రాజకీయ క్యాంపెయిన్ ఉన్నప్పుడు మాత్రమే కొంత సైద్ధాంతిక కృషి చేయాల్సిన అవసరం ఉంటుందనీ, అంతే తప్ప రోజువారీగా, పథకం ప్రకారం ఈ రంగంలో కృషి అవసరం ఉండదనీ వారు భావించవచ్చు.

ఈ భావాలు సరియైనవా? ఏ మాత్రం లేదు. ఇక్కడ లేవనెత్తిన ప్రశ్నలు ఏ మాత్రం తక్కువ ప్రాముఖ్యత కలిగినవి కావు. నిజానికవి గొప్ప ప్రాముఖ్యత కలిగినవి. మన పని నిజంగా విప్లవకర స్వభావంతో కూడుకున్నదా లేదా, మన సోషలిస్టు ఆశయం సాఫీగా ముందుకు పోతుంగా లేదా అనేదానికి సంబంధించిన ప్రశ్నలివి.

సోషలిస్టు విప్లవాన్నీ, సోషలిస్టు నిర్మాణాన్నీ ముందుకు తీసుకుపోవాలంటే, రాజ్యాధికారాన్ని చేజిక్కించుకున్న తర్వాత కూడా కార్మికవర్గ పార్టీ విప్లవకర భావాల్ని వ్యాప్తి చెందించడానికి అంటే సైద్ధాంతిక కృషికి ప్రథమ స్థానాన్నివ్వాలి అని చారిత్రక అనుభవం నిరూపించింది.

మొదటి విషయం –సోషలిస్టు విప్లవమూ, సోషలిస్టు నిర్మాణమూ ప్రజల స్వంత ఆశయాలు. ఈ నేపథ్యంలో చూసినప్పుడు మనం ప్రజల్ని విప్లవకర భావాలతో ఎడ్యుకేట్ చేస్తూ, వారి విప్లవ చైతన్యాన్ని పెంచుతున్నంత కాలం వారు విప్లవం కోసం నిర్మాణం కోసం చైతన్యవంతంగా, మనస్ఫూర్తిగా, శక్తి అంతటినీ వెచ్చించి పని చేయగల్గుతారు. అప్పుడే ఒక నిజమైన సోషలిస్టు ఉద్యమం పెంపొందుతుంది.

రెండవ విషయం –సోషలిజంలోనూ వర్గపోరాటం కొనసాగుతూ ఉంటుంది. ముఖ్యంగా భావజాల, రాజకీయ రంగాల్లో ఇది ఎంతో సంక్లిష్టంగానూ, తీవ్రంగానూ ఉంటుంది. సంపూర్ణంగా నూతన సోషలిస్టు వ్యవస్థను నెలకొల్పాలంటే ప్రజల బుర్రల నుంచి అన్ని పాత భావాలు, సాంప్రదాయాల అవశేషాలను తుడిచేసి వాటి నుండి వారిని పూర్తిగా దూరం చేయాల్సి ఉంటుంది. సైద్ధాంతిక రాజకీయ రంగాల్లో సోషలిస్టు విప్లవం విజయవంతం కాకుండా కార్మికవర్గం సోషలిస్టు విజయాన్ని సాధించడం గానీ, పెట్టుబడిదారీ విధానం పునరుద్ధరణను ఆపడంగానీ సాధ్యంకాదు.

ప్రజల్లో విప్లవకర భావాలను వ్యాప్తి చేసి, వారికి సోషలిస్టు, కమ్యూనిస్టు ఎడ్యుకేషన్‌ను ఇవ్వడంలో మన లక్ష్యం వారిని మరింత విప్లవీకరించడం, అంటే వారు పెట్టుబడిదారీ భావజాలాన్నీ ఇతర కాలం చెల్లిన భావాలనూ, సాంప్రదాయాలనూ విడనాడి కార్మికవర్గ, కమ్యూనిస్టు భావాలను చేపట్టి నిరంతర విప్లవాన్ని కొనసాగించవలసిన అవసరాన్ని నిజంగా గుర్తించి, కమ్యూనిస్టు ప్రయోజనాల కోసం నిరంతర పురోగతిని సాధించేలా వారికి సహాయం చేయడమే.

అంటే మరి పార్టీ లేకుండా, కార్మికవర్గ ప్రభుత్వ అధికారం ప్రజలలో విప్లవకర భావాల్ని నాటకుండా సోషలిస్టు సమాజంలోని ప్రజల రాజకీయ చైతన్యం పెంచడం గానీ, వారిలో సోషలిస్టు, కమ్యూనిస్టు భావజాలాన్ని పెంపొందించడం గానీ సాధ్యమౌతుందా? తమను తాము విప్లవీకరించుకునే నిరంతర క్రమాన్ని కొనసాగించడానికి ప్రజలు కేవలం తమ స్వంత కృషి మీదే ఆధారపడగలరా? ఇది సాధ్యం కాదని వాస్తవాలు నిరూపిస్తున్నాయి.

అంతర్గత పరిస్థితులను మాత్రం పరిగణలోకి తీసుకున్నప్పుడు ఒక సోషలిస్టు సమాజం (బహిర్గతంగా అది పెట్టుబడిదారీ సమాజం చేత చుట్టుముట్టబడి ఉంటుంది) పాత సమాజం నుండి ఇంకా పూర్తిగా విడివడనప్పుడు ఇంకా పాత సమాజపు అవశేషాల్ని అనేక అంశాల్లో కలిగి ఉంటుంది. లెనిన్ చెప్పినది చాలా సరిగ్గా ఉన్నది : "బూర్జువా సమాజపు శవాన్ని శవపేటికలో పెట్టేసి పాతిపెట్టుతాము." సోషలిస్టు సమాజంలో "పెట్టుబడిదారీ వ్యవస్థ శవం మన మధ్యనే కుళ్ళిపోతూ, నశించిపోతూ ఉంటుంది. అది గాలిని కలుషితం చేస్తూ మన జీవితాల్ని విషపూరితం చేస్తుంది. తన పాత, కుళ్ళిపోతున్న, నశించిపోతున్న అసంఖ్యాకమైన బంధాలతో అది కొత్తవి, తాజావి, యవ్వనోత్తేజంతో నవనవలాడేవి అయిన వేటినైనా బంధించాలని చూస్తుంది."

ముఖ్యంగా భావజాల రంగంలో ఇది మరింత వాస్తవం. లెనిన్ "బూర్జువా భావజాలం సోషలిస్టు భావజాలం కంటే చాలా ముందు పుట్టింది; అది మరింత పూర్తిగా అభివృద్ధి అయినది కూడా ... " అని ఎత్తిచూపారు. "బూర్జువా భావజాలం ప్రజల బుర్రల్లో ఉండిపోవడమే కాక అనేక రూపాల్లో జాగ్రత్తగా, ఆకర్షణీయంగా పరిరక్షింపబడుతోంది (ఉదాహరణకు కొన్ని సాంస్కృతిక వారసత్వాలు) అది సుదీర్ఘకాలం తన ప్రభావాన్ని వేస్తూ ఉంటుంది".

పాత భావాలకు జన్మనిచ్చే ఆర్థిక వ్యవస్థను రూపుమాపే సామాజిక, భౌతిక పరిస్థితులను సోషలిస్టు వ్యవస్థ విజయం సృష్టించింది. అది ప్రజలను సోషలిస్టు, కమ్యూనిస్టు ఆలోచనా విధానంతో కూడా సాయుధం చేస్తుంది. దోపిడీ వ్యవస్థ నుండీ,

స్వంత ఆస్థి వ్యవస్థ సంకెళ్ళ నుండీ విముక్తి చెందిన సోషలిస్టు సమాజంలోని ప్రజలు, ముఖ్యంగా గతంలోని చిన్న ఉత్పత్తిదారులు ఒక దిక్కు సోషలిజం పట్ల గొప్ప ఉత్సాహాన్ని కలిగి ఉంటారు. వారి రాజకీయ చైతన్యం మున్నెన్నడూ లేనంతటి ఉన్నతస్థాయికి చేరుకొని ఉంటుంది. మరోవైపు వివిధ స్థాయిల్లో ఇంకా పాత భావాలూ, సాంప్రదాయాలూ వెనక్కి లాగుతూ ఉంటాయి. వారి దృక్పథంలో ఇంకా పాత సమాజపు అవశేషాలు మిగిలే ఉంటాయి. పాత సామాజిక వ్యవస్థ కంటే సోషలిస్టు వ్యవస్థ అన్ని విధాలా ఉన్నతమైందనీ, దోపిడీ నుండి, పేదరికం నుండి, వెనుకబాటుతనం నుండి బైటపడి సమిష్టిగా సమృద్ధిని సాధించడానికి సోషలిజమే ఏకైక మార్గం అనీ వారికి స్పష్టంగా అగుపిస్తుంది. వారు దాన్ని అనుభూతి చెందగలరు కూడా. అయితే సోషలిస్టు సమాజ ఆవిర్భావంతో ముందుకు వస్తున్న కొన్ని నూతన విషయాలకు వారు ఇంకా అలవాటు పడలేదు. వేలాది సంవత్సరాలుగా ఉన్న విషయాలకు వారు ఇప్పటికీ అలవాటుపడి ఉన్నారు. అవి వివిధ స్థాయిల్లో వారి మీద ప్రభావాన్ని నెరుపుతూ ఉంటాయి. ఎప్పుడు అవకాశం దొరికినా, పెట్టుబడిదారీ మరియు భూస్వామ్య పాత భావాలు తిరిగి కొందరి బుర్రల్లోకి ప్రవేశించవచ్చు. చాలాసార్లు అది వారి అలవాట్లకు తగినదిగా ఉంటుంది. హానికరమైన భావాలు గల ఒక నాటకాన్ని చూడటానికి వెళ్ళడం, పాత జ్ఞాపకాలను తవ్వుకోవడం నూతన భావాన్ని గానీ దృక్పథాన్ని గానీ ఆమోదించడం కంటే వారికి సహజంగా తోస్తుంది. సంక్లిష్టమైన వర్గపోరాటం జరుగుతున్న వాతావరణంలో, సామాన్య ప్రజలకు, ముఖ్యంగా గతంలో చిన్న ఉత్పత్తిదారులుగా ఉన్నవారికి సంబంధించినంతవరకు, వారు కొన్ని పరిస్థితుల్లో అంటే కార్మికవర్గ భావాల్లో ఎడ్యుకేషన్‌ని తీవ్రంగా కొనసాగించినప్పుడు సోషలిస్టు, కమ్యూనిస్టు భావాల్ని ఆమోదించవచ్చు. ఈ ఎడ్యుకేషన్‌ని తక్కువ చేసినా లేదా పూర్తిగా వదిలిపెట్టినా, అటువంటి పరిస్థితుల్లో వారు పెట్టుబడిదారీ భావజాలాన్ని ఆమోదించవచ్చు.

సోషలిస్టు సమాజంలో పెరిగినవారు కూడా సోషలిస్టు భావజాలంతో పుట్టినవారు కారు. సోషలిస్టు, కమ్యూనిస్టు చైతన్యంతో ఒక కొత్త తరాన్ని ఎదిగించడం అంత సులభమైనదేమీ కాదు. నూతన సమాజంలో పుడతారు కనుక వారికి మొదటి నుండీ కూడా నూతన సమాజపు విద్యను అందుకునే అనుకూలత ఉంటుంది. కానీ సరిగ్గా వారు నూతన సమాజంలోనే పెరుగుతున్నారు కనుక పాత సమాజం గురించి వారికి ఏమి తెలీదు. నిజంగా అణచివేత అంటే ఏమిటి, మనిషిని మనిషి దోచుకోవడం అంటే ఏమిటనేది వారికి అర్థం కాదు. వర్గాలంటే ఏమిటో, వర్గపోరాటం అంటే ఏమిటో వారికి నిజంగా తెలీదు. నూతన సమాజం ఎలా ఉనికిలోకి వచ్చిందనేది వారు నిజంగా, త్వరగా అర్థం చేసుకోలేకపోతారు. దానిని ఎలా నిర్మించాలనేది గానీ, పాత సమాజంతో పోల్చి చూసి నూతన సమాజాన్ని అర్థం చేసుకోవడం గానీ వారికి తెలీదు. ఇది వారి బలహీనత, ఈ బలహీనత పెద్దదే. సంక్లిష్టమైన వర్గపోరాట వాతావరణాన్ని నిరోధించే శక్తి వారిలో సాపేక్షికంగా తక్కువ ఉంటుంది. అందుకని వారి ఎడ్యుకేషన్ పట్ల తగిన శ్రద్ధ వహించకపోతే వారిని పాత సమాజపు శవం రోగగ్రస్తుల్ని చేస్తుంది. దాని అన్ని రకాల అవశేషాలతో కూడిన హానికరమైన భావాలు వారిని ప్రభావితం చేస్తాయి. లేదా పొరపాటుగా ఈ విషయాల్ని విలువైనవిగా అర్థం చేసుకునే అవకాశం ఉంది. అందుకనే కొన్ని పరిస్థితుల్లో అంటే కార్మికవర్గ భావాల విషయంలో ఎడ్యుకేషన్ తీవ్రంగా కొనసాగుతున్నప్పుడు కొందరిని కమ్యూనిజానికి తగిన వారసులుగా ఎదిగించవచ్చు. లేదా ఇంకొన్ని పరిస్థితుల్లో అంటే ఈ ఎడ్యుకేషన్ తగ్గిపోయినప్పుడు గానీ, పూర్తిగా లేకుండా పోయినప్పుడుగానీ వారు పెట్టుబడిదారీ విధానం మాయలో పడిపోవచ్చు.

అందుకనే సోషలిస్టు సమాజంలో ముఖ్యమైనదీ, నిర్ణయాత్మకమైనదీ పార్టీ సైద్ధాంతిక నాయకత్వమూ. కార్మికవర్గ రాజ్యాధికారమూ, అవి అందించే సైద్ధాంతిక ఎడ్యుకేషనూ. సర్వావస్థల్లోనూ మన చైతన్యపు ఆయుధమైన మార్క్సిజం–లెనినిజం పైన మనం ఆధారపడాలి. ఒక ప్రత్యేకమైన అర్థంలో మునుపెన్నటి కంటే ఇటువంటి సైద్ధాంతిక ఎడ్యుకేషన్ ఇప్పుడు మరింత ముఖ్యమైనది.

'ఏం చేయాలి?' అనే తన రచనలో లెనిన్ ఇలా రాశారు : "..... ఏదైనా ఒక దాన్నే ఎంచుకోవాలి : బూర్జువా భావజాలంగానీ, సోషలిస్టు భావజాలంగాని. మధ్యేమార్గం ఏది లేదు. (ఎందుకంటే మానవాళి 'మూడో' భావజాలాన్ని సృష్టించలేదు. అంతేకాక వర్గవైషమ్యాలతో అల్లకల్లోలమైన సమాజంలో వర్గాలకు సంబంధం లేని లేక వర్గాలకు అతీతమైన భావజాలం ఏదీ ఉండదు. అందుకని ఏ మాత్రంగానైనా సోషలిస్టు భావజాలాన్ని తక్కువ చేయడం అంటే, ఏ కొద్దిగానైనా దాని నుండి పక్కకు పోవడం అంటే బూర్జువా భావజాలాన్ని బలోపేతం చేయడమే అవుతుంది."

లెనిన్ చేసిన ఈ శాస్త్రీయమైన ప్రకటన పెట్టుబడిదారీ సమాజాలకే కాక సోషలిస్టు సమాజాలకు కూడా వర్తిస్తుంది. అంటే పెట్టుబడిదారి సమాజం నుండి వర్గరహిత కమ్యూనిస్టు సమాజానికి పరివర్తన జరిగే మొత్తం చారిత్రక కాలానికి ఇది వర్తిస్తుంది.

"ప్రజల మధ్య వైరుధ్యాలను సరిగా పరిష్కరించడం" అనే తన పుస్తకంలో మావో ఈ క్రింది విషయాన్ని ఎత్తిచూపారు : ".....సోషలిస్టు దేశాల్లో మార్క్సిజం స్థానం వేరుగా ఉంటుంది. అయితే ఈ దేశాల్లో కూడా మార్క్సిస్టేతర, మార్క్సిస్టు వ్యతిరేక భావజాలాలు ఉంటాయి."

పెట్టుబడిదారీ దేశాల్లోగానీ, సోషలిస్టు దేశాల్లోగానీ కార్మికవర్గ భావజాలానికీ, పెట్టుబడిదారీ భావజాలానికీ మధ్యనా, మార్క్సిస్టు ఆలోచన విధానానికీ, మార్క్సిస్టేతర , మార్క్సిస్టు వ్యతిరేక ఆలోచనా విధానానికీ మధ్య వైషమ్యం ఉంటుందనీ దీనర్థం. ఒకటే తేడా ఏంటంటే పెట్టుబడిదారీ సమాజాల్లో అన్ని రకాల మార్క్సిస్టేతర,

మార్క్సిస్టు వ్యతిరేక భావజాలాలు, బూర్జువా భావజాలమూ ఆధిక్యతలో ఉంటాయి. ఇటువంటి స్థితిలో, బూర్జువా భావజాల వ్యాప్తి గానీ, దాని కార్యకలాపాలుగానీ, మార్క్సిజంపై అది జరిపే దాడులు గానీ బహిరంగంగానూ, ఎటువంటి తటపటాయింపులు లేకుండానూ ఘోరంగానూ ఉంటాయి. అయితే కార్మికవర్గ భావజాలమైన మార్క్సిస్టు ఆలోచనా విధానం ఆధిక్యతలో ఉండే సోషలిస్టు సమాజాల్లో అవి సాధారణంగా ముసుగులో, దొంగతనంగా జరుగుతుంటాయి.

సోషలిస్టు సమాజాల్లో కార్మికవర్గ భావజాలమూ, మార్క్సిస్టు ఆలోచనా విధానమూ దృఢంగా తమ ఆధిపత్య స్థానంలో కొనసాగాలంటే, అంతులేకుండా భావజాల రంగంలో పోరాటాలు జరగాల్సి ఉంటుంది. కేవలం ప్రభుత్వ అధికారం మీదా, పాలకవర్గమైన కార్మికవర్గపు భౌతికశక్తి మీదా ఆధారపడితే సరిపోదు. కేవలం ఒక్క దేశంలో కాక ప్రపంచమంతటా చారిత్రకంగా కొనసాగుతూ వస్తున్న పాత భావాలతో చుట్టుముట్టబడి వాటి ఒత్తిడికి కార్మికవర్గ భావజాలం గురవుతూ ఉంటుంది. సోషలిజంలో బూర్జువా భావజాలం తన ఆధిపత్య స్థానాన్ని కోల్పోయినప్పటికి అదింకా ఒక బలమైన శక్తిగానే ఉంటుంది. పెట్టుబడిదారీ పునరుద్ధరణకు మార్గాన్ని సుగమం చేయడానికి కార్మికవర్గ భావజాలంతో పోటీపడి స్థానాన్ని సంపాదించుకోవడానికి అన్ని రకాల రహస్య పద్ధతులనూ అది ఉపయోగిస్తుంది. కనుక అది మరింత బలమైన శక్తిగా కొనసాగుతుంది. దానివల్ల భావజాల రంగంలో పోరాటం మరింత సంక్లిష్టంగా, పదునుగా మారిపోతుంది. కార్మికవర్గం తన దృక్పథానికి అనుగుణంగా ప్రపంచాన్ని మార్చాలనుకుంటుంది. బూర్జువా వర్గం కూడా అలాగే భావిస్తుంది. ఈ విషయంలో సోషలిజం విజయం సాధిస్తుందా లేక పెట్టుబడిదారీ విధానం విజయం సాధిస్తుందా అనేది సుదీర్ఘ చారిత్రక కాలంలో మాత్రమే తేలుతుంది.

సోషలిస్టు సమాజంలో బూర్జువా వర్గ భావజాలానికీ, కార్మికవర్గ భావజాలానికీ మధ్య వైషమ్యం కొనసాగుతుందనే విషయాన్ని నిరాకరించడం గానీ, ''మొత్తం ప్రజల'' భావజాలం వంటి అర్థరహితమైన వాదనల్ని అంటే వర్గేతర, వర్గాతీత భావజాలం ఉంటుందని వ్యాప్తి చేయడంగానీ ప్రజల్ని కావాలని మభ్యపెట్టడమే అవుతుంది. కార్మికవర్గ భావజాలమైన మార్క్సిజం-లెనినిజం యొక్క ఆధిక్యతా స్థానాన్నీ, మార్గదర్శకత్వాన్నీ చాప కింద నీరులా నిరాకరిస్తూ, బూర్జువా భావజాల ఆధిక్యతను నెలకొల్పి పెట్టుబడిదారీ పునరుద్ధరణకు పరిస్థితుల్ని సృష్టించాలనేది వారి ప్రయత్నం.

అంటే సోషలిస్టు సమాజంలో సోషలిస్టు, కమ్యూనిస్టు భావాలను వ్యాప్తి చేయడం తగ్గిపోయి, కార్మికవర్గ భావజాలం రంగం నుండి నిష్క్రమిస్తే బూర్జువా భావజాలం రంగం మిదికొస్తుందనేది స్పష్టమే. బూర్జువా భావజాలంపై కార్మికవర్గ భావజాలం ఆధిక్యత వహించినప్పుడల్లా, సోషలిజం కోసం జరిగే ఉద్యమం వేగంగా అభివృద్ధి చెందుతుంది. మార్క్సిస్టు-లెనినిస్టు సత్యం అంతటా నెలకొల్పబడుతుంది. ఇందుకు భిన్నంగా, ఎక్కడైతే బూర్జువా భావజాలం కార్మికవర్గ భావజాలంపై ఆధిక్యత సాధిస్తుందో అక్కడ చలనం ఆగిపోతుంది. అనివార్యంగా వ్యతిరేకించదగిన అంశాలు పుట్టుకొస్తాయి.

ప్రజల్ని సోషలిస్టు, కమ్యూనిస్టు భావాలతో విప్లవ భావాలతో ఎడ్యుకేట్ చేయడానికీ, వారిని మరింతగా విప్లవీకరించడానికీ అనేక మార్గాల్నీ పద్ధతుల్నీ ఉపయోగించాలి. అది ప్రస్తుత వర్గపోరాట విప్లవ ఆచరణ మీదా, ఉత్పత్తికోసం, శాస్త్రీయ ప్రయోగం కోసం జరిగే పోరాటం మీదా ఆధారపడి ఉండాలి. కార్యకర్తల ఆలోచనల్ని విప్లవీకరించడం అంటే మార్క్సిజం-లెనినిజాన్ని అవగాహన చేసుకునే వారి స్థాయిని నిరంతరంగా పెంచడం అనేది ఇక్కడ కీలకంగా ఉంటుంది. ఎందుకంటే ప్రజల్లో విప్లవ భావాల్ని వ్యాప్తి చేయడమూ, సైద్ధాంతిక నాయకత్వాన్ని బలోపేతం చేయడమూ అనే పనులను కార్యకర్తల ద్వారానే చేయాల్సి ఉంటుంది. కార్యకర్తల ఆలోచనల్ని నిరంతరం విప్లవీకరించడం ఫలితంగా నాయకుల పని శైలిలో జరిగే మెరుగుదల, నాయకత్వాన్ని బలోపేతం చేయడం అనేవి ప్రజల్ని మరింతగా విప్లవీకరించడానికి ముందు షరతులు.

మన దేశంలో పెద్ద కార్యకర్తల సైన్యం ఉంది. వారి భావజాలపరమైన పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. వారిలో కొందరు అనేక విప్లవ పరీక్షల్లో రాటుదేలి ఉన్నతమైన సైద్ధాంతిక, రాజకీయ స్థాయిని సాధించారు. కొందరు తక్కువ రాటుదేలారు. చాలా మంది ప్రత్యేకించి ఈ రంగంలో పనికి కొత్తవారు. అయితే వారు ఏ కేటగిరీకీ చెందిన వారైనప్పటికీ అందరూ తమ సైద్ధాంతిక స్థాయిని పెంచుకోవడాన్ని కొనసాగించాలి. మరింతగా విప్లవీకరించబడాలి.

మన దేశం లోపలా, బైటా కూడా పరిస్థితి అభివృద్ధి చెందుతూ ఉన్నది. మనం అనేక కొత్త సమస్యలనూ, కర్తవ్యాలనూ ఎదుర్కొంటాం. నేటి వర్గపోరాటమూ, ఉత్పత్తి కోసం పోరాటమూ గత పోరాటాల కంటే భిన్నమైనవి. రెండూ మరింత సంక్లిష్టమైనవి. వాటిలో అనేక సమస్యలు ఇమిడి ఉన్నాయి. మనలో చాలా మంది తరచూ వర్గపోరాటంలో తమకు చాలా అనుభవం ఉందనుకుంటారు. కానీ వారికి ఇటువంటి సమస్యలు ఎదురైనప్పుడు ఏమౌతుంది? సోషలిస్టు పరివర్తన ప్రధానంగా పూర్తయిపోయాక సమాజంలోని వివిధ వర్గాల మధ్య సంబంధాలు ఏమిటి? వివిధ రంగాల్లో వర్గపోరాటం ఎలా కొనసాగుతుంది? దాని రూపం ఏమిటి? దేశంలోనూ, అంతర్జాతీయంగానూ జరిగే వర్గపోరాటాల మధ్య అంతఃసంబంధాలు ఏమిటి? మహా అయితే వారు ఈ ప్రశ్నలకు నోటితో జవాబులు చెప్పగలరు. అయితే వాటి వెనక నిజమైన అవగాహన ఉండదు. లేదా వారు కేవలం దాన్ని సైద్ధాంతికంగా అర్థం చేసుకోగలరు. నిర్దిష్ట సమస్యల దగ్గరకొచ్చేసరికి వారు సులభంగా గందరగోళపడతారు లేదా మార్క్సిస్టు-లెనినిస్టు సాహిత్యం నుండి తాము చదివినదంతా గాలికి వదిలేస్తూ పక్కదోవ కూడా పట్టవచ్చు. గత కొద్ది సంవత్సరాలుగా వర్గపోరాటాల గుండా

ప్రయాణిస్తూనే చాలా మంది మన కామ్రేడ్స్ క్రమంగా సోషలిస్టు సమాజంలో వర్గపోరాటం పట్ల తమ అవగాహనను లోతుగా పెంపొందించుకున్నారు. ఆధునిక రివిజనిజంతో పోరాటం వల్ల ముఖ్యంగా చాలా మంది ప్రజలు దీని తీవ్రతను అర్థం చేసుకున్నారు. సోషలిస్టు సమాజాల్లో ఇంకా వర్గాలు, వర్గపోరాటమూ ఉంటుందనీ, అందువల్ల అవకాశవాదానికీ, రివిజనిజానికి దారి తీయగల సామాజిక పునాది ఇంకా ఉనికిలో ఉందనీ గుర్తించగలిగారు. అయితే మనలో ఇంకా చాలా మందికి సోషలిస్టు సమాజాల్లో వర్గపోరాటం అనే ఒక ముఖ్యమైన అంశం గురించి ఇంకా పూర్తిగా తెలీదు అనేది గుర్తించాలి. ఈ విషయంలో కామ్రేడ్ మావో ఆలోచనను గ్రహించాలంటే ఇంకా చాలా దూరం పోవాల్చే ఉన్నది.

అందుకని మనం కొత్తగా రాటుదేలాలి. కొత్తగా అధ్యయనం చేయాలి. అంటే మనం కొత్తగా సిద్ధాంతంలో రాటుదేలాలి. మళ్ళీ మార్క్సిస్టు-లెనినిస్టు రచనల్ని, కామ్రేడ్ మావో రచనల్ని చదవాలి. నూతన వర్గపోరాట ఆచరణలో, ఉత్పత్తికోసం, శాస్త్రీయ ప్రయోగం కోసం జరిగే పోరాటంలో సామ్రాజ్యవాదానికీ, ఆధునిక రివిజనిజానికీ వ్యతిరేకంగా జరిగే పోరాటంలో భాగంగా మనం ఈ పని చేయాలి. ఇందుకోసం మనం నెగెటివ్ ఉదాహరణలుగా నిలిచే అన్ని రకాల రచనల్ని కూడా చదవాలి. వీటిలో ఆధునిక, పాత రివిజనిస్టుల రచనలూ, సామ్రాజ్యవాదులు రివిజనిజాన్ని అంచనా కడ్తూ రాసిన రచనలూ కూడా ఉన్నాయి. మన కాలానికి చెందిన అన్ని గొప్ప సమస్యల పైనా, సమకాలీన విప్లవకారులు, మార్క్సిస్టు-లెనినిస్టులు మార్క్సిస్టు-లెనినిస్టు సూత్రాలను పరిరక్షించడానికి ఏమేం చేశారో మనకు స్పష్టంగా అర్థం కావాలి. అలాగే మార్క్సిజం-లెనినిజాన్ని వ్యతిరేకించడానికి పాత పంథా రివిజనిస్టుల అర్థరహిత సిద్ధాంతాన్ని ఆధునిక రివిజనిస్టులు ఏ విధంగా ఉపయోగించుకున్నారో కూడా మనకు స్పష్టత ఉండాలి. మన విచక్షణా జ్ఞానాన్నీ, నిరోధకశక్తినీ రాజకీయంగా, సైద్ధాంతికంగా పెంచుకోవడానికి మనం ఈ పని చేయాలి. సిద్ధాంతంలో మనం రాటుదేలాలి. అంటే అర్థం మనం మన ఆలోచనా విధానాన్ని తిరిగి కొత్తగా మల్చుకోవాలి అని కూడా. మరో మాటలో చెప్పాలంటే మార్క్సిస్టు-లెనినిస్టు గతితార్కిక పద్ధతిని ఉపయోగించి మనం విషయాల్ని విశ్లేషించడం నేర్చుకోవాలి. జడాత్మక ఆలోచనా విధానానికి గురికాకుండా మనం జాగ్రత్త వహించాలి, దాన్ని అధిగమించాలి. జడాత్మక ఆలోచనా విధానం ఉంటే మనం విషయాల్లోనూ, పరిస్థితుల్లోనూ వచ్చే మార్పులనూ, అభివృద్ధినీ చూడలేకపోతాం. అది మన దృక్పథాన్ని సంకుచితంగా మార్చివేస్తుంది. మన ఆలోచనలను జడంగా ఉంచేస్తుంది. ప్రస్తుతం ఉన్న దానితో సంతృప్తి పడేలా చేస్తుంది. కొత్తగా నేర్చుకోవడానికి సిద్ధపడనివారు, కొత్తగా రాటుదేలడానికి సిద్ధపడనివారు వెనుకబడిపోతారు. తమను తాము విప్లవీకరించుకునే క్రమాన్ని కొనసాగించకపోతే వారు దిగజారిపోయి రివిజనిజాన్ని ఆమోదించవచ్చు కూడా.

"ఏదేని ఒక పార్టీ లేదా ప్రభుత్వ విభాగంలోని కార్మికులకు ఎంత ఉన్నతమైన రాజకీయ స్థాయి ఉంటే, ఎంతగా మార్క్సిస్టు-లెనినిస్టు సిద్ధాంత జ్ఞానం ఉంటే అంత మెరుగ్గానూ, ఫలవంతంగానూ ఆ పని కొనసాగుతుందనీ, అంత మంచి ఫలితాలు కూడా ఆ పని నుండి పొందుతామనీ మనం ఒక సూత్రంగానే ఆమోదించవచ్చు. అలాగే కార్మికుల రాజకీయ స్థాయి తక్కువగా ఉండి, వారికి మార్క్సిస్టు-లెనినిస్టు జ్ఞానం తక్కువగా ఉంటే పనిలో ఆటంకమూ వైఫల్యమూ ఎక్కువగా ఉండే అవకాశం ఉంటుంది. కార్మికులు స్వయంగా డొల్లగా తయారు కావచ్చు. ఎందుకూ కొరగాని బద్ధకస్తులుగా తయారుకావచ్చు. పూర్తిగా దిగజారవచ్చు కూడా." అని స్టాలిన్ ఎంతో సరిగా దీన్ని వివరించారు.

కార్యకర్తల ఆలోచనల్ని విప్లవీకరించడానికి నిరంతరం చేసే కృషి ఎంత శక్తివంతంగా ఉంటే మన నాయకత్వ సంస్థల పని అంత శక్తివంతంగా ఉంటుంది. మన నాయకత్వం పని కూడా మరింత శక్తివంతంగా ఉంటుంది.

ప్రస్తుతం వివిధ స్థాయిల నాయకత్వ సంస్థల ప్రధాన కర్తవ్యం (ప్రభుత్వ ఆర్థిక నాయకత్వం సంస్థలతో సహా) దేశాన్ని నిర్మించడంలో నాయకత్వాన్ని అందించడం. ఏ ప్రధాన విషయాలపై ఈ నాయకత్వం కేంద్రీకరిస్తుంది? పెద్ద పెద్ద వ్యవసాయ క్షేత్రాలకు 'నాయకత్వం' వహించడం పైననా? గుట్టలు గుట్టలుగా పోగుపడుతున్న తయారైన యంత్ర సామగ్రికి 'నాయకత్వం' వహించడం పైననా? అయితే మరి భూమిని సాగు చేయాల్సింది మానవులే. ఆ యంత్రాలను ఉపయోగించాల్సింది మానవులే. మానవులు లేకుండా, యంత్రాలూ, భూమి అన్నీ విలువ లేనివీ; వాటికి ఎటువంటి ఉపయోగమూ ఉండదు. అందుకే నాయకత్వ సంస్థల కర్తవ్యం ప్రాథమికంగా మానవులకు నాయకత్వం వహించడమే. వారి పైన మంచి కృషిని చేయడమే. మానవులకూ, యంత్రాలకూ భూమికీ మధ్య ఇతర ఉత్పత్తిసాధనాలన్నింటికీ, ఉత్పత్తి శక్తులకీ మధ్య సంబంధం విషయంలోనూ ఆర్థిక నాయకత్వ సంస్థలు సరిగా వ్యవహరించాలి. మానవుల మధ్య సంబంధాల విషయంలోనూ వాళ్ళు సరిగా వ్యవహరించాలి. వాటితో సరిగా వ్యవహరించకుండా ఆర్థిక కృషిలో మంచిగా పని చేయడం అసాధ్యం. వివిధ స్థాయిలలోని నాయకత్వ సంస్థలు అందుకనే తమ పనిని ప్రజల్లోనూ, వాస్తవాలకు దగ్గరగానూ కొనసాగించాలి. ప్రజలకూ, వాస్తవాలకూ సన్నిహితంగా ఉండాలి. వేగంగా, నిర్దిష్టంగా, సకాలంలో పనులు చేయాలి. ప్రజల మధ్యనే క్రింది స్థాయిల సంస్థల్లోనూ ఉత్పత్తి రంగంలో ముందుండి పని చేయాలి. రొటీన్ పని విధానం నుండీ, అన్ని రూపాల్లోని పెత్తందారీతనం నుండీ వారు బైటపడాలి. కేవలం పరిపాలనా సంబంధమైన ఆదేశాలు జారీచేసి, సంతృప్తిపడడం, సైద్ధాంతిక ఎడ్యుకేషన్‌ను నిర్లక్ష్యం చేయడం, పనిలో నిర్లక్ష్యంగా ఉండడం వంటి లోపాల నుండి వారు బైటపడాలి. దీన్ని సాధించడానికి వారు నిరంతరం కార్యకర్తల

ఆలోచనల్ని విప్లవీకరించడంతో మొదలు కావాలనేది నిస్సందేహం.

మన దేశంలో సోషలిజానికి అవసరమైన ఆర్థిక పునాదిని నిర్మించాం. ఇటువంటి పునాదికి సేవచేసి, దాన్ని అభివృద్ధి పరచి, సంఘటితపరచగల తగిన ఉపరితలం కూడా ఉండాల్సిన అవసరం ఉంది. వివిధ స్థాయిల్లోని నాయకత్వ సంస్థల్లోని, కార్యకర్తల్లోని భావజాలపరమైన పరిస్థితులు అనేవి సోషలిస్టు ఉపరితలాంశంలోని ఎంతో ముఖ్యమైన భాగంగా ఉంటాయి. ఉపరితలాంశంలోని ఈ భాగం విప్లవీకరించబడినప్పుడు ఇతర భాగాల్లోనూ ఆ మార్పు సాధ్యమవుతుంది. అప్పుడు మాత్రమే సోషలిస్టు ఆర్థిక పునాదికి తగినట్లుగా ఉపరితలం ఉండగలుగుతుంది. సోషలిస్టు నిర్మాణం కోసం ప్రజల చొరవనూ, సృజనాత్మకతనూ పూర్తిగా వెలికి తీయడం సాధ్యమవుతుంది.

వివిధ రంగాల్లో మన పని అవసరాల రీత్యానూ, విప్లవ పరిస్థితి రీత్యానూ మనకు పి.ఎల్.ఎ రాజకీయ కృషి అనుభవం నుండి నేర్చుకోవాల్సిన అవసరం ముందుకొచ్చిందనేది దీని నుండి స్పష్టమవుతుంది. శాంతి కాలంలో గానీ, యుద్ధ కాలంలోగానీ సైన్యంలో పని చేయాలంటే, ఉన్నత స్థాయి కేంద్రీకరణ, క్రమశిక్షణ, ఆదేశాలను పాటించడం అనేవి మిగతా అన్ని పనుల్లో కంటే ఎక్కువగా అవసరమౌతాయి. అయితే ఇందువల్ల ప్రజా విముక్తి సైన్యం రాజకీయ-సైద్ధాంతిక కృషిని నిర్లక్ష్యం చేయడాన్ని సరైనదిగా భావించదు. అందుకు భిన్నంగా అది ఈ పనికి అన్ని రకాల పరిస్థితుల్లోనూ మొదటి స్థానాన్నివ్వాలని నొక్కి చెప్తుంది. దశాబ్దాల తరబడి అది ఈ రంగంలో మంచిగా, క్షుణ్ణంగా పని చేసింది. సైన్యం కామ్రేడ్ మావో సేటుంగ్ ఆలోచనలకు తగినట్లుగా ఎదిగిందనీ, మార్క్సిస్టు-లెనినిస్టు నాయకత్వాన్ని ఆచరించిందని పై విషయం సూచిస్తుంది.

వివిధ సంస్థల్లోని నిర్దిష్ట పరిస్థితులు భిన్నంగా ఉంటాయి కనుక ఉండాలి గనుక వీటిలోని రాజకీయ కృషి వివిధ పద్ధతుల్లో, రూపాల్లో కొనసాగుతుంది. వాటి రాజకీయ అవసరాలూ భిన్నంగా ఉంటాయి. అయితే ఒక పద్ధతి ప్రకారం రోజువారీ, రాజకీయ కృషి ద్వారా కమ్యూనిస్టు భావాల్నీ, మార్క్సిజం-లెనినిజాన్నీ ప్రజల్లోనూ, కార్యకర్తల్లోనూ వ్యాప్తి చేసి, వారు మరింతగా విప్లవీకరించబడాల్సిన అవసరాన్ని మనం నిరంతరం దృష్టిలో ఉంచుకోవాలి. "పద్ధతి ప్రకారం" "రోజువారీగా" అని ఎందుకు అంటున్నామంటే కేవలం రాజకీయ క్యాంపెయిన్‌ల ద్వారానే మనం క్షుణ్ణంగా రాజకీయ కృషిని చేయగల్గుతాం అని భావించలేము. అలాగే పాలనా పరమైన నాయకత్వ సిబ్బందిని మినహాయించి కొందరు రాజకీయ కార్యకర్తలకు, లేదా మన బుర్రలో పుట్టే కోరికలకు దీన్ని వదిలేసినా తగిన రాజకీయ కృషి జరగదు. ఈ విషయంలో ప్రతి ఒక్కరూ బాధ్యత వహించేలా, కీలకమైన సైద్ధాంతిక కృషి పట్ల అత్యంత శ్రద్ధ వహిస్తూ ప్రతి ఒక్కరూ పద్ధతుల్ని పూర్తిగా రూపొందించుకునేలా మనం చూడాలి.

సోషలిస్టు సమాజంలో మంచిగా సైద్ధాంతిక కృషి చేయడం అంటే క్లుప్తంగా చెప్పాలంటే మానవుల శక్తిని పూర్తిగా వెలికితీయడం అనే. అంతిమ విశ్లేషణలో ఈ పునాది పైననే, సోషలిజం పట్ల ప్రజలు చూపే ఉత్సాహం పైననే సోషలిస్టు వ్యవస్థ శక్తి బలం ఆధారపడి ఉంటుంది. మనం మానవుల శక్తియుక్తుల్నీ, సోషలిజం పట్ల ప్రజల ఉత్సాహాన్నీ పూర్తిగా వెలికితీయగలిగితేనే మన విప్లవమూ, నిర్మాణమూ సదా అజేయంగా నిలుస్తాయి.

***-హాంకీ (ఎర్రజెండా) నెం.5, 1964***

---

**10వ పేజీ తరువాయి భాగం...**

సమూహాలుగా రోడ్లపై పడటమే కాకుండా, తమ సుసంపన్నమైన సంస్కృతిని కూడా కోల్పోతున్నారు. ఈ దోపిడీ అభివృద్ధి నమూనా వల్ల నిర్వాసిత్వంతోపాటు, పర్యావరణం, జీవవైవిధ్యం ధ్వంసమవుతున్నాయి. ప్రకృతి వనరులు కనుమరుగవుతున్నాయి. ధనికులు మరింత ధనికులవుతుంటే, పేదలు మరింత పేదలవుతున్నారు. మధ్య తరగతిలోని ఒక సెక్షన్ మాత్రమే అధిక జీతాలు పొందుతూ, ఎగువ తరగతికి చేరుతూ, దోపిడీ పాలకవర్గాలకు నమ్మినబంట్లలా తయారవుతున్నారు.

ఈ నేపథ్యంలో పాలకవర్గాలు అనుసరిస్తున్న సామ్రాజ్యవాద అనుకూల 'అభివృద్ధి' నమూనాకు వ్యతిరేకంగా ప్రజలను పెద్ద ఎత్తున సమీకరించి పోరాటం చేపట్టాలి. ముఖ్యంగా ప్రజలకు పునర్నివాసం కల్పిస్తామంటూ చేస్తున్న బూటకపు వాగ్దానాలను తిప్పికొడ్తూ, నిర్వాసిత్వానికి వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాన్ని నిర్మించాలి. ప్రస్తుతం ఎ.ఒ.బిలో, విశాఖ మన్యంలో బాక్సైట్ గనుల తవ్వకాన్ని ప్రజలు, పార్టీ నాయకత్వంలో సమరశీలంగా పోరాడి నిలుపుదల చేసారు. ఇంకా కొరాపూట్ జిల్లాలోని మాలి, దేవమాలి, దంగదేవుల,సేరుబంద పర్వతాలలో బహుళజాతి సంస్థలు చేపట్టిన ఖనిజాల తవ్వకాలను వ్యతిరేకిస్తూ, పోరాటాలు జరుగుతున్నాయి. ఇవే కాకుండా మరికొన్ని చోట్ల కూడా బూటకపు అభివృద్ధికీ, నిర్వాసిత్వానికి వ్యతిరేకంగా పోరాటాలు జరుగుతున్నాయి. ఈ పోరాటాలన్నింటినీ మరింత ఉధృతం చేస్తూ, మొత్తంగా సామ్రాజ్యవాద అభివృద్ధి నమూనాను తిరస్కరిస్తూ, ప్రజలే కేంద్రంగా ఉండే అభివృద్ధి నమూనాకై ఉద్యమించేందుకు అశేష పీడిత ప్రజానీకాన్ని సన్నద్ధుల్ని చేయాల్సిందిగా ప్లీనం పిలుపునిస్తున్నది.

# శత్రు గూఢాచారి వ్యవస్థ

## మన అనుభవాలు-I

1985 నుంచి అవిభక్త ఆంధ్రప్రదేశ్‌లో, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విప్లవోద్యమాన్ని నిర్మూలించేందుకు పాశవిక నిర్బంధకాండను తీవ్రతరం చేసాయి. ఈ నిర్బంధకాండను అమలుచేసే క్రమంలో, అత్యంత ప్రతీఘాతుక స్వభావం కలిగిన స్పెషల్ ఇన్వేస్టిగేషన్ బ్యూరో (ఎస్.ఐ.బి)అనే పేరు కలిగిన గుఢాచారి వ్యవస్థను ఏర్పరిచాయి. ఇది దేశంలోనే అత్యంత పేరు గాంచిన ప్రతీఘాతుక, నేరపూరిత సంస్థ. ఇది అనేక ఆపరేషన్స్ నిర్వహించి కేంద్రకమిటీ స్థాయి నుంచి, కింది స్థాయి వరకు అనేక మంది కామ్రేడ్స్‌ను హత్యగావించింది. ఇటువంటి ఆపరేషన్స్‌లో కొన్నింటిని, అందులో పాల్గొన్న శత్రుఏజెంట్లను పట్టుకొని ఇంటరాగేషన్ చేయడం ద్వారా బహిర్గతపరిచాము. ఇలా బహిర్గత పరిచిన వాటిలో ముఖ్యమైన వాటిని ఈ సంచిక నుంచి ఒక్కొక్కటి చొప్పున వరుసగా ప్రచురిస్తాము. వీటి అధ్యయనం శత్రు గుఢాచారి వ్యవస్థ (ఎస్.ఐ.బి) విప్లవోద్యమాన్ని దెబ్బతీసేందుకు అనుసరించిన ఎత్తుగడలనూ, పద్ధతులను అర్థం చేసుకొనేందుకు దోహదపడ్తుందని భావిస్తున్నాం.

1980ల చివరలో, కృష్ణాజిల్లా రాడికల్ యువజన సంఘం అధ్యక్షుడు సాయిపై, శత్రు నిర్బంధం తీవ్రతరమైంది. ఆ పరిస్థితులలో, పార్టీ ఆయనను పూర్తికాలం కార్యకర్తగా రహస్యజీవితానికి సిద్ధపరిచింది. అందుకు ఆయన కూడా తన సంసిద్ధతను వ్యక్తపరిచాడు. దీంతో పార్టీ ఆయనను పూర్తికాలం కార్యకర్తగా భర్తీచేసుకొని, రాష్ట్ర కమిటీ సభ్యుడికి కొరియర్‌గా నియమించాలని నిర్ణయించింది.

ఇదే సమయంలో విజయవాడలో ఉంటున్న మన సానుభూతిపరుడు ఒకరు సాయికి సంబంధించిన ఒక ముఖ్య విషయాన్ని మనకు తెలియచేసాడు. "సాయి కొద్దిరోజుల క్రితం అరెస్టు అయ్యాడనీ, పోలీసుల చిత్రహింసలకు లొంగిపోయి, పార్టీకి నష్టం కల్గించేందుకు సిద్ధపడి, పోలీసులతో ఒప్పందం కుదుర్చుకున్నాడనీ, ఈ విషయం తనకు ఎ.పి ఎస్.ఐ.బి (స్పెషల్ ఇన్వెస్టిగేషన్ బ్రాంచ్)లో పని చేస్తున్న మిత్రుడి ద్వారా తెలిసిందని" సమాచారం పంపాడు. ఆ మిత్రుడు ఎస్.ఐ.బి నుంచి పోలీసు శాఖలోని వేరే రంగానికి బదిలీ అవుతూ, "ఇంతకాలం మనం మిత్రులుగా వుంటున్నప్పటికీ, పార్టీకి సంబంధించి ఒక్క విషయం కూడా నువ్వు నాకు చెప్పలేదు. కానీ నీకు ఒక ముఖ్యమైన విషయాన్ని చెబుతున్నానని" సాయి విషయం చెప్పాడని కూడా తెలియచేసాడు.

అయితే సాయి తను అరెస్టు అయినట్లుగానూ, పోలీసులను మధ్య పెట్టి బయటకు వచ్చినట్లుగాను అంతకు ముందే పార్టీకి తెలియచేసాడు. సాయి చెప్పిన విషయాన్ని పార్టీ విశ్వసించింది. అయితే పార్టీ సాయిని రిక్రూట్‌మెంట్ చేసుకుంటున్న సందర్భంలో ఎస్.ఐ.బి పోలీసు ద్వారా ఈ సమాచారం అందటంతో, మొదట పోలీసులు ఉద్దేశ్యపూర్వకంగానే మనల్ని గందరగోళపరచడానికి ప్రయత్నిస్తున్నారని భావించింది. తర్వాత పార్టీ మొత్తం పరిస్థితిని మన అనుభవాల నుంచి లోతుగా విశ్లేషించుకొని, సాయిని కొంతకాలంపాటు గ్రామీణ ఉద్యమంలో పని చేస్తున్న దళాలలో వుంచి, పరిశీలన చేయాలని నిర్ణయించింది.

దీంతో సాయిని గుంటూరు జిల్లాలోని బొల్లాపల్లి దళంలోకి సభ్యుడిగా పింపింది. ఆ దళానికి బాధ్యతలు వహిస్తున్న కామ్రేడ్స్‌కు సాయి విషయాన్ని తెలియచేసి, అతనిని పరిశీలించమని చెప్పింది. సాయికి అప్పటికే 40 ఏళ్ళు దాటాయి. పార్టీలోకి రాకముందు తాగుడు వంటి అవలక్షణాలతో పాటు, జీవితం కొంత అరాచకంగా ఉండేది. ఇప్పుడు ఒక్కసారిగా పట్టణ జీవితం నుంచి గ్రామీణ గెరిల్లా జీవితానికి రావడంతో, సరైన తిండిలేకపోవడం, నిద్రలేమి, దీర్ఘ ప్రయాణాల వంటి సమస్యలతో సతమతమయ్యాడు. అయితే చాలా ఓపికగా, వినయంగా ఉంటూ, నాయకత్వానికి ఏ మాత్రం అనుమానం రాకుండా, ఒక సంవత్సరం పాటు వ్యవహరించాడు. దీంతో ఆ దళ నాయకత్వానికి అతనిపై సానుభూతి కూడా ఏర్పడింది. ఒక సంవత్సరం తర్వాత ఆ దళానికి చెందిన నాయకత్వం, పై కమిటీకి సాయికి సంబంధించిన 'పరిశీలనా రిపోర్టు'ను పంపింది. అందులో 'అతనెప్పుడూ బయటకు వెళ్ళడానికి ప్రయత్నించలేదనీ, అతడి ప్రవర్తన ఏ మాత్రం అనుమానాలకు తావివ్వలేదనీ, అతని వయస్సు, శారీరక దుర్బలత్వాన్ని దృష్టిలో ఉంచుకొని, అతనికి బయట ఏదైనా పని ఇస్తే మంచిదని' రాసింది.

కింది కమిటీ ఇచ్చిన రిపోర్టు ఆధారంగా, సాయిని రాష్ట్రకమిటీకి, ఉత్తరాంధ్రకు చెందిన శ్రీకాకుళం జిల్లా కమిటీ, విశాఖ జిల్లా కమిటీలకు మధ్య కొరియర్‌గా నియమించారు.

అయితే సాయికి రాష్ట్ర కమిటీ సభ్యులతో నేరుగా సంబంధం పెట్టలేదు. రాష్ట్ర కమిటీ సభ్యుడి ప్రధాన కొరియర్‌తోనే సంబంధం ఉండేలా సాయికి కొరియర్ పనిని అప్పగించారు. ఇలా సాయిని కొరియర్‌గా నియమించిన కొద్ది రోజులకే ఆతను ఎస్.ఐ.బి లింక్‌లోకి వెళ్ళాడు. అప్పటి నుంచి ఎ.పి పోలీసులు పార్టీకి చెందిన ప్రధాన నాయకత్వాన్ని అరెస్టు చేసేందుకు సమయం కోసం వేచి చూస్తూ వచ్చారు. ఈ క్రమంలోనే 1992 మే నెలలో, రాష్ట్ర కమిటీ సభ్యుడు శ్రీకాకుళం జిల్లా, విశాఖ సిటి బాధ్యులకు రాసిన ఒక ఉత్తరాన్ని రాష్ట్రకమిటీ కొరియర్ ద్వారా అందుకున్న సాయి దానిని ఎస్.ఐ.బి పోలీసు అధికారికి అందించాడు. అందులో రాష్ట్రకమిటీ సభ్యుడు తను నేరుగా శ్రీకాకుళం జిల్లా, విశాఖ సిటి బాధ్యులను కలిసే కాంటాక్టు రాశాడు. దీంతో పోలీసులు ఆ కాంటాక్టు వివరాలను నోట్ చేసుకొని, సాయి ద్వారా ఆ ఉత్తరాన్ని శ్రీకాకుళం జిల్లా, విశాఖ సిటి బాధ్యులకు అందేలా పురమాయించారు. సాయి ఆ ఉత్తరాన్ని ఆయా బాధ్యులకు చేరవేశాడు. ఈ విషయాలేవి తెలియని రాష్ట్రకమిటీ బాధ్యుడు మల్లిక్, శ్రీకాకుళం జిల్లా కమిటీ సభ్యుడు జోగాల్, విశాఖ సిటి బాధ్యుడు పురుషోత్తం అనుకున్న స్థలంలో కలుసుకున్నారు. అంతకు ముందే ఆ ప్రాంతంలో మోహరించి ఉన్న పోలీసులు అకస్మాత్తుగా ఆ ముగ్గురిపై పడి అరెస్టు చేశారు. ఆ తర్వాత విశాఖ సిటిలో, ఒక డెన్‌లో ఉంటున్న పురుషోత్తం సహచరిని అరెస్టు చేశారు.

పై అరెస్టులు జరగగానే మన దృష్టి సాయిపైకి వెళ్ళింది. సాయి డెన్‌కు అప్పుడప్పుడు వెళ్ళే రాష్ట్రకమిటీ ప్రధాన కొరియర్‌ను పిలిచి, ఈ అరెస్టులకు సంబంధించి ఆయన పరిశీలన తెలుసుకున్నాము. అతను ఇచ్చిన రిపోర్టు ప్రకారం సాయి డెన్‌లో సరిగ్గా ఉండేవాడు కాదనీ, అన్నం వండుకోకుండా హోటల్ నుంచి తెచ్చుకుంటుండేవాడనీ, ఖాళీ బ్రాందీ సీసాలు అతని డెన్‌లో కనిపించేవని తెలిసింది. ప్రధాన కొరియర్ ఈ విషయాలపై సాయిని అడిగినప్పుడు, సాయి సంతృప్తికరంగా సమాధానం చెప్పలేదని కూడా తెలిసింది. ఈ విషయాలన్నింటిని ప్రధాన కొరియర్, పార్టీ పైకమిటీకి తెలియజేస్తునే, సాయి ద్వారానే ఈ అరెస్టులు జరిగివుంటాయని తన అనుమానాన్ని వ్యక్తపరిచాడు.

పై రిపోర్టుతోపాటు, అంతకుముందే సాయిపై ఒక డౌట్ వచ్చి ఉండటంతో అతన్ని ఇంటరాగేట్ చేయాలనుకున్నాము. అయన్ని కాంటాక్టు చేసి పిలవగా టౌన్‌లో ఒక ప్లేస్‌కు వచ్చాడు. అక్కడ నుంచి గ్రామీణ ప్రాంతానికి తీసుకెళ్తున్న క్రమంలోనే అతని ప్రవర్తనలో మార్పురావడం ప్రారంభమైంది. భయం భయంగా తప్పు చేసిన వాడిలా ఉంటూ వచ్చాడు. అటవీ ప్రాంతానికి తీసికెళ్ళిన తర్వాత ఇంటరాగేషన్ ప్రారంభించాము. "అరెస్టులకు సంబంధించిన మొత్తం సమాచారం మా వద్ద ఉంది అంటూనే, నీవు నిజాయితీగా అరెస్టు వివరాలు మాట్లాడాలనీ, లేకుంటే మాట్లాడిస్తామని" హెచ్చరించడంతో, తను ఫీల్డు నుంచి బయటకు వచ్చిన తర్వాత జరిగిన పరిణామాలన్నింటినీ పూసగుచ్చినట్లు చెప్పాడు.

"తను ఫీల్డ్ నుంచి బయటకు రాగానే పార్టీకి తెలియకుండా కుటుంబాన్ని కాంటాక్టు చేసాననీ, అప్పుడు కూతురు వివాహం ఉందని తెలిసి పెళ్ళికి వెళ్ళాననీ, అక్కడ ఎస్.ఐ.బి అధికారి ఇమ్మాన్యూల్ రాజు కలిసి మాట్లాడాడని" చెప్పాడు. తను గతంలో అరెస్టు అయినప్పుడు ఇంటరాగేట్ చేసింది కూడా ఇమ్మాన్యూల్ రాజేనని కూడా చెప్పాడు. ఇమ్మాన్యూల్ రాజు పెళ్ళి దగ్గర కలవగానే "నీవు పెళ్ళికి వస్తావనీ, నిన్ను ఎప్పటికైనా నాయకత్వానికి కొరియర్‌గా నియమిస్తారని ముందుగానే ఊహించామని మాట్లాడి, ఇక నుంచి నీవు నా కాంటాక్టులో ఉంటావని చెప్పి తన డెన్ వద్దకు వచ్చి, కొంత డబ్బు ఇచ్చి వెళ్ళిపోయాడని చెప్పాడు. ఈ సందర్భంగా, తమని మోసం చేస్తే తీవ్రపరిణామాలుంటాయని హెచ్చరించాడని కూడా చెప్పాడు. ఈ సంఘటన తర్వాత ఇమ్మాన్యూల్ రాజు సాయిని రెగ్యులర్‌గా కలుస్తూ వచ్చాడు. సాయి కూడా ఎప్పటికప్పుడు తనకు తెలిసిన పార్టీ రహస్యాలను ఇమ్మాన్యూల్‌కు చెబుతూ వచ్చాడు. దీంతో ఇమ్మాన్యూల్‌కు సాయిపై నమ్మకం ఏర్పడి ఒకసారి తన ఇంటికి కూడా తీసుకెళ్ళాడు. ఇలా ఎప్పటికప్పుడు సాయి ఇస్తున్న సమాచారంలో భాగంగానే 'మే'లో పార్టీలో ముఖ్య నాయకత్వం ఒక చోట కలుస్తున్నారన్న విషయం తెలుసుకున్న ఇమ్మాన్యూల్ పథకం ప్రకారం మన కామ్రేడ్స్‌ను అరెస్టు చేయగలిగాడు.

ఈ ఇంటరాగేషన్ సందర్భంగానే ఇమ్మాన్యూల్ వివరాలను కూడా రాబట్టాము. ఇంటరాగేషన్ అనంతరం పైకమిటీ నిర్ణయం ప్రకారం సాయిని ఖతం చేయడం జరిగింది. ఇమ్మాన్యూల్ విజయవాడలోని ఒక బస్తీలో వడ్డీవ్యాపారి ముసుగులో వుంటూ వచ్చాడు. స్థానిక పోలీసులకు కూడా ఇతను ఇంటలిజెన్సీ అధికారి అని తెలియదు. ఇతని వివరాలు తెలుసుకున్న మన కామ్రేడ్స్ ఇతని పూర్తి సమాచారం రాబట్టేందుకు ఒక రెక్కీ టీంను ఏర్పర్చారు. వాళ్ళు 15 రోజుల పాటు సర్వే చేసి, అతని ఇంటి అడ్రస్‌ను కనుక్కోవడంతోపాటు, అతని రోజువారి కార్యకలాపాలను నిర్దిష్టంగా అధ్యయనం చేశారు. ఇమ్మాన్యూల్ చుట్టుపక్కల వాళ్ళకు వడ్డీవ్యాపారిగానే పరిచయం అయ్యాడు. కొద్ది మందికి వడ్డీకి డబ్బులు ఇస్తుండేవాడు. రోజు ఉదయాన్నే లేచి, దగ్గరగా ఉన్న హోటల్‌కు వెళ్ళి, ఒకచోట చివర, గోడకు అనుకొని వున్న బల్లపై కూర్చుని టిఫిన్ చేస్తూ, ఆ రోజు వచ్చిన పేపర్స్ చూస్తూ ఉంటాడనీ, ఒకవైపున పేపర్స్ చూస్తునే మరోవైపు హోటల్‌కు వచ్చే వారిని పరిశీలిస్తుంటాడని సమాచారం పట్టుకొచ్చారు. ఈ సమాచారం ఆధారంగా ఒక ఏక్షన్ టీంను ఏర్పాటు చేసి, ఇమ్మాన్యూల్‌ను అదే హోటల్‌లో ఖతం చేశాము. ఎస్.ఐ.బిలో సి.ఐ ర్యాంకులో ఉన్న ఒక అధికారిని పట్టణం నడిఒడ్డున మనం ఖతం చేయడంతో, పోలీసు అధికారులు ఉలిక్కిపడ్డారు. ఈ చర్య విప్లవ ప్రజానీకంలో గొప్ప ఉత్సాహన్ని కల్గించింది. పార్టీపై విశ్వాసాన్ని పెంచింది.

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) కేంద్ర కమిటీ

**పత్రికా ప్రకటన**

తేదీ : ఆగస్టు 7, 2019

## రాష్ట్ర ప్రత్యేక ప్రతిపత్తిని రద్దు చేసే 'జమ్ము-కశ్మీర్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2019' ఉపసంహరించాలని డిమాండ్ చేస్తూ, కశ్మీర్ ప్రజల స్వయంనిర్ణయాధికార హక్కును బలపరిస్తూ ప్రజా ఉద్యమాన్ని నిర్వహించండి!

### కశ్మీర్‌లోని, దేశంలోని యావత్తు ప్రజాస్వామికవాదులకు, జాతుల, పీడిత వర్గాల, సెక్షన్ల ప్రజలకు సీపీఐ (మావోయిస్టు) పిలుపు!

జమ్ము-కశ్మీర్ రాష్ట్రాన్ని ప్రభుత్వ కిరాయి సాయుధ బలగాలతో దిగ్బంధించి బ్రాహ్మణీయ హిందూ ఫాసిస్టు మోడీ ప్రభుత్వం ఆ రాష్ట్రానికి ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే ఆర్టికల్ 370, 35ఏలను రద్దు చేస్తూ 'జమ్ము-కశ్మీర్ పునర్వ్యవస్థీకరణ బిల్లు-2019'ని అత్యంత నిరంకుశంగా ప్రతిపక్షాల గొంతును సైతం నొక్కివేసి ఆగస్టు 5, 6 తేదీల్లో పార్లమెంటులో ఆమోదించింది. దీనిని వెంటనే ఆమోదిస్తూ దేశ రాష్ట్రపతి గెజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేసాడు. ఈ చట్టం ప్రకారం కశ్మీరు ప్రజలు తమ కనీస హక్కులను కోల్పోయారు. దీని ప్రకారం రాష్ట్రాన్ని రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా – అసెంబ్లీతో కూడిన కేంద్రపాలిత ప్రాంతంగా జమ్ము-కశ్మీర్‌ను, అసెంబ్లీలేని కేంద్రపాలిత ప్రాంతంగా లడాక్ ప్రాంతాన్ని పునర్వ్యవస్థీకరించారు.

'ఆజాద్ కశ్మీర్'ను సాధించుకునే లక్ష్యంతో విడిపోయే హక్కుతో స్వయంనిర్ణయాధికార ప్రజాస్వామిక ఆకాంక్షలతో 70 సంవత్సరాలుగా సాగుతున్న కశ్మీర్ ప్రజల పోరాటాన్ని క్రూరంగా ఉక్కుపాదంతో అణచివేయడం కోసం కేంద్రంలోని అధికార హిందూ ఫాసిస్టు మోడీ-అమిత్‌షా-మోహన్ భాగవత్ ముఠా లోక్‌సభలో తనకు గల మందబలాన్ని ఉపయోగించుకొని జమ్ము-కశ్మీర్ రాష్ట్ర ప్రత్యేక ప్రతిపత్తిని రద్దు చేయటం ద్వారా దేశ రాజ్యాంగాన్ని ఘోరంగా ఖూనీ చేసింది. ఇది కశ్మీర్‌ను మరోసారి దురాక్రమణ చేయడం తప్ప మరొకటి కాదు. దీనిని మా పార్టీ కేంద్రకమిటీ తీవ్రంగా ఖండిస్తోంది.

జమ్ము-కశ్మీర్ భారతదేశంలో అంతర్భాగమనీ, జమ్ము-కశ్మీర్ పైనే కాకుండా పాక్ అధీన కశ్మీర్‌పై కూడా భారత్‌కు అధికారం ఉందనీ, కశ్మీర్‌పై చట్టం చేసే అధికారమూ, 'సామర్థ్యమూ' భారత ప్రభుత్వానికి ఉందనీ మోడీ ప్రభుత్వం తన ఈ చర్యను నిసిగ్గుగా సమర్థించుకుంది. నిజానికి కశ్మీర్ 1948కు ముందు భారతదేశంలో భాగంగా లేదనేది చారిత్రక సత్యం. మోడీ ప్రభుత్వం గత కేంద్ర ప్రభుత్వాల లాగానే దీనిని మరుగుపరిచేందుకు విఫలయత్నం చేస్తున్నది. ఇందుకోసం కశ్మీర్ సమస్యపై ఐక్యరాజ్యసమితి మధ్యవర్తిత్వంలో భారత్, పాక్‌ల ఆమోదంతో ఐక్యరాజ్యసమితి చేసిన – భారత్, పాక్, చైనా సరిహద్దుల్లోనూ, కశ్మీర్‌లోనూ యథాస్థితిని కొనసాగించాలి, వాస్తవాధీన రేఖ (ఎల్ఓసీ)ను ఉల్లంఘించరాదనీ, ప్రజాభిప్రాయ సేకరణ జరిపి కశ్మీర్ సమస్యపై నిర్ణయం తీసుకోవాలి – తీర్మానాలను కూడా బుట్టదాఖలు చేసింది. గతంలో రెండు దేశాలు ద్వైపాక్షిక చర్చల ద్వారానే కశ్మీర్ సమస్యను పరిష్కరించుకోవాలని చేసుకున్న సిమ్లా ఒప్పందాన్ని, లాహోర్ డిక్లరేషన్‌ను, చివరకు తాను పరిరక్షిస్తానని వాగ్దానం చేసిన భారత రాజ్యాంగాన్ని సైతం ఉల్లంఘించింది. కశ్మీర్‌లోని రాజకీయ పార్టీలన్నీ కలిసి అఖిలపక్ష సమావేశం నిర్వహించి 'మోడీ ప్రభుత్వం ఆర్టికల్ 370, ఆర్టికల్ 35ఏలను రాజ్యాంగవిరుద్ధంగా రద్దు చేస్తే దానిని కశ్మీర్‌పై దాడిగా భావించాల్సి ఉంటుంది' అని చేసిన హెచ్చరికను కూడా అది ఖాతరు చేయలేదు. ఏకపక్షంగా నిరంకుశ చట్టాన్ని చేసి కశ్మీర్‌ను దురాక్రమించింది.

ఈ రెండు ఆర్టికల్స్ జమ్ము-కశ్మీర్ అభివృద్ధికి ఆటంకంగా ఉన్నాయనీ, అక్కడి రాజకీయ నాయకుల అవినీతి పెరగడానికే ఇవి తోడ్పడుతున్నాయనీ, ఈ ఆర్టికల్స్ రద్దయితే ఈ ప్రాంత అభివృద్ధికి మార్గాలు తెరుచుకుంటాయనీ, బయట నుంచి కంపెనీలు ఇక్కడ భూములు కొనుగోలు చేసి, మదుపులు పెట్టి పరిశ్రమలు స్థాపించే అవకాశం లభిస్తుందనీ, పెద్దెత్తున ఈ ప్రాంతం పారిశ్రామికవంతమై నిరుద్యోగ సమస్య పరిష్కారమవుతుందనీ, దీని వల్ల ఈ ప్రాంతానికి అధిక రెవెన్యూ కూడా వసూలు అవుతుందనీ, దీంతో కశ్మీర్ లోయలో టెర్రరిజం అంతమవుతుందనీ చెబుతూ మోడీ ప్రభుత్వం ప్రజల్ని మోసగించాలని చూస్తున్నది. కానీ, అది పేదరికం, నిరుద్యోగం, అవినీతి పెరగడంలోను, అల్పసంఖ్యాక ప్రజలు, దళితులు, ఆదివాసులు, మహిళలపై అత్యాచారాలలోనూ భారతదేశం ప్రపంచ రికార్డులను బద్దలుగొడుతున్నదన్న విషయాన్ని మరుగుపరుస్తున్నది. నిజానికి ఈ బిల్లును ప్రవేశపెడితే కశ్మీర్ ప్రజల నుంచి వచ్చే ఎటువంటి నిరసన/ప్రతిఘటనను అయినా కాలరాచివేసేందుకు అది కొద్ది రోజుల ముందే యుద్ధ ప్రాతిపదికన సన్నాహాలు చేసింది.

ఇప్పటికే అక్కడ రోజువారీ ప్రాతిపదికన కశ్మీరు యువకులను, ప్రజలను టెర్రరిస్టు ముద్ర వేసి హత్య చేసింది. అనేక మంది హురియత్ కాన్ఫరెన్స్ నాయకులను జైళ్లలో తోసింది. మోహరించివున్న 5 లక్షల భారత ప్రభుత్వ సాయుధ బలగాలకు అదనంగా మరో 25 వేల మందితో కూడిన కేంద్ర పారామిలటరీ బలగాలను మోహరించింది. రాష్ట్రంలోని ప్రముఖ రాజకీయ పార్టీల నాయకులతో పాటు అనేక మందిపై గృహ నిర్బంధం విధించింది. ఇంకా చాలా మందిని జైళ్లల్లోకి తోసింది. పాకిస్తాన్ సరిహద్దు ప్రాంతాల్లో పెద్దెత్తున సైనిక బలగాలను మోహరించి యుద్ధానికి కాలుదువ్వుతున్నది. బిల్లును ప్రవేశపెట్టిన వెంటనే దేశవ్యాప్తంగా కుహనా జాతీయవాదాన్ని రెచ్చగొట్టడానికి, టెర్రరిస్టు ముద్ర వేసి ముస్లిములపై దాడి చేయడానికి అన్ని రాష్ట్రాలలో రెడ్ అలర్ట్‌ను జారీ చేసింది. వాస్తవానికి నయా జియోనిస్టు విధానాలను అవలంబించే మోడీ ప్రభుత్వానికి కావాల్సింది కశ్మీర్ భూమి తప్ప కశ్మీర్ ప్రజలు, వారి ఆకాంక్షలు కాదు. రాష్ట్రాలకు గల నామమాత్ర హక్కులను సైతం కాలరాచివేయడం, భారత పాలకవర్గాల విస్తరణవాద ప్రయోజనాలను నెరవేర్చడం, కశ్మీరులో సమృద్ధంగా ఉన్న ప్రకృతి వనరులను, మానవ శ్రమను కొల్లగొట్టడానికి సామ్రాజ్యవాద బహుళజాతి కంపెనీలకు, దేశీయ దళారీ బూర్జువా ఘరానాలకు మార్గాన్ని సుగమం చేయడం, జమ్ము, కశ్మీర్, లడాక్ ప్రాంతాల ప్రజలను విభజించి-పాలించడం, కశ్మీర్‌ను పాలస్తీనాగా, అందులో కశ్మీరీ ప్రజలను అల్పసంఖ్యాకులుగా తయారు చేయడం ఈ చట్టం వెనుక ఉన్న అసలు ఉద్దేశ్యం. వాస్తవం ఇది కాగా దేశవ్యాప్తంగా ప్రజలు ఉత్సవాలు జరుపుకుంటున్నారని కార్పొరేట్ మీడియా పెద్దెత్తున గోబెల్స్ ప్రచారంతో హోరెత్తిస్తూ ప్రజల్ని మోసగిస్తోంది.

నిజానికి ప్రభుత్వం విధించిన కర్ఫ్యూని సైతం ధిక్కరిస్తూ జర్మనీ నాజీ తరహా భారత ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా కశ్మీర్ ప్రజలు వీధుల్లోకి వచ్చి రాళ్లతో ప్రభుత్వ కిరాయి సాయుధ బలగాలతో తలపడుతున్నారని వార్తలు వస్తున్నాయి. దేశంలోని వివిధ ప్రాంతాలు ప్రజలు నిరసన ప్రదర్శనలకు దిగారు. ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జరిగిన పెద్ద నిరసన ప్రదర్శనలో కశ్మీర్ విద్యార్థులతో సహా పలు రాష్ట్రాల ప్రజలు పాల్గొన్నారు. దేశంలోని మెజారిటీ ప్రతిపక్ష పార్టీలు ఆర్టికల్ 370 రద్దును తీవ్రంగా నిరసించాయి. పాకిస్తాన్ ప్రభుత్వం ఆర్టికల్ రద్దు పట్ల తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. చైనా లడాక్ విషయంలో తీవ్రంగా స్పందిస్తూ లడాక్‌పై నిర్ణయం భారత ప్రభుత్వం తీసుకోజాలదని స్పష్టం చేసింది. కానీ ఐక్యరాజ్యసమితి మాత్రం సామరస్యపూర్వకంగా చర్చల ద్వారా కశ్మీర్ సమస్యలను పరిష్కరించుకోవాలని భారత్, పాక్‌లకు ఉచిత సలహా ఇచ్చి కేవలం ప్రేక్షక పాత్ర వహించింది.

**కశ్మీర్ ప్రజలారా! భారత పీడిత జాతుల, వర్గాల, సెక్షన్ల ప్రజలారా! ప్రజాస్వామికవాదులారా!**

భారత దళారీ పాలకవర్గాలు తమ సామ్రాజ్యవాద ప్రభువుల దోపిడీ ప్రయోజనాలను, తమ విస్తరణవాద ఆకాంక్షలను నెరవేర్చుకునే లక్ష్యంతో దేశాన్ని అత్యంత కేంద్రీకృత 'హిందూ ఫాసిస్టు రాజ్యం'గా మార్చడంలో భాగంగా 'దేశ సమైక్యత', 'దేశ సమగ్రత'ల పేరుతో 'అఖండ భారత్' నిర్మించేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. మోడీ ప్రభుత్వ 'న్యూ ఇండియా' (నయా భారత్) సారాంశం ఇదే. దేశంలో దళితులు, మహిళలు, వివిధ జాతులు, మతమైనారిటీల ప్రజలు తమ ప్రజాస్వామిక హక్కుల కోసం, రాజ్యహింసకు వ్యతిరేకంగా సాగిస్తున్న ఉద్యమాలను, ఈ న్యాయమైన ప్రజా ఉద్యమాలకు లభిస్తున్న అంతర్జాతీయ మద్దతును క్రూరంగా కాలరాచే లక్ష్యంతో ఇటీవల మోడీ ప్రభుత్వం దేశంలో టెర్రరిజాన్ని నిర్మూలించే పేరుతో 'ఎన్ఐఏ సవరణ బిల్లు-2019'ను, 'ఉపా సవరణ చట్టం-2019'ని తీసుకొచ్చింది. కేంద్ర, రాష్ట్ర మానవహక్కుల కమీషన్లను బ్రాహ్మణీయ హిందూ మతదురహంకార శక్తులతో నింపివేసే, దేశంలోని పీడిత వర్గాలు, సెక్షన్లు, జాతులకు నామమాత్ర మానవహక్కులు సైతం కాలరాచివేసే కుట్రతో 'మానవహక్కుల పరిరక్షణ సవరణ చట్టం-2019'ని, ప్రజాస్వామికవాదులు, ప్రజలు పోరాడి సాధించుకున్న 'సమాచార హక్కు చట్టం-2005'ని నీరుగారుస్తూ 'సమాచార హక్కు సవరణ చట్టం-2019'ని, వైద్య రంగాన్ని బహుళజాతి కంపెనీలకు అప్పగించే 'జాతీయ మెడికల్ కమీషన్ చట్టం-2019'ని, కార్మిక హక్కులను కాలరాచే వేసే చట్టం వంటి పలు నిరంకుశ బిల్లులను ఆమోదిస్తూ రాజ్యాన్ని బాహాటంగా ఫాసిస్టీకరిస్తూ అది దేశవ్యాప్తంగా పెద్ద ఫాసిస్టు దాడికి రంగం సిద్ధం చేసుకుంటున్నది. అది కశ్మీర్‌పై దాడి చేయడం ద్వారా దేశంలో తన హిందూ ఫాసిస్టు దాడిని దూకుడుగా ప్రారంభించింది. ఈ దాడి రానున్న కాలంలో దేశంలో మత మైనారిటీలపై, ప్రత్యేకించి ముస్లిములపై, మహిళలు, దళితులు, ఆదివాసులపై, ఈశాన్య జాతులతో సహా దేశంలోని పలు పీడిత జాతుల, మొత్తం ప్రజా ప్రయోజనాల కోసం పోరాడే నిజమైన ప్రజాస్వామికవాదులపై మరింత తీవ్ర రూపం తీసుకుంటుంది. దేశాన్ని వినాశకర పరిణామాల వైపుగా తీసుకుపోతుంది. అందువల్ల మోడీ ప్రభుత్వం నేడు కశ్మీర్‌పై చేసిన దాడిని దేశంలోని వివిధ జాతులు, రాష్ట్రాలపై, మతమైనారిటీలు, దళితులు, ఆదివాసులు, మహిళలపై దాడిగా గుర్తించాలి. నిరంకుశ, క్రూర జమ్ము-కశ్మీర్ పునర్వ్యవస్థీకరణ బిల్లు-2019ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ కశ్మీర్‌లోని యావత్తు పీడిత వర్గాల, పీడిత సెక్షన్ల ప్రజలతో పాటు రాజకీయ పార్టీలు, ప్రజాస్వామిక సంస్థలు, ప్రజాస్వామికవాదులు; అలాగే దేశవ్యాప్తంగా ప్రజాస్వామికవాదులు, పీడిత జాతులు, పీడిత వర్గాలు, సెక్షన్లు, ఈ చట్టాన్ని వ్యతిరేకించే రాజకీయ పార్టీలు పెద్దెత్తున ప్రజలను కదిలించాల్సిందిగా, సమరశీల ప్రజా ఉద్యమాన్ని నిర్మించాల్సిందిగా మా పార్టీ కేంద్రకమిటీ పిలుపునిస్తోంది.

Abhay

**అభయ్**

**అధికార ప్రతినిధి,**

**కేంద్ర కమిటీ,**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు).**

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)

# ఆంధ్ర - ఒడిశా సరిహద్దు ప్రాంత కమిటీ

తేది : 11-నవంబర్-2019

## బాబ్రీమసీదు, రామజన్మభూమి వివాదంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు అప్రజాస్వామికం, హిందుత్వ పక్షపాత వైఖరితో కూడుకున్నది

ఈ తీర్పు వెలువడగానే, ప్రధానమంత్రి మోడీ దేశ ప్రజలను ఉద్దేశిస్తూ చేసిన 11 నిమిషాల ప్రసంగంలో "ఇది నవభారతానికి నాంది అనీ, భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక"అని వ్యాఖ్యానించాడు. ఈ వ్యాఖ్యానాలలో నర్మగర్భంగా వున్న విషయమేమిటంటే, నవభారత్ పేరుతో హిందూ రాజ్యాన్ని నిర్మించడం, భిన్నత్వంలో ఏకత్వం పేరుతో దేశంలోని సర్వవైవిధ్యాలను ఉరితీసి, హిందుత్వాన్ని మాత్రమే అనుమతించడం. అందుకే ఈ తీర్పు పరమ అప్రజాస్వామికమైనదనీ, హిందుత్వ పక్షపాతంతో కూడుకున్నదనీ, లౌకికరాజ్య భావనను ధ్వంసం చేసేదిగా ఉన్నదని ప్రకటిస్తూ, ఈ తీర్పును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. అంతేకాకుండా వివాదస్పదమైన ప్రదేశంలో బాబ్రీమసీదును నిర్మించడమే నిజమైన ప్రజాస్వామ్యానికీ, లౌకికతత్వానికి ప్రతీకగా వుంటుదని ప్రకటిస్తున్నాం. ఈ తీర్పుకు వ్యతిరేకంగా ప్రజాస్వామికవాదులు, లౌకికవాదులు, ప్రగతిశీల శక్తులు ఐక్యమై ఉద్యమించాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

దేశంలో నరేంద్రమోడీ నాయకత్వంలోని బి.జె.పి, ఆర్.ఎస్.ఎస్ ఫాసిస్టు మూకలు హిందూ మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ, తమ శక్తిని పెంచుకొని పీడితుల మీద మరిన్ని దాడులు చేయడానికి సిద్ధమవుతున్నారు. వీరు ప్రధానంగా ముస్లిం అల్పసంఖ్యాక వర్గాన్ని టార్గెట్ చేస్తూ, ఇతర పీడిత సెక్షన్‌లను కూడా వదలకుండా దాడి చేస్తున్నారు. 1992లో బాబ్రీమసీదును కూల్చిన నేరస్తులను శిక్షించకుండా, ఆ స్థలాన్ని వివాదంగా మార్చి, ఇన్ని సంవత్సరాలుగా సమస్యను నాన్చుతూ, ప్రజలలో చీలికలు తెచ్చి, తమ ఓట్ల రాజకీయ చదరంగంలో బి.జె.పితోపాటు, మిగిలిన ఓట్ల పార్టీలన్నీ నాటకాలాడుతూ వచ్చాయి.

బి.జె.పి రెండవసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్.ఎస్.ఎస్ ఎజెండాను మరింత దూకుడుగా అమలు జరపమొదలు పెట్టింది. 370 ఆర్టికల్‌ను రద్దు చేసి, కశ్మీర్‌ను జైలుగా మార్చింది. రామమందిర నిర్మాణం గురించి పార్లమెంటు ఎన్నికలకు ముందే ప్రకటించింది. దానికి అనుగుణంగానే సుప్రీంకోర్టు ఆ స్థలాన్ని కేంద్ర ప్రభుత్వానికి అప్పగించి, రామమందిర నిర్మాణం చేయమని సలహా ఇచ్చింది. హిందూ ఫాసిస్టులు ఏమి ఆదేశించారో అదే పనిని సుప్రీంకోర్టు అమలు జరిపింది.

ఈ చర్య ద్వారా దేశంలో ప్రజాస్వామ్యమనీ, సెక్యూలరిజమనీ, అరిచే కుహనా మేధావులు కళ్ళు తెరిచి చూడాలి. వాస్తవంగా భారతరాజ్యం మొదటి నుంచీ హిందూ అనుకూల రాజ్యంగానే ఉంది. మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత భారతరాజ్య హిందూ అనుకూల స్వభావం మరింతగా బహిర్గతమైంది.

మోడీ ప్రభుత్వం ప్రజలను రామమందిర నిర్మాణం పేరుతో మతపిచ్చిని రెచ్చగొట్టి, ఉన్మాదస్థితికి తీసుకొని వెలుతూ, మరొకవైపు దేశ వనరులునూ, సంపదను కార్పొరేట్ కంపెనీలకు, సామ్రాజ్యవాద కంపెనీలకు అప్పచెబుతున్నది. ఇందుకు వ్యతిరేకంగా ఉన్న కార్మికులు, రైతాంగం ఇంకా ఇతర శ్రామిక, పీడిత, మత మైనారిటీలు, దళితులు, మహిళలు, జాతులపై దాడులు చేస్తున్నది.

దేశాన్ని అభివృద్ధి చేయడం పేరుతో సామ్రాజ్యవాదుల, దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గాల ప్రయోజనాలకు, అన్ని పీడిత వర్గాల, సెక్షన్‌ల ప్రజల ప్రయోజనాలను లోబడేలా చేస్తున్నది. దీనికి ఎలాంటి విమర్శనూ, వ్యతిరేకతనూ, నిరసనను తెలియచేయకుండా, ఆమోదించడాన్నే 'దేశభక్తి'గా ప్రచారం చేస్తున్నది. ఇందుకు భిన్నంగా వ్యవహరించిన వారిని దేశద్రోహులని ముద్రలు వేసి, హత్యలు చేయడం, జైళ్ళకు పంపించడం చేస్తున్నది. దేశంలో రాజ్యాంగయంత్రం పూర్తిగా కాషాయమయమైపోయింది. కోర్టులు కూడా కాషాయ భావజాలంతోనే ఉన్నాయి. అందుకనే గుజరాత్ మరణకాండ జరిగినా, ఇంకా అటువంటివి కొనసాగుతున్నా కోర్టులు కళ్ళు అప్పగించి చూస్తున్నాయి. వాస్తవంగా ఈ సందర్భంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ప్రాతిపదికగా చేసుకుంటే, చరిత్రలో జరిగిన ఎన్నో సంఘటనలను సమీక్షించాల్సి ఉంటుంది. బౌద్ధారామాలను కూల్చి, హిందూ దేవాలయాలను నిర్మించిన సంఘటనలనూ, ద్రవిడ సంస్కృతికి చెందిన మాతృస్వామిక వ్యవస్థలోని స్త్రీ దేవతల స్థానంలో, ఆర్యుల పితృస్వామిక సంస్కృతికి చెందిన పురుష దేవుళ్ళను ప్రతిష్టించిన సంఘటనలనూ, ఇంకా ఇటువంటి అనేక సంఘటనలను సమీక్షించి తిరిగి కొత్త తీర్పులను ఇవ్వాల్సి ఉంటుంది. ఇందుకు మోడీ ప్రభుత్వం సిద్ధంగా ఉందా? వాస్తవంగా మోడీ ప్రభుత్వం ఇందుకు సిద్ధపడదు. దానికి కావల్సింది ఈ దేశంలో సామ్రాజ్యవాదులకు సేవ చేసే బ్రాహ్మణవాద హిందూ భూస్వామ్యమే. అందుకే సుప్రీంకోర్టు ద్వారా ఈ తీర్పును వెలువరించింది.

దేశంలోని బ్రాహ్మణీయ హిందూమతోన్మాదానికి పునాది, అర్ధవలస, అర్ధభూస్వామ్య, ఆర్థిక, రాజకీయ వ్యవస్థలో ఉంది. కనుక దీనిని వ్యవసాయ విప్లవం పునాదిగా, సాయుధ పోరాటం చేపట్టి ధ్వంసం చేయాలి. అప్పుడు మాత్రమే హిందూ ఫాసిజం అంతమవుతుంది. కనుక అశేష పీడిత ప్రజానీకం ప్రజాయుద్ధంలో సమీకృతులై, హిందూ ఫాసిజానికి పునాదిగా ఉన్న ఈ అర్ధవలస, అర్ధభూస్వామ్య వ్యవస్థను ధ్వంసం చేయాలి.

★ బాబ్రీమసీదు ఎప్పటి స్థలంలోనే నిర్మించాలి!

★ బాబ్రీమసీదు విధ్వంసకాండలో పాల్గొన్న హిందూ ఫాసిస్టు నాయకులను శిక్షించాలి!

★ సమైఖ్య పోరాటాల ద్వారా బ్రాహ్మణీయ హిందూ ఫాసిజాన్ని ఎదుర్కోవాలి!

Ganesh

సెక్రటరీ

ఎ.ఒ.బి స్పెషల్ జోనల్ కమిటీ,

సి.పి.ఐ (మావోయిస్టు).

## దోపిడీ ప్రభుత్వాల మెడలు వంచి మన్యం ప్రజలు సాధించుకున్న పోరాట విజయమే 97 జి.ఓ రద్దు!

## ఈ పోరాట స్ఫూర్తితోనే జగన్ ప్రభుత్వపు మోసపూరిత ఎత్తుగడలను తిప్పికొట్టండి!!

## పీడిత ప్రజల రాజ్యాధికార సాధనకై కొనసాగుతున్న ప్రజాయుద్ధంలో సమైక్యం కండి!!!

*ప్రియమైన ప్రజలారా!*

మన్యంలో ఆదివాసీల చరిత్ర అంటే అది పోరాటాల చరిత్రే. నాడు బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా అల్లూరి నాయకత్వంలో జరిగిన మన్యం పితూరి నుండి నేడు భూస్వాముల, పెత్తందార్ల, షావుకార్ల, ప్రభుత్వ, ఫారెస్టు, ఎ.పి.ఎఫ్.డి.సి మొదలైన దోపిడీ సంస్థలు సాగిస్తున్న దోపిడీ, పీడనలకు వ్యతిరేకంగా ఆదివాసీ ప్రజలు జీవన్మరణ పోరాటం చేస్తున్నారు. 80వ దశకంలో మన్యంలో ఆదివాసీల జీవితాల్లోకి ప్రవేశించిన మా పార్టీ వారి కష్టాలను, కడగండ్లను స్వంతం చేసుకుని, ప్రజా రాజ్యాధికార సాధన ద్వారానే పీడిత ప్రజలు విముక్తి గావించబడతారనీ, అది సాయుధ పోరాటం ద్వారా మాత్రమే సాధ్యమవుతుందనీ నిరంతరం చైతన్య పరుస్తూ, వారు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై పోరాడేందుకు మార్గదర్శకత్వం అందిస్తూ, వారిని సాయుధులను చేస్తున్నది. అందులో భాగంగానే మన్యం ప్రజలు బాక్సైట్‌కు వ్యతిరేకంగా గత 2 దశాబ్దాలుగా వీరోచితంగా పోరాడుతున్నారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 1998లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం మన్యంలో కొట్లాది రూపాయల విలువ చేసే బాక్సైట్ ఖనిజాన్ని తవ్వుకుపోయేందుకు యూనైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు చెందిన బహుళ జాతి కంపెనీతో ఎమ్.ఒ.యులను కుదుర్చుకున్నది. ఆదివాసీ ప్రాంతాల్లో ఖనిజాలు తవ్వాలంటే పెసా చట్టం ప్రకారం గ్రామసభ అనుమతితోపాటు, 5వ షెడ్యూల్ ప్రకారం గిరిజన సలహా మండలి ఆమోదం కూడా  అవసరం. కానీ చంద్రబాబు ప్రభుత్వం ఈ చట్టాలను తుంగలో తొక్కి పై ఒప్పందాన్ని కుదుర్చుకొన్నది. అంతేకాక 1/70 చట్టాన్ని కూడా తమ దోపిడీకి అనుకూలంగా సవరించేందుకు పూనుకున్నది. ఈ పరిస్థితుల్లో మవోయిస్టు పార్టీ నాయకత్వంలో మన్యం ప్రజలు 'బాక్సైట్‌ను వ్యతిరేకిద్దాం – అడవిని కాపాడుకుందాం' అనే నినాదంతో సాధారణ ఆందోళనలు, నిరసన కార్యక్రమాలు మొదలుకొని, సాంప్రదాయక ఆయుధాలు ధరించి ఊరేగింపులు, రాస్తారోకోలు, రహదారి దిగ్బంధనలు, దిష్టిబొమ్మల దహనం వంటి పలు రూపాల్లో పోరాటాలు నిర్వహించారు. ఈ పోరాటాలను అణచివేయడానికి ప్రభుత్వం ప్రయోగించిన నిర్బంధాన్ని కూడా ప్రజలు సంఘటితంగా ప్రతిఘటించారు. ఈ క్రమంలోనే బాక్సైట్ వ్యతిరేక పోరాటాన్ని అణచివేయడానికి కంకణం కట్టుకున్న టి.డి.పి పార్టీ ప్రచార కార్యదర్శి వెంకటరాజు ప్రజల చేతిలో కుక్కచావు చచ్చాడు. మరికొంత మంది టి.డి.పి నాయకుల ఆస్తులను ప్రజలు ధ్వంసం చేశారు. ఆ తర్వాత 2004లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టి.డి.పి ఘోరపరాజయం పొందటంతో, బాక్సైట్ గనుల ప్రాజెక్టుకు తాత్కాలికంగా తెరపడింది.

అదే ఎన్నికల ప్రచారంలో, కాంగ్రెస్ పార్టీకి నేతృత్వం వహించిన వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి, అప్పటి వరకు చంద్రబాబు అనుసరించిన ప్రపంచబ్యాంకు అభివృద్ధి నమూనాను తీవ్రంగా వ్యతిరేకించటమే కాకుండా, విప్లవోద్యమంపై అమలు చేసిన దమనకాండను సైతం వ్యతిరేకించినట్లుగా ఫోజులిచ్చాడు. అంతేకాకుండా అసెంబ్లీలో చంద్రబాబు చేపట్టిన బాక్సైట్ గనులకు వ్యతిరేకంగా మాట్లాడాడు. కానీ నయవంచనలో ఆరితేరిన రాజశేఖర్ రెడ్డి అధికారంలోకి రాగానే బాక్సైట్ గనుల ఒప్పందాన్ని పునరుద్ధరించాడు. అరకు, చింతపల్లి ప్రాంతాల్లో ఉన్న బాక్సైట్‌ను జిందాల్, ఆన్‌రాక్ కంపెనీలకు అప్పగిస్తూ ఒప్పందాలు చేసుకున్నాడు. ఇవి కాకుండా జి.కె వీధి ప్రాంతంలో వున్న బాక్సైట్‌ను, తూర్పు గోదావరి జిల్లా వైరామవరం ప్రాంతంలోని బాక్సైట్‌ను నాల్కోకు కేటాయించాడు. ఇంతే కాకుండా విజయనగరం జిల్లా ఎస్.కోటవద్ద జిందాల్‌కు, విశాఖలోని మాకవరపాలెం వద్ద ఆన్‌రాక్‌కు బాక్సైట్ శుద్ధి కార్మాగారాల (రిఫైనరీలు)ను నిర్మించడానికి అనుమతులిచ్చాడు. ఈ క్రమంలో బాక్సైట్ వ్యతిరేకపోరాటం మళ్ళీ ఎజెండాలోకి వచ్చింది. మన్యంలో ఆదివాసీ ప్రజానీకం, ఇతర ప్రజాస్వామిక శక్తులు, సంస్థలు, బాక్సైట్ వెలికితీతకు వ్యతిరేకంగా ఉద్యమించారు. బాక్సైట్ మట్టి నమూనాల కోసం వచ్చిన అధికారులను, ఆన్‌రాక్ కంపెనీ ఏజెంట్లను అనేకసార్లు ప్రజలు అడ్డుకున్నారు. ఎ.పి.ఎమ్.డి.సి అధికారులను నిర్బంధించారు. వారి వాహనాలను ధ్వంసం చేశారు. దేహశుద్ధులు చేశారు. బాక్సైట్‌కి సంబంధించి పర్యావరణ అనుమతుల విషయంలో హెలికాప్టర్‌లో ఏరియల్ సర్వేకు వచ్చిన నిపుణుల కమిటీ, గోపురంకొండ శిఖరంపై విల్లంబులు సారించి వున్న ఆదివాసీలను చూసి, హెలికాప్టర్‌ను కిందికి దించకుండానే వెళ్ళిపోయింది. ఈ విధంగా వై.ఎస్. రాజశేఖర్డ్డీ, ఆ తర్వాత ముఖ్యమంత్రులగా బాధ్యతలు చేపట్టిన కిరణ్‌కుమార్, రోశయ్యలు కూడా ప్రజలపై తీవ్రమైన రాజ్యా నిర్బంధాన్ని ప్రయోగిస్తూ, బాక్సైట్ తవ్వకాలకు తీవ్ర ప్రయత్నాలు చేశారు. మరోవైపు వీరు ప్రజల్లో చీలికలు తెచ్చి పోరాటాన్ని నీరుగార్చడానికి ఎ.పి.ఎఫ్.డి.సి, ఆన్‌రాక్ కంపెనీల ద్వారా, స్థానిక యువతకు గనుల్లో ఉద్యోగాల ఇచ్చే పేరిట వారికి వేల రూపాయల జీతాలు ఇస్తూ, శిక్షణ నిమిత్తం ఇతర ప్రాంతాలకు పంపడం, బాక్సైట్ పునరావాస కమిటీలను ఏర్పాటు చేయడం వగైరా కుటిల పద్ధతులను అనుసరించారు. ప్రజలు ఈ కుటిల పద్ధతులకు మద్దతు పలికిన వారిని గుర్తించి, ప్రజాకోర్టులో పెట్టి, వారి ప్రజా వ్యతిరేక కార్యక్రమాలను బహిర్గతపర్చారు. జి.కె వీధి మండలం మాజీ ఉపాధ్యక్షుడు మత్స్యలింగం బాక్సైట్ మట్టి నమూనాలు సేకరించే బృందంతో కుమ్మక్కై మట్టిని సేకరిస్తూ దొరికిపోతే, ప్రజలు వీడిని

శిక్షించారు. ఈ నేపథ్యంలోనే 2013లో రాష్ట్ర వ్యాపితంగా జరిగిన స్థానిక ఎన్నికలను బాక్సైట్ మైనింగ్ ప్రభావిత ప్రాంతాలైన జర్రెల, వంచుల, మొండగడ్డ, బలపం, తుమ్మెంగుల, కుడిమిసార, గాలికొండ, గుమ్మిరేవుల, ఇంజరి, లోతుగడ్డ పంచాయితీల ప్రజలు సంపూర్ణంగా బహిష్కరించారు.

2014లో, ఆదివాసీల మనోభావాలకు విఘాతం కలిగించే రీతిలో బాక్సైట్ తవ్వకాలు చేపట్టబోమని, ఎన్నికల్లో వాగ్దానం చేసిన చంద్రబాబు, అధికారంలోకి రాగానే మాట మార్చేశాడు. ఆగస్టు 9న ఆదివాసీ దినోత్సవంనాడే చంద్రబాబు టి.డి.పి ప్రభుత్వం బాక్సైట్ తవ్వకాలకు తెరలేపింది. అరకు, జెర్రెల గ్రూపులలో వున్న సుమారు 503 మిలియన్ టన్నుల బాక్సైట్‌ను ఐ.టి.డి.ఎ గిరిజన సొసైటీల ద్వారా తవ్వించి ఆన్‌రాక్, రస్‌ఆల్‌ఖైమా గ్రూపుకు అందించటానికీ, అలాగే ఎ.పి.ఎమ్.డి.సి ద్వారా కూడా తవ్వకాలు జరపించాలనీ పథకం వేసింది. దీనికి కేంద్ర ప్రభుత్వం అన్ని రకాల అనుమతులు జారీ చేసింది. దానికి అనుగుణంగానే 97 జి.ఓ జారీ చేసి, బాక్సైట్ తవ్వకాలకు దారి సుగుమం చేసింది. దీనిపై మన్యం మొత్తం భగ్గుమన్నది. 2014 ఆగస్టులో జెర్రెలలో బాక్సైట్ వ్యతిరేక 'జాక్' ఆధ్వర్యంలో, జరిగిన బహిరంగ సభపై, ఎ.పి గ్రేహౌండ్స్ బలగాలు దాడి చేస్తే, సభకు హాజరైన ప్రజలంతా తిరుగుబాటు చేయటంతో, వారు కాలికి బుద్ధి చెప్పారు. బాక్సైట్ పునరావాస కమిటీలో జెర్రెల మాజీ సర్పంచి వెంకటరమణను నియమించి రహస్యంగా బాక్సైట్‌కు అనుగుణంగా గ్రామ పంచాయితీ తీర్మాణం చేయించడంతో, ప్రజలు వీడి ఇంటిపై దాడి చేసి, వీడికి మరణశిక్ష విధించారు. ఈ విధంగా ప్రజల మిలిటెంట్ పోరాటానికి తలొగ్గిన టి.డి.పి ప్రభుత్వం, బాక్సైట్ తవ్వకాలను తాత్కాలికంగా నిలిపివేస్తూనే, మరోవైపు, తిరిగి ఎప్పుడైనా బాక్సైట్ తవ్వకాలకు అవకాశం కల్పించే 97 జి.ఒను మాత్రం రద్దు చేయలేదు. ఇదే సమయంలో, మన్యంలో బాక్సైట్‌కు వ్యతిరేకంగా జరుగుతున్న ప్రజా ఉద్యమాన్ని అణచివేసేందుకు టి.డి.పి ప్రభుత్వం 100 అవుట్‌పోస్టుల స్థాపనకు కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది. ప్రభుత్వ సాయుధ బలగాల దాడిని తీవ్రతరం చేసింది. ఈ నేపథ్యంలోనే 2016 మేలో, విశాఖ మన్యంలో, గాలికొండ ఏరియా కమిటీ కామ్రేడ్స్ ఆజాద్, ఆనంద్, కమలలనూ, ఆ తర్వాత జన మిలీషియా కమాండర్ కామ్రేడ్ జాంబ్రిని హత్య చేసింది. 2016 అక్టోబర్ 24న రాంగూడ ప్రాంతంపై గ్రేహౌండ్స్ పోలీసులు దాడి చేసి, 31 మంది మా పార్టీ, పి.ఎల్.జి.ఎ కామ్రేడ్స్‌ను హత్య చేశారు. ఇంతటి నిర్బంధంలో సైతం బాక్సైట్ తవ్వకాలకు వ్యతిరేకంగా ప్రజాఉద్యమం కొనసాగుతూనే ఉంది. ఈ పోరాటం కొనసాగింపులో భాగంగానే, పార్టీ ఫిరాయింపుదారుడు, తెలుగుదేశం ఎమ్.ఎల్.ఎ కిడారి సర్వేశ్వరరావు, మాజీ తెలుగుదేశం ఎమ్.ఎల్.ఎ సివేరి సోమలు మైనింగ్ మాఫియాగా అవతారం ఎత్తి, బాక్సైట్ గనులకు మద్దతునిస్తుండటంతో, ప్రజల డిమాండ్ మేరకు మా పార్టీ, పి.ఎల్.జి.ఎలు వారిని ఖతం చేశాయి.

ఈ విధంగా ఇప్పటివరకూ అధికారం చేపట్టిన ప్రభుత్వాలు పదే పదే చేస్తున్న బాక్సైట్ వెలికితీత ప్రయత్నాలను సంఘటిత ప్రజల ప్రతిఘటన అడ్డుకుంటూ వస్తున్నది. అయితే ఈ పోరాటంలో ప్రభుత్వ సాయుధ బలగాల దమనకాండలో ఎంతో మంది ఆదివాసీ ప్రజలు, మావోయిస్టు విప్లవకారులు తమ ప్రాణాలర్పించారు. వాకపల్లి, బల్లుగూడలతోపాటు, మరెన్నో చోట్ల ఆదివాసీ మహిళలు అత్యాచారాలకు గురయ్యారు. సాయుధ బలగాలతో జరిగిన ఘర్షణలో వందల సంఖ్యలో ప్రజలు గాయపడ్డారు. వందలాది మంది ఆదివాసీలు అక్రమ అరెస్టులకు గురయ్యి జైళ్ళపాలయ్యారు. నేడు అధికారం చేపట్టిన వై.ఎస్.ఆర్.సి.పి జగన్ ప్రభుత్వం బాక్సైట్ 97 జి.ఒను రద్దు చేయడం వెనుక మన్యం ప్రజలు కొనసాగించిన ఇంతటి వీరోచిత చరిత్రను, త్యాగాల చరిత్రను మనం మరువకూడదు. ప్రజల ప్రతిఘటనకు తలవంచి జగన్ ప్రభుత్వం 97 జి.ఒను రద్దు చేసినప్పటికీ, దోపిడీ పాలకవర్గాల కుట్రల పట్ల, మోసపు ఎత్తుగడల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

## ప్రియమైన ప్రజలారా!

బాక్సైట్ తవ్వకాలకు వ్యతిరేకంగా ఎన్నో త్యాగాలు చేసి, ఎంతో నెత్తురు ధార పోసి సాధించుకున్న మీ విజయాన్ని, నేడు అధికారంలోకి వచ్చిన జగన్ నీచ, నికృష్ట, దివాళాకోరు రాజకీయాలతో తన ఖాతాలో వేసుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు. ఇక ఆయన ఎంగిలి మెతుకులకు ఆశపడే, పరాన్నభుక్కులైన కొందరు దళారీలైతే ఆయన్ని ఏకంగా దేవుడంటూ ఆకాశానికి ఎత్తుకున్నారు. ప్రస్తుతం ఎ.పి ముఖ్యమంత్రిగా ఉంటూ, ఫ్యూడల్ నియంతగా వ్యవహరిస్తూ, సామ్రాజ్యావాదులకు ఏజెంట్‌గిరి చేస్తున్న జగన్‌నూ, ఆయన వందిమాగధులనూ రాజకీయంగా ఎండగట్టి, మన్యంలో ప్రజారాజ్యాధికారాన్ని నిర్మించేందుకు మీరు మరింత చైతన్యవంతంగా పోరాటాన్ని పదునెక్కించాలి. జగన్ గోముఖ వ్యాఘ్రంలా ఒకవైపున మన్యంలో బాక్సైట్ తవ్వకాలకు దోహదపడే 97 జి.ఒను రద్దు చేస్తున్నానంటూనే, మరోవైపు తన నరహంతక పోలీసు మూకలను మన్యంపై ఇప్పటికే ఉసిగొల్పి వున్నాడు. మన్యంలో క్రూరమైన పోలీసు అధికారులను నియమించాడు. ఇంకోవైపు గ్రామ వాలంటీర్లు, గ్రామ సచివాలయాలు వంటి బూటకపు సంస్కరణలు, పథకాలతో ఆదివాసీ ప్రజలను చీల్చి, ఒక సెక్షన్‌ను తనకు సామాజిక మద్దతుదారులుగా, పోలీసు ఏజెంట్లుగా చేసుకోవడం ద్వారా మన్యంలో విప్లవోద్యమాన్ని సమూలంగా నాశనం చేసేందుకు కంకణం కట్టుకున్నాడు. జగన్ ప్రభుత్వం చేపడుతున్న ఈ ద్విముఖ వ్యూహాన్ని దృష్టిలో ఉంచుకొని, ఆదివాసీ సమాజం యావత్తు అప్రమత్తతతో ఒక్కటై తమ భూమి, నీరు, సహజ వనరులు అంతిమంగా అధికారం కోసం పార్టీ నేతృత్వంలో ఆయుధాలు ఎత్తాలి. వీరి పోరాటానికి సకల పీడిత ప్రజానీకం మద్దతు తెలుపడటమే కాకుండా విప్లవోద్యమంలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

* అడవిపై హక్కు ఆదివాసీలదీ, పీడిత ప్రజలదే!
* మన్యం పితూరిసేనలో సాయుధులవ్వుదాం! మన్యాన్ని కాపాడుకుందాం!
* జగన్ ప్రభుత్వం అమలు చేస్తున్న క్రూర నిర్బంధాన్ని ప్రజా ప్రతిఘటనతో తిప్పికొడదాం!!

**విప్లవాభివందనాలతో,**

**ఆంధ్ర, ఒడిశా బార్డర్ స్పెషల్ జోనల్ కమిటీ**

**సి.పి.ఐ (మావోయిస్టు).**

**తేది : డిసెంబర్ 2019**

## తిరుగులేని ప్రజా విముక్తి గెరిల్లా సైనిక కమాండర్

# కామ్రేడ్ రాకేష్ (సోడి బుద్రు)



సుమారు 35 సంవత్సరాల క్రితం చత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని, సుక్మా జిల్లా, కిష్టారం ఏరియా, గట్ట గ్రామంలో కామ్రేడ్ రాకేష్ మధ్య తరగతి ఆదివాసీ రైతాంగ కుటుంబంలో నాలుగవవాడుగా జన్మించాడు. తల్లిదండ్రులు పెట్టిన పేరు సోడి బుద్ర (రాకేష్). ఈ ప్రాంతంలో అప్పటికే విప్లవోద్యమ నిర్మాణం జరుగుతూ, ప్రజలు పెద్ద ఎత్తున విప్లవ కార్యకలాపాలలో క్రియాశీలకంగా పాల్గొంటున్నారు. అటువంటి వాతావరణంలో కామ్రేడ్ రాకేష్ పుట్టిపెరగడంతో, తనపై చిన్నతనం నుంచే విప్లవోద్యమం బలమైన ప్రభావాన్ని వేసింది. కుటుంబం కూడా విప్లవోద్యమంలో చురుగ్గా పని చేయడంతో, రాకేష్ బాల్యంలోనే విప్లవాచరణకు దగ్గరయ్యాడు. బాలలసంఘంలో చేరి, చురుకైన, తెలివైన క్రమశిక్షణ కలిగిన సభ్యుడిగా ఎదిగాడు. సమాజంలో, ముఖ్యంగా తాను పుట్టిన ఆదివాసీ సమాజంలో ప్రజలపై ఆదివాసేతర భూస్వాముల, కొద్దిమంది ప్రజావ్యతిరేకులైన తెగ పెద్దల దోపిడీ, దౌర్జన్యాలను చూడటమే కాకుండా, ప్రత్యక్షంగా అనుభవించాడు. ప్రజలు ఎదుర్కొంటున్న ఈ జీవన్మరణ సమస్యకు, పార్టీ బోధించే ప్రజాయుద్ధ రాజకీయాలే సరైన పరిష్కారమని దృఢంగా నమ్మాడు. పార్టీ బోధించినట్టుగా పీడిత 'ప్రజలకు రాజ్యాధికారం దక్కకుండా, వారి సమస్యలు పరిష్కారం కావ'నే మౌలిక రాజకీయ సూత్రాన్ని బలంగా విశ్వసించాడు. దీంతో చిన్ననాటి నుంచే మిలటరీ విషయాలలో ఆసక్తిని పెంచుకున్నాడు. ఈ క్రమంలోనే స్థానిక పార్టీ నాయకత్వం, కామ్రేడ్ రాకేష్‌ను గ్రామ మిలీషియా నిర్మాణంలోకి తీసుకున్నది. కామ్రేడ్ రాకేష్ ఆ నిర్మాణంలో చురుగ్గా పని చేస్తూ, సైనిక కర్తవ్యాలు నెరవేర్చడంలో నైపుణ్యం, సమర్థతలను పెంచుకొని, మిలీషియా కమాండర్‌గా ఎదిగాడు. పార్టీ ఆదేశాలకనుగుణంగా ప్రజాశత్రువులను దెబ్బతీస్తూ, ప్రజలకు అండగా వుంటూ, మంచి కమాండర్‌గా ఎదిగాడు. 2001లో ఉద్యమంలోకి పూర్తికాలం కార్యకర్తగా భర్తీ అయ్యి, స్థానిక దళంలోనే ఒక సంవత్సర కాలం పని చేశాడు. 2002లో పార్టీ, ఉద్యమ అవసరాల రీత్యా, కామ్రేడ్ రాకేష్‌ను ఎ.ఒ.బికి పంపింది. ఎ.ఒ.బిలో మొదట మల్కనగిరి జిల్లాలోని, మోటు దళ సభ్యుడిగా పని చేశాడు. ఇక్కడనే చదువు నేర్చుకోవడంతోపాటు, రాజకీయ స్థాయిని కూడా పెంచుకుంటూ, దళ సభ్యుడిగా మిలటరీ కర్తవ్యాలను నెరవేర్చడంలో మంచి ప్రగతిని కనపర్చాడు. అలాగే తన కమాండర్‌తోపాటు, తోటి దళ సభ్యులతో మంచి సంబంధాలను కలిగి ఉంటూ, దళంలో ఆధారపడదగిన కామ్రేడ్‌గా ఎదిగాడు. కామ్రేడ్ రాకేష్‌లో వస్తున్న ఈ అభివృద్ధికరమైన మార్పులను పార్టీ గుర్తించి, 2005లో ఏరియా కమిటీలోకి ప్రమోట్ చేసింది.

### అనేక సైనిక విజయాలను నమోదు చేసిన సాహసవంతుడైన, సమర్థుడైన కమాండర్

కామ్రేడ్ రాకేష్, 2001 నుంచి తాను అమరుడైన 2019 వరకు సుదీర్ఘకాలం పాటు, మిలటరీ రంగంలో వివిధ స్థాయిలలో పని చేశాడు. మల్కనగిరి జిల్లాలోని, కలిమెల-పప్పులూరు

ప్రాంతాన్ని గెరిల్లా బేస్‌గా నిర్మించేందుకు అక్కడ గెరిల్లాయుద్ధాన్ని తీవ్రతరం చేయాలని పార్టీ నిర్ణయించింది. ఈ నిర్ణయానికనుగుణంగా అక్కడ ఒక లోకల్ గెరిల్లా స్క్వాడ్(ఎల్.జి.ఎస్)ను నిర్మించింది. ఈ దళానికి చెందిన పార్టీ కమిటీలో కామ్రేడ్ రాకేష్ కమిటీ సభ్యుడిగా ఎంపికయ్యాడు. క్రమంగా ఈ దళంలో డిప్యూటీ కమాండర్‌గా ఎదిగాడు. ఇక్కడ నుంచి తన విప్లవకర సైనిక జీవితాన్ని మెరుగుపరుచుకుంటూ వచ్చాడు. ఒకవైపున కలిమెల-పప్పులూర్ ప్రాంతంలో గెరిల్లా చర్యలు నిర్వహిస్తూనే, పార్టీ ఆదేశాల మేరకు అవసరమైనప్పుడు జోన్‌లో జరిగిన టి.సి.ఓ.సిలు, ఇతర ప్రతిఘటనా చర్యలలో చురుగ్గా పాల్గొంటూ వచ్చాడు.

మల్కనగిరి ఎమ్.ఎల్.ఎ అరవింద్ డాలి ఇంటివద్ద రక్షణకోసం ఏర్పాటు చేసిన పోలీసు టీంపై మన పి.ఎల్.జి.ఎ యోధులు దాడి చేసి, 5 ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనలో రాకేష్ చురుగ్గా పాల్గొన్నాడు. 2007లో ఎమ్.వి-79 కాలనీకి చెందిన వారపు సంతకి వస్తూ, ప్రజలను ఇబ్బంది పెడుతున్న పోలీసు బ్యాచీపై దాడి చేసి, ఆయుధాలు స్వాధీనం చేసుకోవాలని పార్టీ పిలుపునిచ్చింది. ఈ పిలుపునందుకొని ఆ దాడి నిర్వహించేందుకు ఏర్పాటు చేసిన యాక్షన్ టీంలో రాకేష్ సభ్యుడిగా ఎంపికయ్యాడు. ఈ దాడిలో, యాక్షన్ టీం ఒక పోలీసును ఖతం చేసి, ఎ.కె-47 ఆయుధాన్ని స్వాధీనపర్చుకున్నది. ఈ చర్యలో రాకేష్ చురుగ్గా పాల్గొన్నాడు. ఈ చర్య తదుపరి రిట్రీట్ అవుతున్న మన యాక్షన్ టీంను పోలీసులు బైక్‌లతో వెంబడించి దాడి చేసారు. ఈ సందర్భంగా యాక్షన్ టీం సభ్యులు కామ్రేడ్ రవి, కామ్రేడ్ రత్నలు అమరులైనారు. కామ్రేడ్ రాకేష్ పోలీసులను ప్రతిఘటిస్తున్న క్రమంలోనే, కాలికి తీవ్రమైన గాయమైంది. అయినప్పటికీ, ప్రజల సహకారంతో అక్కడ నుంచి తప్పుకొని పార్టీని కలిసాడు. అయితే రాకేష్‌కు తగిలిన తూటా, కాలి పాదాన్ని చీల్చుకొని వెళ్ళడంతో మధ్య ఎముక పూర్తిగా విరిగిపోయింది. ఇటువంటి సమయంలో కూడా ఏ మాత్రం నిరాశ చెందకుండా, పార్టీ ఇచ్చిన మార్గదర్శకత్వాన్ని అందుకొని వైద్యం చేయించుకున్నాడు. తను పూర్తిగా కోలుకోవడానికి ఒక సంవత్సర కాలం పట్టింది. ఈ సమయంలో తను సైనిక రంగంలో పని చేయగలడని ఎవరూ ఊహించలేదు. కానీ రాకేష్ దృఢమైన పట్టుదలతో, బోల్షివిక్ స్పిరిట్‌తో సైనికరంగంలోనే కొనసాగుతానని నిర్ణయించుకున్నాడు. తన నిర్ణయానికనుగుణంగానే, చివరి శ్వాస వరకు ఎన్నోసార్లు కాలు సమస్యతోపాటు, ఇతర అనారోగ్య సమస్యలు ఎదురైనప్పటికీ, పట్టుదలగా వాటిని అధిగమిస్తూ, విప్లవకర సైనిక జీవితాన్ని కొనసాగించాడు.

2006 సంవత్సరంలో ఆయుధాల స్వాధీనం కోసం రాయగడ జిల్లాలోని, ఉదయగిరి పోలీస్‌స్టేషన్‌పై దాడి చేసి, 24 ఆయుధాలను స్వాధీనం చేసుకున్న రెయిడ్‌లో, అసాల్ట్ టీం సభ్యుడిగా కీలక పాత్ర వహించాడు. 2008లో కలిమెల ప్రాంతంపై నిర్బంధం తీవ్రతరమవుతుండటంతో తెల్లరాయి గ్రామం వద్ద మన పి.ఎల్.జి.ఎ కామ్రేడ్స్ ఒక మైన్‌ప్రూఫ్ వాహనాన్ని పేల్చివేసారు. ఈ దాడిలో స్పెషల్ ఆపరేషన్ గ్రూప్ (ఎస్.ఓ.జి)కమాండోలు 17 మంది చనిపోగా, మన చేతికి 6 ఎ.కె-47 ఆయుధాలు దొరికాయి. ఈ సంఘటనలో రాకేష్ అనారోగ్యంతో ఉండి కూడా పాల్గొన్నాడు.

2009లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా 'ఆపరేషన్ గ్రీన్‌హంట్' పేరుతో పార్టీని సమూలంగా నిర్మూలించాలనే దుష్టతలంపుతో ప్రారంభించిన బహుముఖ హంతకదాడిని ప్రతిఘటించి, ఓడించాలని పార్టీ ఇచ్చిన పిలుపుకు స్పందనగా 2009లో మల్కనగిరి జిల్లా, పోత్‌కల్ గ్రామం వద్ద మన పి.ఎల్.జి.ఎ కామ్రేడ్స్ కేంద్ర అర్ధ సైనిక బలగాల వాహన కాన్వాయ్‌పై మందుపాతరతో దాడి చేసారు. ఈ దాడిలో ముగ్గురు పోలీసులు చనిపోగా, కొందరు గాయపడ్డారు. ఈ సందర్భంగా ఇతర వాహనాలలోని పోలీసులు కాల్పులకు దిగినప్పటికీ, మన కామ్రేడ్స్ సాహసంగా ముందుకు దూసుకుపోయి, రెండు ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడికి రాకేష్ డిప్యూటీ కమాండర్‌గా నేతృత్వం వహించాడు.

2010లో మల్కనగిరి జిల్లా కమిటీ, రాకేష్ నేతృత్వంలో ప్రత్యేక యాక్షన్ టీం (ఎస్.ఎ.టి)ను నిర్మించింది. ఈ టీం ఏర్పడిన అనతికాలంలోనే మల్కనగిరి-కొరాపుట్ సరిహద్దు గ్రామం మంత్రియాంబ వద్ద స్టేట్ హైవేపై మందుపాతర పేల్చి, 11 మంది ఎస్.ఓ.జి కమాండోలను నిర్మూలించింది. ఈ దాడిలో 17 మంది పోలీసులు గాయపడ్డారు. ఇదే కాలంలో ఎస్.జడ్.సి నిర్ణయం మేరకు విశాఖ జిల్లా, పాడేరులో క్రూరుడైన ఎ.పి, ఎస్.ఐ.బి హెడ్‌కానిస్టేబుల్ అప్పన్నను రాకేష్ టీం పట్టపగలే నడిరోడ్డుపై ఖతం చేసింది. 2012లో జన్నుగూడ వద్ద ఆంబుష్ నిర్వహించి, ఒక బి.ఎస్.ఎఫ్ వాహనాన్ని పేల్చగా, బెటాలియన్ కమాండర్‌తోపాటు, నలుగురు బి.ఎస్.ఎఫ్ పోలీసులు హతమయ్యారు. ఈ దాడిలో మన కామ్రేడ్స్ మూడు ఆయుధాలను స్వాధీనపర్చుకున్నారు. ఈ దాడికి రాకేష్ అసాల్ట్ డిప్యూటీగా వ్యవహరించాడు. 2009 నుంచి 2012 వరకు మనం సాధించిన వరుస సైనిక విజయాలు శత్రువు చొరవను దెబ్బతీసాయి. ఒక రకంగా శత్రువు ప్రారంభించిన 'ఆపరేషన్ గ్రీన్‌హంట్' సైనికదాడికి చెక్ పెట్టినట్లైంది. ఈ దాడులన్నింటిలోనూ రాకేష్‌ది కీలకమైన పాత్ర ఉన్నది. కొన్నింటిలో నేరుగా నాయకత్వ పాత్రను కూడా పోషించాడు.

ఈ కాలంలో ఆయనలో పెరుగుతున్న నాయకత్వ లక్షణాలను పై కమిటీ గుర్తించి, మల్కనగిరి డివిజన్ కమిటీలోకి ప్రమోట్ చేసింది. అంతేకాకుండా, డివిజన్‌లో ఒక లోకల్ గెరిల్లా స్క్వాడ్(ఎల్.జి.ఎస్) సైనిక నిర్మాణాన్ని ఏర్పరిచి, దానికి రాకేష్‌ను కమాండర్‌గా నియమించింది. 2012 నుంచి 2013 వరకు డివిజన్‌లో సైనిక కర్తవ్యాలను విజయవంతంగా నిర్వహించాడు.

2014లో ఎస్.జడ్.సి, గెరిల్లా బేస్ నిర్మాణలక్ష్యంతో ఎమ్.కె.వి.బి (మల్కనగిరి–కొరాపుట్–విశాఖ బోర్డర్) డివిజన్‌ను నిర్మించింది. నూతనంగా ఏర్పడిన ఈ డివిజన్‌లో సైనిక కర్తవ్యాలను నిర్వహించేందుకు తగిన వ్యక్తిగా రాకేష్‌ను పై కమిటీ గుర్తించి, ఆయనను ఎల్.జి.ఎస్ కమాండర్‌గానూ, డివిజన్ కమాండ్ ఇన్ చీఫ్‌గాను ఎమ్.కె.వి.బికి బదిలీ చేసింది. పై కమిటీ అంచనాలకనుగుణంగానే రాకేష్ ఎమ్.కె.వి.బి డివిజన్ కమిటీ సభ్యుడిగా ఉంటూ, తనకిచ్చిన సైనిక బాధ్యతలను సమర్థవంతంగా, విజయవంతంగా నిర్వహిస్తూ వచ్చాడు. ఎమ్.కె.వి.బి డివిజన్‌ను గెరిల్లా బేస్‌గా నిర్మించే లక్ష్యంతో, స్థానిక ప్రజా శతృవులను నియంత్రించడం, శిక్షించడం, దండాబడి, దూలిపూట్ ఆంబుష్‌ల వంటి చిన్నరకం గెరిల్లా చర్యలతోపాటు, చికాకు చర్యలను కూడా నిర్వహించాడు.

2016లో జోన్‌లో జరిగిన కొన్ని నిర్మాణ మార్పుల నేపథ్యంలో, ఎస్.జడ్.సి రాకేష్‌ను సి.ఆర్.సి 1వ పి.ఎల్‌కు పార్టీ కమిటీ సెక్రటరీగానూ, కమాండర్‌గాను నియమించింది. అంతేకాకుండా, ఎమ్.కె.వి.బి డివిజన్ కమిటీ సెక్రటేరియట్ సభ్యుడిగా కూడా పదవోన్నతిని కల్పించింది. ఈ ప్రమోషన్‌లు రాకేష్‌లో అహంభావాన్ని ఏ మాత్రం పెంచలేదు. ఆయన ఒత్తిడిగా కూడా ఫీల్ కాలేదు. మారుతున్న పరిస్థితులకనుగుణంగా ఉద్యమ అవసరాలను తీర్చేందుకు పార్టీ తనపై పెట్టిన బాధ్యతను నిర్వహించేలా ఓపికగా కష్టపడి కృషి చేయడం ప్రారంభించాడు. ఈ బాధ్యతలు చేపట్టిన అతికొద్ది కాలంలోనే అక్టోబర్ 24, 2016న రాంగూడ వద్ద శతృవు మన పి.ఎల్.జి.ఎ బలగాలపై అతిపెద్ద దాడిని చేశాడు. ఈ దాడిలో 31 మంది కామ్రేడ్స్ అమరులైనారు. పి.ఎల్‌కు చెందిన డిప్యూటీ కమాండర్‌తోపాటు, ఆరుగురు సాహసవంతులైన, అతి విలువైన కామ్రేడ్స్ అమరులైనారు. ఈ సందర్భంగా రాకేష్ అత్యంత నిబ్బరంగా శతృవును ధీటుగా ఎదుర్కొంటూ, శతృవు ఏర్పర్చిన చక్రబంధం నుంచి తాను బయటపడటమే కాకుండా, కొంత మంది నాయకత్వ కామ్రేడ్స్‌తోపాటు, ఇతర కామ్రేడ్స్ బయటపడేందుకు కీలకమైన పాత్ర పోషించాడు.

రాంగూడ దాడితో జరిగిన నష్టాల మధ్యనే పార్టీ శ్రేణుల, ప్రజల ఆత్మస్థైర్యాన్ని తిరిగి పెంపొందించేలా రాంగూడ దాడికి కారకులైన ఇన్‌ఫార్మర్లను మట్టుపెట్టడంలోనూ, పార్టీ, పి.ఎల్.జి.ఎ శ్రేణులలో, ప్రజలలో రాజకీయ కృషిని కొనసాగించడంలోనూ, మొత్తం పార్టీ నాయకత్వంతోపాటు, తాను కూడా అవిరళ కృషిని కొనసాగించాడు. ఈ దాడి తర్వాత, ప్రజలకు రాజకీయాధికారం దక్కాలంటే సైనిక కర్తవ్యాల నిర్వహణలో మరింత మెరుగుదల తీసుకురావాలనే విషయాన్ని గుర్తించాడు. గుర్తించడమే కాకుండా, గెరిల్లా యుద్ధ నియమాలను పాటించడంలో తనతోపాటు మిగిలిన కామ్రేడ్స్‌ను శ్రద్ధ పెట్టేలా కృషి చేసాడు.

ఈ క్రమంలోనే పార్టీ నిర్ణయం మేరకు విశాఖ మన్యంలో గనిమాఫియాగా ఉన్న అధికార టి.డి.పి అరకు ఎమ్.ఎల్.ఎ కిడారి సర్వేశ్వరరావు, మాజీ ఎమ్.ఎల్.ఎ సీవేరి సోమలను 2018లో లివిటిపుట్‌వద్ద మాటువేసి, పట్టుకొని ఖతం చేసిన ఘటనలో రాకేష్ అసాల్ట్ టీం కమాండర్‌గా నాయకత్వం వహించాడు. ఈ దాడి ఎ.పి ఎస్.ఐ.బి, గ్రేహౌండ్స్ బలగాలలో కలవరం సృష్టిస్తే, ప్రజలకు గొప్ప సంతోషాన్ని కల్పించింది. టి.డి.పి నాయకులు తీవ్రంగా ఆందోళనకు గురై, బాక్సైట్ తవ్వకాలను నిలిపివేస్తున్నట్లుగా చంద్రబాబు చేత మరోమారు ప్రకటన ఇప్పించారు. అయితే ఆయన విప్లవ జీవితంలో అనేక వరుస సైనిక విజయాలున్నప్పటికీ, పొడియా ఏరియా శీలకోట గ్రామ సమీపంలో ఒక ఇన్‌ఫార్మర్ ఇచ్చిన సమాచారంతో శతృవు చుట్టుముట్టి, పి.ఎల్.జి.ఎ బలగాలపై చేసిన దాడిలో 13 మంది మిలీషియా కామ్రేడ్స్ అమరులయ్యారు. ఈ దాడి సందర్భంగా బాధ్యుడిగా ఉన్న రాకేష్ వీరోచితంగా శతృవును ప్రతిఘటిస్తూ, కొద్ది మంది కామ్రేడ్స్‌తో బయటపడినప్పటికీ, మిలీషియా కామ్రేడ్స్ అమరులు కావడం ఆయనను తీవ్రంగా కలత చెందించింది. ఈ విషాదాన్ని ఆయన జీవితకాలమంతా మరిచిపోలేకపోయాడు. అయితే యుద్ధంలో ఇటువంటి సంఘటనలు సహజంగానే ఉంటాయనీ, వాటిని గుణపాఠంగా తీసుకొని మరోసారి అటువంటి తీవ్రమైన నష్టాలు జరగకుండా చూసుకోవాలనే సమీక్షాపూర్వక అంశాన్ని, ఒక మార్గదర్శక సూత్రంగా తన గెరిల్లా జీవితానికి ఎంచుకున్నాడు.

మొత్తంగా కామ్రేడ్ రాకేష్ విప్లవ జీవితాన్ని పరిశీలించినప్పుడు ఆయన ఒక సమర్థుడైన, తన క్యాడర్ల విశ్వాసాన్ని చూరగొన్న, విజయవంతమైన కమాండర్‌గా మనకు కనిపిస్తాడు. అయితే ఆయన సైనిక సామర్థ్యాన్ని విడిగా చూడకూడదు. ఆయనకు శాస్త్రీయమైన, ఉన్నతమైన ఎమ్.ఎల్.ఎమ్ సిద్ధాంతంపై అపారమైన విశ్వాసం ఉండటమే కాకుండా, దాని వెలుగులో తన జీవితాన్ని కొనసాగించాడు. అలాగే పీడిత ప్రజలకు రాజ్యాధికారం దక్కాలనే

**తరువాయి భాగం 29వ పేజీలో...**

## ప్రజాయుద్ధంలో అంచలంచలుగా ఎదుగుతూ, బహుముఖ ప్రజ్ఞాశాలిగా మారిన

# వర్గపోరాట యోధుడు కామ్రేడ్ మడ్కం రమేష్



కామ్రేడ్ మడ్కం రమేష్, బీజాపూర్ జిల్లా, ఊసూరు బ్లాక్, పామేడ్ ఏరియాలోని గుండం గ్రామంలో 29 సంవత్సరాల క్రితం జన్మించాడు. ఆయన తల్లిదండ్రులు పేద రైతాంగం కావడంతో, రమేష్‌కు చిన్నతనం నుంచీ కూలి పనులకు వెళ్ళక తప్పలేదు. ఆయన పుట్టిన ప్రాంతంలో, విద్యా, వైద్యం వంటి కనీస సౌకర్యాలు లేకపోవడంతో, రమేష్‌కు చదువుకొనే అవకాశం దొరకలేదు. ఆ ప్రాంతంలోని ఆదివాసీ పిల్లలందరి లాగానే పౌష్టికాహారం లేకపోవడంతోపాటు, అనారోగ్య సమస్యతో బలహీనంగానే యవ్వనంలోకి అడుగుపెట్టాడు. రమేష్ యవ్వనంలోకి అడుగు పెట్టగానే, కుటుంబ బాధ్యతలు మీద పడ్డాయి. దీంతో ఆంధ్ర ప్రాంతంలోని ఒక మోతుబరి రైతు వద్ద జీతగాడిగా కుదిరాడు.

రమేష్ పుట్టక ముందు నుంచే ఆ ప్రాంతంలో సాయుధ వర్గపోరాటం అలలు అలలుగా పురోగమిస్తూ వచ్చింది. 2006లో ప్రజలపై ఎక్కుపెట్టబడిన ప్రభుత్వ ప్రయోజిత 'సల్వాజుడుం'ని విప్లవోద్యమం చావు దెబ్బతీసింది. ఈ క్రమంలో స్థానిక తెగపెత్తందార్లకూ, రాజ్యానికి వ్యతిరేకంగా, పార్టీ నాయకత్వంలో ఆదివాసీ రైతాంగం తిరుగుబాటు చేయడమే కాకుండా, భూములు స్వాధీనం చేసుకొని, 'దున్నేవారికే భూమి' ప్రాతిపదికన భూములు పంచుకున్నారు. తెగపెత్తందార్ల చేతుల్లో ఉన్న ఆధిపత్యాన్ని దెబ్బతీసి, అధికారాన్ని తమ చేతుల్లోకి తీసుకొని, జనతన సర్కార్లను నిర్మించారు. ఈ విప్లవ క్రమమంతా పీడిత వర్గ పునాది కల్గిన రమేష్‌ను సహజంగానే ఆకర్షించింది.

2006 నాటికి విప్లవ ప్రతీఘాతుక సల్వాజుడుంపై విప్లవోద్యమం పై చేయి సాధించడంతో, వందలాది మంది యువత ప్రజా విముక్తి గెరిల్లా సైన్యంలోకి భర్తీ అయ్యారు. ఈ కాలంలోనే రమేష్ కూడా విప్లవ కార్యాకలాపాల్లో చురుగ్గా పాల్గొనడం ప్రారంభించాడు. 2008 నుంచి జన మిలీషియా సభ్యుడిగా, పూర్తికాలం పని చేయడం ప్రారంభించాడు.

కామ్రేడ్ రమేష్‌లో పెరుగుతున్న రాజకీయ చైతన్యం, విప్లవ సమర్థతలను దృష్టిలో ఉంచుకొని, 2009 జనవరిలో ఒక సి.సి.ఎమ్‌కు కేటాయించిన ఐదుగురు గార్డ్స్ టీంలో రమేష్‌ను కూడా ఎంపిక చేశారు. పార్టీ నాయకత్వం అంచనా కట్టినట్లుగానే, రమేష్ ప్రొటెక్షన్ (గర్డ్స్) టీంలో చురుకుగానూ, బాధ్యతాయుతంగాను పని చేయడం ప్రారంభించాడు. 2011 నాటికి ఉద్యమ అవసరాల రీత్యా ప్రొటెక్షన్ స్క్వాడ్ కమాండర్‌ను బదిలీ చేసి, నూతన కమాండర్‌ను నియమించారు. కానీ నూతనంగా కేటాయించబడిన కమాండర్ బాధ్యాతారాహిత్యంగా ఉండటంతో మరో కమాండర్‌ను కేటాయించారు. ఈ కమాండర్ బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఉద్యమాన్ని వదిలి పారిపోవడంతో, ప్రొటెక్షన్ స్క్వాడ్‌కు కమాండర్ లేకుండా అయ్యింది. ఇటువంటి క్లిష్ట పరిస్థితులలో ఉన్న వారిలోనే సాపేక్షంగా చైతన్యవంతమైన, సమర్థవంతమైన కామ్రేడ్‌ను కమాండర్‌గా నియమించాలని పై కమిటీ నిర్ణయించి, ఉన్నవారిలో రమేష్‌ను ప్రొటెక్షన్ స్క్వాడ్‌కు కమాండర్‌గా నియమించింది.

2011 మధ్య నుంచి 2014 మధ్య వరకు 3 సంవత్సరాలపాటు, రమేష్ ప్రొటెక్షన్ స్క్వాడ్ కమాండర్‌గా తన విధులను బాధ్యాతాయుతంగా నిర్వహించాడు. ముఖ్యంగా నాయకత్వ రక్షణ బాధ్యతను చేపట్టడంలో అత్యంత అప్రమత్తతతో వ్యవహరించాడు. 2014 మధ్యకు రమేష్‌ను ప్రొటెక్షన్ స్క్వాడ్ నుండి రిలీవ్ చేసి, సి.ఆర్.సి 3వ కంపెనీకి సెక్షన్ కమాండర్‌గా పంపారు.

రమేష్ 3వ కంపెనీలో కూడా పార్టీ నిర్దేశించిన రాజకీయ, సైనిక కర్తవ్యాలనూ, విధులను నిర్వహించడంలో బాధ్యతగా ఉంటూ, కంపెనీ కమాండర్‌కు చేదోడు వాదోడుగా ఉంటూ వచ్చాడు. 2014లో ప్రజావ్యతిరేకి, కాంగ్రెస్ నాయకుడు జీవన్ పట్నాయక్‌ను ఖతం చేసిన టీంకు కమాండర్‌గా వ్యవహరించాడు. 2015లో మన కామ్రేడ్స్ డుంబ్రి, నరేందర్‌ల హత్యకు కారకులైన విప్లవద్రోహులు పేటాల్ తవుడు, వల్లాదబాయి సిమావ్‌లను మట్టుబెట్టిన చర్యలో పాల్గొన్నాడు. 2017లో జరిగిన సుంకి

**తరువాయి భాగం 31వ పేజీలో...**

# విప్లవం కోసమే సర్వస్వం అంటూ తనను తాను విప్లవ నాయకురాలిగా మలుచుకున్న

# కామ్రేడ్ స్వేత (రతాయి)



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, విశాఖపట్నం జిల్లా, చింతపల్లి మండలంలోని మారుమూల గ్రామమైన చింతగుప్పలో నిరుపేద ఆదివాసీ కుటుంబంలో సుమారు 25 సంవత్సరాల క్రితం కామ్రేడ్ స్వేత జన్మించింది. ఆమెకు తల్లిదండ్రులు పెట్టిన పేరు రతాయి. అప్పటికే ఆ ప్రాంతంలో విప్లవోద్యమ నిర్మాణం ప్రారంభమయ్యింది. ఆ నాటికి ఆ ప్రాంతంలో అటవీ అధికారుల దోపిడీ, దౌర్జన్యాలకు తోడు, కిల్లంకోట గ్రామంలోని కరుడగట్టిన గిరిజనేతర (రాజులు) భూస్వాముల దోపిడీ, పీడనలు చెప్పనలవి కాకుండా ఉండేవి. వీరు చుట్టుపక్కల ఆదివాసీ గ్రామాలలో మద్యం విక్రయించడం, వడ్డీ వ్యాపారం చేసూ్త, ప్రజల భూములను దురాక్రమించడం, ఆదివాసీలచే వెట్టిచాకిరి చేయించుకోవడం, మహిళలపై లైంగిక అత్యాచారాలకు పాల్పడటం, ప్రశ్నించిన వారినీ, ఎదురు మాట్లాడిన వారిని గడిలలో బంధించి హింసించడం వగైరా దుర్మార్గాలకు పాల్పడేవారు. జల్, జంగల్, జమీన్‌పై అధికారం, ఆత్మగౌరవం కోసం పోరాడుదామని పార్టీ ఇచ్చిన పిలుపునందుకొని ఆదివాసీలు, పీడిత ప్రజలు విప్లవోద్యమంలోకి సమీకరించబడి సంఘటితమయ్యారు. పార్టీ నాయకత్వంలో పోరాడి, భూములు స్వాధీనం చేసుకొని, భూస్వాముల రాజకీయ ఆధిపత్యాన్ని ధ్వంసం చేసారు. ఈ క్రమంలోనే విప్లవ ప్రజా సంఘాలు ఏర్పడి, ప్రజలలో ప్రజాస్వామిక చైతన్యాన్ని పెంచాయి. ఇలాంటి రాజకీయ వాతావరణంలో పుట్టి పెరిగిన రతాయిపై సహజంగానే విప్లవోద్యమ ప్రభావం బాల్యంలోనే బలమైన చెరగని ముద్ర వేసింది. రతాయికి యుక్త వయస్సు వస్తున్న క్రమంలో ఆమె గ్రామంలో జరిగే విప్లవ కార్యకలాపాలలో భాగస్వామి అవుతూ వచ్చింది. విప్లవ మహిళా సంఘంలో సభ్యురాలుగా పని చేసూ్త, 2009 ప్రారంభంలో పూర్తికాలం విప్లవ కార్యకర్తగా పని చేయాలని నిర్ణయించుకొని తన అభిప్రాయాన్ని పార్టీ ముందుంచింది. మొదట స్థానిక దళంలోనే కొంతకాలం పని చేసింది.

తర్వాత కాలంలో పార్టీ, కామ్రేడ్ స్వేతను ఎ.ఒ.బి జోన్‌కు మిలటరీ గూడ్స్ (పాదార్థిక)ను సరఫరా చేసే సప్లై దళంలోకి సభ్యురాలిగా బదిలీ చేసింది. ఈ క్రమంలో సప్లై దళం సి.ఆర్.సి నేతృత్వంలోకి వెళ్ళినప్పటికీ, స్వేత అదే దళంలో కొనసాగింది. పేద కుటుంబంలో పుట్టిన, నిరక్షరాస్యురాలైన కామ్రేడ్ స్వేత పార్టీలో చేరిన తర్వాత మొదట తెలుగు చదువు నేర్చుకుంది. ఆ తర్వాత ఉద్యమ అవసరాల నిమిత్తం హింది, ఒడియా, ఇంగ్లీషులను అతి తక్కువ కాలంలోనే నేర్చుకొని చదవడం, రాయడం చేసింది. కువ్వి, ఒడియా, కోయ, తెలుగు భాషలను నేర్చుకుని తాను ఏ ప్రాంతానికి వెలితే ఆ ప్రాంత ప్రజలతో అక్కడి భాషను మాట్లాడుతూ, వారితో మమేకం అవుతూ, రాజకీయాలను భోదిసూ్త, ఉద్యమ కర్తవ్యాలను నెరవేర్చింది. దళంలో సమర్థవంతమైన టీచర్‌గా సభ్యులకు హిందీ, ఒడియా, తెలుగు భాషలను బోధించింది. తాను నేర్చుకున్న ఇంగ్లీషు చదువు డాక్టర్‌గా పని చేయడానికి ఎంతగానో ఉపయోగపడింది. ఏ పని చేసినా పట్టుదలగా చేసూ్త, అందుకు అవసరమైన సమర్థతలను సంపాదించి అందులో విజయం సాధించడం కామ్రేడ్ స్వేతలో కనబడే ప్రత్యేక లక్షణం. కామ్రేడ్ స్వేత నిరంతర అధ్యయనశీలి. అధ్యయనం ద్వారా తన సిద్ధాంత, రాజకీయ స్థాయిని పెంపొందించుకుంటూ ఉండేది. తాను నేర్చుకున్న విషయాలను ఉద్యమ అవసరాల కోసం వినియోగించేందుకు శ్రద్ధ పెట్టేది.

కామ్రేడ్ స్వేత రాజకీయ స్థాయి, సమర్థతలు, చైతన్యం, క్రమశిక్షణను గుర్తించి పార్టీ 2015లో తనను ఎ.సి.ఎమ్ స్థాయికి ప్రమోట్ చేసూ్త, నిర్ణయం తీసుకుంది. 2016లో అదే దళానికి డిప్యూటి కమాండర్‌గా బాధ్యతలు స్వీకరించింది. పార్టీ అప్పగించిన ఏ బాధ్యతనైన స్వీకరించి అందుకు న్యాయం చేసి, క్యాడర్‌ల ఆదరాభిమానాలను చూరగొంటూ, మంచి నాయకురాలిగా గుర్తింపు పొందింది. 2016లో అదే దళంలో పని చేస్తున్న కామ్రేడ్ సోమ్మును పార్టీ పద్ధతులలో వివాహం చేసుకుంది. వ్యక్తిగత సహచర జీవితాన్ని విప్లవ, సమిష్టి ప్రయోజనాలకు లోబడి కొనసాగించింది. పితృస్వామ్య భావజాలం ఎవరిలో ఏ రూపంలో వ్యక్తమయినా సూత్రబద్ధంగా పోరాడేది. ప్రతి విషయంలోను విమర్శనాత్మక పరిశీలన, విశ్లేషణ,

సంశ్లేషణ పద్ధతిని పని శైలిని అభివృద్ధి చేసుకున్నది. స్పష్టమైన వర్గదృక్పథం కల్గి ఉండేది.

2009 నుండి తాను అమరురాలైన 2019 వరకు సుమారు ఒక దశాబ్దకాలం పాటు పార్టీ ఇచ్చిన కేంద్ర కర్తవ్యాన్ని అమలు చేయడంలో దండకారణ్య విప్లవోద్యమ యుద్ధ అవసరాలను తీర్చడంలో భాగంగా అనేక కష్ట, నష్టాల మధ్య పట్టుదలగా, నేర్పుగా పాదార్థిక సరఫరాలను అందించడంలో తనవంతు పాత్రను పోషించింది. అంతే కాకుండా పార్టీ అప్పగించిన ప్రజాపని, ప్రతిఘటన వగైరా ఇతర కర్తవ్యాలలో కూడా చురుకుగా పాల్గొంటూ, తన వంతు బాధ్యతను విజయవంతంగా నిర్వహించేది. ఆమె సి.ఆర్.సి సప్లై దళంలో పని చేసినప్పటికీ, ఆమె కార్యక్షేత్రం మాత్రం ప్రధానంగా ఎ.ఒ.బిలోనే కొనసాగింది. ఎ.ఒ.బి ఉద్యమంలో ఆమె పాత్ర విడదీయరానిదే. ఈ ఉద్యమ ఆటుపోటుల నడుమ ఎప్పటికప్పుడు ఉద్యమ డిమాండ్‌కు అనుగుణంగా తనను తాను తీర్చి మలుచుకుంటూ పని చేసి మంచి అనుభవాన్ని సంపాదించింది.

2019 జులైలో చత్తీష్‌గఢ్-ఒడిశా సరిహద్దు ప్రాంతానికి దళంతోపాటు వెళ్ళింది. నూతన ప్రాంతం కావడంతో అక్కడ ప్రజల, శత్రువు పరిస్థితులపై, భౌగోళిక పరిస్థితిపైన మనకు తగినంత పట్టులేదు. దళం ఆ ప్రాంతానికి వెళ్ళిన వెంటనే పక్క సమాచారం అందుకున్న చత్తీష్‌గఢ్ ప్రత్యేక బలగాలు ఆ ప్రాంతాన్ని అనేక వలయాలుగా చుట్టుముట్టి, జులై 27న తిరియా గ్రామ అడవి ప్రాంతంలో దళమకాంపై ఉదయం 10 గం॥లకు దాడి చేశాయి. ఈ దాడిని ప్రతిఘటించి ఎలాంటి నష్టాలు లేకుండా తిప్పికొట్టారు. రిట్రీట్‌లో ఒక అననుకూల ప్రదేశంలో మరోమారు చుట్టివేతకు గురైనప్పుడు వీరోచితంగా ప్రతిఘటిస్తూ, నాయకత్వాన్ని రక్షించి, విలువైన ఆరుగురు కామ్రేడ్స్ తమ నులివెచ్చని రక్తాన్ని ధారబోసారు. అందులో కామ్రేడ్ స్వేతతో పాటు, తన సహచరుడు కామ్రేడ్ సోమ్లు కూడా అమరుడయ్యాడు. ఈ సంఘటనలో అమరులైన వారి వివరాలు, సమాచారం చాలా ఆలస్యంగా కుటుంబాలకు చేరాయి. కామ్రేడ్ స్వేత గ్రామానికి చెందిన ప్రజలు చత్తీష్‌గఢ్‌లోని జగ్దల్‌పూర్‌కు వెళ్ళి ఆమె శవాన్ని స్వగ్రామానికి తీసుకువచ్చి, వందలాది మంది ప్రజలు విప్లవ సాంప్రదాయాలతో అంతిమయాత్ర నిర్వహించారు. ఆమె జ్ఞాపకార్థం గ్రామంలో స్థూపం నిర్మించి, సంస్మరణ సభ జరుపుకున్నారు. "నీ త్యాగం మహోన్నతమైంది. నీ ఆశయాన్ని సాధించడమే మా ముందున్న కర్తవ్యం. అందుకు తుదకంటా పోరాడుతాం. నీ వారసులను తయారు చేస్తాం" అంటూ ప్రజలు ప్రతినబూనారు.

---

**26వ పేజీ తరువాయి భాగం...**

మౌలిక, రాజకీయ కర్తవ్యానికి దృఢంగా అంటిపెట్టుకొని, ఆ కర్తవ్య సాధనకోసం మాత్రమే అనివార్యంగా నిర్వహించవలసిన సైనిక కర్తవ్యాలకు ప్రాధాన్యతనిస్తూ ఆచరించాడు. కనుక రాకేష్ విప్లవ జీవితం నుంచి సైనిక విషయాలలోనే కాకుండా, సిద్ధాంత, రాజకీయ, నైతిక విషయాలలో కూడా స్ఫూర్తిని పొందాలి.

కామ్రేడ్ రాకేష్ విప్లవం ఎడల అంకితమైన కామ్రేడ్. వ్యక్తిగత విషయాలకు రెండో ప్రాధాన్యతనిచ్చాడు. తన సహచరి విప్లవ చైతన్యాన్ని పెంచుకోకుండా, వ్యక్తిగతతే జీవితానికే ప్రాధాన్యతనిచ్చినప్పుడు, ఆమెతో పార్టీ నిర్ణయం మేరకు విడాకులు తీసుకున్నాడు. జీవితాంతం కాలునొప్పితోపాటు, కంటి సమస్య కూడా వేధించినప్పటికీ, ఎప్పుడూ నిస్పృహకు లోనుకాకుండా, ఆశావహ దృక్పథంతో విప్లవ జీవితాన్ని కొనసాగించాడు. కార్మికవర్గ క్రమశిక్షణను తన జీవినశైలిగా మార్చుకున్నాడు. ఉద్యమానికవసరమైన ప్రతి విషయాన్ని శ్రద్ధ పెట్టి నేర్చుకున్నాడు. ముఖ్యంగా ఎ.ఒ.బిలోని ప్రజలతో మమేకమయ్యేందుకు తెలుగు, ఒడియా భాషలతోపాటు, హిందీని కూడా నేర్చుకున్నాడు. ఒక్కమాటలో చెప్పాలంటే రాజకీయ చైతన్యం, విప్లవ సమర్థతల మేలుకలయికగా ఎదిగిన కామ్రేడ్. ఇలా ఎదుగుతున్న సమయంలోనే ఆగస్టు 28, 2019న పార్టీ ఇచ్చిన పనిపై వెళ్ళి, ఆ క్రమంలో డాబగూడ అనే గ్రామానికి 27 రాత్రికి రాకేష్‌తోపాటు, మిగిలిన కామ్రేడ్స్ చేరారు. అదే రాత్రి ఆ గ్రామానికి చెందిన హోంగార్డ్ ఒకడు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో, 28 తెల్లవారుఝామున పోలీసులు గ్రామం నుంచి బయటకు వస్తున్న మన కామ్రేడ్స్‌ను చుట్టుముట్టి, విచ్చలవిడిగా కాల్పులు జరిపారు. ఈ సందర్భంగా రాకేష్ అరగంటపాటు శత్రువును నిలువరించాడు. ఈ సమయంలో మిగిలిన కామ్రేడ్స్ క్షేమంగా తప్పుకున్నారు. అప్పటికే శత్రువు రాకేష్‌ను పూర్తిగా చక్రబంధంలో ఇరికించడంతో, ఒక డి.బి.ఎఫ్ పోలీసును ఖతం చేసి, మరొకడిని తీవ్రంగా గాయపరిచి, తాను వీరమరణం పొందాడు. అంతిమ సమయంలో కూడా ఏ మాత్రం అధైర్య పడకుండా "ప్రతిఘటన ద్వారానే ఆత్మరక్షణ ఉంటుంద"నే మావో చెప్పిన సైనిక సూత్రాన్ని తూ.చ తప్పక పాటిస్తూ, మిగిలిన కామ్రేడ్స్ అందరిని, అత్యంత ప్రమాదకర పరిస్థితుల నుంచి రక్షించి, తాను అమరుడైనాడు. లేకుంటే మొత్తం దళమే నష్టపోయేది. కామ్రేడ్ రాకేష్ అమరుడైనప్పటికీ, ఆయన విప్లవ జీవితం, కార్యాచరణ విప్లవ శ్రేణులకు, పీడిత ప్రజలకు గొప్ప స్ఫూర్తినిస్తూ మనందరిని ముందుకే నడిపిస్తుంది.

దండకారణ్యంలో జరుగుతున్న ప్రజాయుద్ధానికి అవసరమైన సైనిక అవసరాలను సమకూర్చడంలో

అలుపెరుగని కృషి చేస్తూ, తుది శ్వాస వరకు పోరాడిన

# సర్కిన్‌గూడ యోధుడు కామ్రేడ్ సొమ్ము



భారత నూతన ప్రజాస్వామిక విప్లవంలో ముఖ్య భూమిక పోషిస్తున్న దండకారణ్యంలోని జీజాపూర్ జిల్లా, జేగురుగొండ ఏరియా, సర్కిన్‌గూడ గ్రామంలో పేద ఆదివాసీ కుటుంబంలో 25 సంవత్సరాల క్రితం కక్కెం సొమ్లి, గాందిల నలుగురు సంతానంలో పెద్ద కొడుకుగా కామ్రేడ్ సొమ్ము జన్మించాడు. సొమ్ము తల్లి అప్పుడప్పుడు మతిస్థిమిత్తం కోల్పోవడంతో, పిల్లల పెంపకం సమస్యగా మారింది. దీంతో సొమ్ము చిన్ననాటి నుంచే మేనమామల పెంపకంలో పెరిగాడు. ఈ ప్రాంతంలో భూమి–అధికారం కోసం జరుగుతున్న విప్లవోద్యమంతో ప్రతిపల్లె, ప్రతి ఇల్లు విడదీయరానివిగా పెనవేసుకున్నాయి. నిత్యజీవితంలో యుద్ధం కూడా భాగమైపోయింది. అలాంటి విప్లవ రాజకీయ వాతావరణంలో తన బాల్యం గడిచింది. సొమ్ము చిన్ననాటి నుంచే విప్లవ కార్యకలాపాలలో భాగమయ్యాడు. చిన్ననాడే బాలల సంఘంలో సభ్యుడిగా చేరి పని చేస్తూ, యుక్తవయస్సు వచ్చిన తర్వాత మిలీషియాలో సభ్యుడిగా మారాడు. సల్వాజుడుం సృష్టించిన అల్లకల్లోల పరిస్థితుల్లో ప్రతి వ్యక్తి అనివార్యంగా ఆయుధం అందుకోక తప్పలేదు. తన ఈడు యువతీ, యవకులందరు పి.ఎల్.జి.ఎలోకి భర్తీ కావడంతో, తనపై కుటుంబ బాధ్యతలు వున్నా, వ్యక్తిగత బాధ్యత కన్నా సమిష్టి, సామాజిక బాధ్యతకే ప్రాధాన్యత ఇచ్చాడు. 2010లో పూర్తికాలం విప్లవ కార్యకర్తగా విప్లవోద్యమంలో చేరాడు. పార్టీ 2011లో కామ్రేడ్ సొమ్మును సి.ఆర్.సికి చెందిన సప్లై దళంలో పని చేసేందుకు పంపించింది. ఈ దళం ఎ.ఒ.బి ప్రాంతంలో ఉ ంటూ, దండకారణ్యానికి పాదార్థిక సరఫరాలు అందిస్తూ వుండేది. కామ్రేడ్ సొమ్ము పార్టీ అదేశాలకు అనుగుణంగా ఈ సప్లై దళంలో చేరి పని చేసేందుకు ఇష్టపూర్వకంగా సిద్ధపడ్డాడు.

2011 ప్రారంభం నుంచి తాను అమరుడయ్యేవరకు సుమారు 9 సంవత్సరాలు సుదీర్ఘకాలం పాటు, తనకు అప్పగించిన బాధ్యతలను ఎలాంటి శషబిషలు లేకుండా అమలు చేశాడు. దళంలో చేరే నాటికి తనకు చదువురాదు. కాని ఉద్యమ అవసరాలకోసం పార్టీలో చేరిన అనతి కాలంలోనే చదవడం, రాయడం నేర్చుకొని, విప్లవ సాహిత్యాన్ని అధ్యయనం చేయడం ప్రారంభించాడు. కొద్దికాలంలోనే చదువురాని కామ్రేడ్స్‌కు విద్య నేర్పే టీచర్ బాధ్యతను చేపట్టాడు. ఎ.ఒ.బిలోకి వచ్చిన తర్వాత ఒడియా, తెలుగు భాషలను నేర్చుకొని, ప్రజలకు వారి భాషలో విప్లవ రాజకీయాలను బోధిస్తూ, వారిలో ఒకడుగా మారిపోయాడు. ఎప్పుడు చెరగని చిరునవ్వుతో అందరిని పలకరిస్తూ, ఆత్మీయుమైన కమ్యూనిస్టుగా అందరి మనస్సులలో మరిచిపోని ముద్ర వేశాడు. స్థానిక ప్రజల సమస్యలను, ఆ ప్రాంత ఆర్థిక, రాజకీయ, సామాజిక పరిస్థితులను అధ్యయనం చేసి, అర్థం చేసుకున్నాడు. క్రమంగా తన రాజకీయ చైతన్యం పెంచుకున్నాడు. 2016లో అదే దళంలో ఎ.సి.ఎమ్‌గా పని చేస్తున్న కామ్రేడ్ స్వేతను ఇష్టపడి, పెళ్ళి చేసుకుంటానని ప్రతిపాదన చేశాడు. అందుకు కామ్రేడ్ స్వేత ఆమోదించడంతో, పార్టీ పద్ధతులలో వివాహం చేసుకున్నాడు. సహచర జీవితాన్ని విప్లవ ప్రయోజనాలకు లోబడి కొనసాగించాడు. సహచరుల మధ్య తలెత్తే సమస్యలను పార్టీ పద్ధతులలో పరిష్కరించుకునే చైతన్యాన్ని ప్రదర్శించాడు.

2013లో దండకారణ్యంలోని తన స్వగ్రామమైన సర్కిన్‌గూడపై నరహంతకులైన ప్రభుత్వ సాయుధ బలగాలు చుట్టుముట్టి, అత్యంత ఫాసిస్టు పద్ధతులలో ప్రజలపై విచ్చలవిడిగా కాల్పులు జరిపి అనేక మందిని హత్య చేసి, పోరాడే ప్రజలను భయపెట్టి, లొంగదీసుకోవాలని చూసారు. ఈ సంఘటలో తన బంధువులు, మిత్రులు, ఆత్మీయులు, ప్రాణాలు కోల్పోతే గుండె నిబ్బరం కోల్పోకుండ మరింత వర్గ కసిని పెంచుకొని, తన మార్గానికి మరింత పదును పెట్టి పని చేశాడు.

తాత్కాలిక సెట్‌బ్యాక్‌లో వున్న ఎ.ఒ.బి ఉద్యమంలోని అనేక ఒడుదుడుకుల మధ్య కూడా విప్లవోత్సాహం కనబరుస్తూ, తనకు అప్పగించిన కర్తవ్యాలను మొక్కవోని దీక్షతో అమలు చేశాడు. 2018లో పార్టీ తనను ఎ.సి.ఎమ్‌గా ప్రమోట్ చేసి, అదే దళంలో

బాధ్యతలు అప్పగించింది. కమిటీ సమావేశాలలో తన అభిప్రాయాలను సూటిగా, స్పష్టంగా మాట్లాడేవాడు. సూత్రబద్ధమైన, నిర్మాణాత్మకమైన విమర్శలు చేసేవాడు. అదే సమయంలో లోతైన, నిజాయితీతో కూడిన ఆత్మ విమర్శలను ప్రవేశపెట్టేవాడు. క్యాడర్‌తో కలిసిపోవడంలోనూ, తోటి కామ్రేడ్స్ నుంచి నేర్చుకోవడంలోను కమ్యూనిస్టు వినయాన్ని ప్రదర్శించేవాడు. ప్రధానంగా తనది సప్లై బాధ్యతనే అయినప్పటికీ, ఖాళీ సమయంలో పార్టీ అప్పగించిన మాస్‌వర్క్ (ప్రజాపని)లో పాల్గొనేవాడు. జోన్‌లో చేపట్టే టి.సి.ఒ.సి, ప్రతిఘటన క్యాంపెయిన్స్‌లో చురుకుగా పాల్గొనేవాడు. అనేక ఎదురుకాల్పుల ఘటనల్లో నిబ్బరంగా వుంటూ, కమాండర్ ఆదేశాలను పాటిస్తూ, శతృవును నిబ్బరంగా ఎదుర్కోవడంలో ముందుండేవాడు. టెర్రయిన్‌పై పట్టు సంపాదించి, దళానికి పైలెట్‌గా పని చేశాడు. నాయకత్వ రక్షణ కర్తవ్యాలలో గొప్ప సేవలు అందించాడు. ఏ పనులు అప్పగించినా చిరునవ్వుతో, మనస్ఫూర్తిగా స్వీకరించి అమలు చేసేవాడు. పార్టీ నిర్వహించిన మిలటరీ, రాజకీయ శిక్షణ తరగుతులలో చురుకుగా పాల్గొని తన సమర్థతలను పెంచుకున్నాడు. ఉద్యమ ఆటుపోట్లలో రాటుదేలి, మడమ తిప్పని యోధుడుగా ఎదిగాడు.

2019 జులైలో నాయకత్వానికి రక్షణగా ఉంటూ, నూతన ప్రాంతాన్ని సర్వే చేసేందుకు చత్తీష్‌గఢ్-ఒడిశా సరిహద్దు ప్రాంతానికి వెళ్ళి తిరియా గ్రామ అటవీ ప్రాంతంలో మకాం వేసినప్పుడు పక్క సమాచారంతో జులై 27న చత్తీష్‌గఢ్ కమాండో బలగాలు దాడి చేశాయి. ఈ దాడిని తిప్పికొట్టి రిట్రీట్ అవుతున్నప్పుడు మరోమారు పోలీస్ ఎన్‌సర్కిల్‌కు గురయ్యారు. దానిని ఛేదించే క్రమంలో వీరోచితంగా పోరాడి, తన సహచరి కామ్రేడ్ స్వేత, మరో నలుగురు కామ్రేడ్స్‌తోపాటు వీరమరణం పొందాడు. మీ త్యాగం మహోన్నతమైంది. వెలకట్టలేనిది. దానికి హద్దులు లేవని నిరూపించారు. మీ మరణవార్త విన్న ప్రజలు మీ సేవలను గుర్తు చేసుకొని విలవిలలాడారు. మీ లక్ష్యం సిద్ధించే వరకు అలుపెరుగక పోరాడుతామని నినదించారు. మీ ఆయశ సాధనకు మరింత పునరంకితం అయి ఉద్యమిస్తామని మరోమారు శపథం చేస్తున్నాం.

---

**27వ పేజీ తరువాయి భాగం...**

ఆంబూష్‌లో అస్సాల్ట్ గ్రూపులో ఉండి, ఆ చర్య విజయవంతం కావడానికి కృషి చేశాడు. నారాయణపట్నా ఏరియా పెద్ద ఇటుక గ్రామానికి చెందిన ఇన్‌ఫార్మర్ రతన్‌ను ఖతం చేసిన కార్యక్రమంలో కూడా పాల్గొన్నాడు. 2018లో అవినీతిపరులుగా, ప్రజాద్రోహులుగా వ్యవహరిస్తున్న ఎమ్.ఎల్.ఎ కిడారి సర్వేశ్వరరావు, మాజీ ఎమ్.ఎల్.ఎ సివేరి సోమాలను అంతమొందించడంలో కీలకమైన పాత్ర చేపట్టాడు.

ఇలా నందపూర్ నారాయణపట్నా గెరిల్లా జోన్ ప్రాంతంలో రాజ్యానికి వ్యతిరేకంగానూ, ప్రజా శతృవులకు వ్యతిరేకంగానూ అనేక గెరిల్లా చర్యలలో పాల్గొంటూ, ప్రజల రాజ్యాధికారాన్ని నిర్మించేందుకు అహర్నిశలు కృషి చేశాడు. ఈ క్రమంలో 3వ కంపెనీలో నాయకత్వ కొరత ఏర్పడటంతో, కంపెనీకి 'సబ్ జోనల్ కమిటీ' స్థాయిలో ఒక నిర్మాణాన్ని ఇచ్చి, అందులోకి రమేష్‌ను తీసుకోవాలని పార్టీ నిర్ణయించింది. కానీ సైనిక నిర్మాణానికి అటువంటి నిర్మాణం పొసగదని భావించిన పార్టీ, ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకొన్నప్పటికీ, కంపెనీని ఫంక్షన్ చేయించడంలో, పార్టీ రమేష్‌పై ఆధారపడింది.

2018 చివరికి, కొరాపుట్ ప్రాంతంలో శతృదాడి తీవ్రస్థాయికి చేరడంతో, ఎస్.జడ్.సి అక్కడి నుంచి మన ఆర్గనైజేషన్, సైనిక బలగాలన్నింటినీ తాత్కాలికంగా ఉపసంహరించుకొనేలా నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయంలో భాగంగా, ఈ బలగాలన్నీ విశాఖ-ఈస్ట్ డివిజన్ వైపు రిట్రీట్ అయ్యాయి. అయితే ఈ డివిజన్‌తో కొంత కాలంగా మనకు గ్యాప్ ఉడటంతో, అక్కడ పోలీసు నెట్‌వర్క్ బలంగా ఏర్పడింది. ఈ నేపథ్యంలోనే 2019లో కొండజర్త వద్ద పోలీసులతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో కామ్రేడ్ విమల, కామ్రేడ్ బుద్రి, కామ్రేడ్ అజయ్ పోలీసులతో వీరోచితంగా పోరాడుతూ అమరులు కాగా, కామ్రేడ్ రమేష్, కామ్రేడ్ భూమాల్ అక్కడి నుండి తప్పుకొని ఆర్.వి స్థలానికి వెళ్ళారు. అయితే ఆ మరుసటి రోజు పోలీసులు ఆర్.వి పెట్టుకున్న ఫేములగొంది గ్రామాన్ని చుట్టిముట్టి రమేష్, భూమాల్‌లను పట్టుకొని, క్రూరంగా హింసించి కాల్చి చంపారు.

రమేష్ అమరత్వం నుండి మనం చాలానే నేర్చుకోవాలి. పీడిత వర్గంలో పుట్టిన రమేష్, తాను అనుభవిస్తున్న దోపిడీ, పీడనల నుంచి విముక్తి కావాలని పార్టీలోకి వచ్చినప్పటికీ, పీడిత ప్రజలందరి విముక్తిలోనే తన విముక్తి ఉందని గ్రహించిన రమేష్, విప్లవ విజయం కోసం తనను తాను మలుచుకొన్నాడు. మట్టి మనిషిగా ఎదిగిన రమేష్ పార్టీలోకి వచ్చిన తర్వాతనే చదువు, భాషలు (తెలుగు, ఒడియా, కువ్వి) నేర్చుకోవడం, సాంకేతిక పరిజ్ఞానం (కమ్యూనికేషన్) సంపాదించడం, ఆర్గనైజేషన్, మిలటరీ సమర్థతలు పెంచుకోవడం ఇలా ఎన్నో నేర్చుకున్నాడు. అంతే కాదు, తన ఆదివాసీ జీవితంలో ఒక తత్వంగా అలవర్చుకున్న సమిష్టి, సహకారతత్వాలను మరింతగా అంటే అసమానతలకూ, ఎటువంటి వివక్షకు తావులేని సోషలిస్టు చైతన్యంగా మలుచుకున్నాడు. ఈ చైతన్యం అంతా పార్టీ సిద్ధాంత, రాజకీయాలను అత్యంత నిబద్ధతతో వంటపట్టించుకోవడం వల్లనే సాధ్యమైంది. అందుకు తాను పీడిత వర్గంలో పుట్టడం కూడా దోహదపడింది. ఇలా సిద్ధాంతాన్ని ఒంటబట్టించుకోవడమే కాకుండా, సాయుధ వర్గపోరాటంలో సంపూర్ణంగా లీనమై, ఉన్నత కమ్యూనిస్టు చైతన్యాన్ని సంతరించుకొని, నడుస్తున్న నూతన ప్రజాస్వామిక విప్లవంలో తన నులివెచ్చని రక్తాన్ని ధారపోసిన రమేష్ నుంచి మనం ఎంతో నేర్చుకోవాలి. ఆయన మనకు ఆదర్శం. ఆయన నెత్తుటి బాకీని తీర్చుకొనేందుకు శతృవును మట్టుబెడుతూ రాజీలేని పోరాటం కొనసాగిద్దాం.

# దండకారణ్య విప్లవోద్యమంలో విరిసిన ఎర్రమందారం

# కామ్రేడ్ విమల (తెల్లం ఐతె)



సెప్టెంబర్ 22, 2019న ఈస్ట్ డివిజన్, గాలికొండ ఏరియా, కొండజర్త వద్ద జరిగిన ఎదురు కాల్పుల్లో అమరురాలైన సి.ఆర్.సి 3వ పి.ఎల్ పి.సి.సి సభ్యురాలు కామ్రేడ్ విమలది చత్తీస్‌గఢ్ రాష్ట్రం, బీజాపూర్ జిల్లా, గంగులూరు ఏరియా, గుండం గ్రామం. తల్లిదండ్రులు పెట్టిన పేరు తెల్లం ఐతె. కోయ ఆదివాసీ మధ్య తరగతి కుటుంబంలో తల్లి సుక్కీ, తండ్రి సుక్లులకు కలిగిన నలుగురు ఆడపిల్లలలో ఐతె రెండవ సంతానం. చిన్నప్పుడే తల్లి అనారోగ్యంతో చనిపోయింది. ఆ తర్వాత చిన్నాన్నల వద్ద పెరిగింది. దండకారణ్యంలో విప్లవోద్యమం పురోగమిస్తున్న కాలంలో పుట్టిన ఐతె విప్లవకర వాతావరణంలో పెరిగి సహజంగానే అందరిలాగే చిన్నప్పుడు బాలల సంఘంలో పని చేసింది. ఎల్లప్పుడూ పెదవులపై చెదరని చిరునవ్వుతో ఎంతటి కష్టమైన పనినైనా ఆడుతూ పాడుతూ చేసేది. ఆటపాటలంటే తనకున్న ఇష్టాన్ని చూసి, 2008లో పార్టీ స్థానిక జనతన సర్కార్ చేతన్ నాట్య మంచ్‌లో తనకిచ్చిన బాధ్యతను పట్టుదలగా నెరవేర్చింది. సల్వాజుడుంకు వ్యతిరేకంగా, ఆదివాసీ మహిళపై తెగ పితృస్వామ్యానికి వ్యతిరేకంగా అనేక క్యాంపెయిన్స్‌లో పాల్గొని తన ఆట, పాటలతో ప్రజలను, చైతన్యపర్చింది. ఈ క్రమంలోనే 2009 నవంబర్‌లో పూర్తికాలం కార్యకర్తగా రిక్రూట్ అయ్యి స్థానికంగా కొంతకాలం పని చేసింది. 2010లో పార్టీ పిలుపునందుకుని ఎ.ఒ.బిలో ఏర్పాటు చేసిన సి.ఆర్.సి 3వ కంపెనీలో సభ్యురాలయ్యింది. శ్రీకాకుళం-కొరాపూట్ డివిజన్‌లో నారాయణపట్నా ఆదివాసీ సాయుధ రైతాంగ పోరాటానికి మద్దతుగా, సి.ఆర్.సి 3వ కంపెనీ నిర్వహించిన అనేక కార్యక్రమాలలో కంపెనీ సభ్యురాలిగా తన భాగస్వామ్యం ఉంది. అనేక మిలటరీ చర్యలలోనూ, దాడులలోను పాల్గొన్నది. సామన, అమ్లియాంబ, మసానమండ, రంగనిగూడ, సప్పుజొల్ల, పనికి, పనసపుట్, కుత్తుడిలలో జరిగిన ఎదురుకాల్పుల్లో ధైర్యంగా శత్రువును ప్రతిఘటించింది. 2011లో ఒడిశాలోని ఇద్దరు పోలీసులను చంపి, 4గురిని గాయపర్చిన అంబుష్‌లో సి.ఆర్.సి 3వ కంపెనీతో తను కూడా పాల్గొన్నది. 2012లో నాల్కో దామన్‌జోడి రోడ్డుపై, పోలీసులపై మన పి.ఎల్.జి.ఎ చేసిన ఘటన, 2013 ఆగస్టులో రాళ్ళగడ్డ అంబుష్, 2017 ఫిబ్రవరిలో సుంకి అంబుష్, లుక్కపానీ అంబుష్‌లోను ఆమె పాల్గొన్నది. 2018 సెప్టెంబర్‌లో జరిగిన జంట ఎమ్.ఎల్.ఎల 'కిడారి ఆపరేషన్'లో కూడా తన భాగస్వామ్యం ఉంది. వీటితోపాటు ప్రజా వ్యతిరేకులను, ఇన్ఫార్మర్లను శిక్షించిన అనేక సంఘటనల్లో తన క్రియాశీలకమైన పాత్ర ఉంది.

కామ్రేడ్ విమల మిలటరీ చర్యలలో మాత్రమే కాదు, ఆర్గనైజేషన్ పనుల్లో కూడా తన కృషిని, సేవలను ప్రజలకు అందించింది. శ్రీకాకుళం-కొరాపూట్ డివిజన్‌లో 2018 మార్చిలో డొకిరిగాటి వద్ద జరిగిన ఎదురుకాల్పుల్లో అమరురాలైన కామ్రేడ్ కోసి (కుమారి)తో కలిసి విమల కూడా అనేక సందర్భాలలో ఆర్గనైజేషన్ పనుల్లో భాగమయ్యింది. స్థానిక ప్రజల కువ్వి, ఒడియా భాషలను నేర్చుకొని ప్రజలతో మమేకమయింది. కంపెనీలో డాక్టర్‌గా, ప్రజలకు డాక్టరుగా సేవలు చేసి ప్రజల హృదయాలను గెలుచుకుంది. విప్లవోద్యమంలో తన సమర్థవంతమైన కార్యాచరణను దృష్టిలో పెట్టుకొని పార్టీ తనకు 2017లో పి.పి.సి సభ్యురాలిగా ప్రమోట్ చేసింది. పి.పి.సి సభ్యురాలిగా, సెక్షన్ కమాండర్‌గా తను బాధ్యతలను నిర్వహించింది.

2019లో ఎ.ఒ.బి జోన్ ఉద్యమ పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని ఎస్.జడ్.సి చేసిన నిర్మాణపరమైన మార్పుల్లో భాగంగా సి.ఆర్.సి 3వ పి.ఎల్ ఈస్ట్ డివిజన్‌పై కేంద్రీకరించింది. అందులో భాగంగా ఆ డివిజన్‌లో జరిగిన అనేక కార్యక్రమాల్లో ఆమె భాగమయ్యింది. ఈస్ట్ డివిజన్‌లో బాక్సైట్‌కు వ్యతిరేకంగా, కాఫీ తోటల పోరాటానికి వ్యతిరేకంగా ఆటంకంగా నిలిచిన ప్రజా వ్యతిరేకులపై తీసుకున్న అనేక చర్యల్లో పాలు పంచుకుంది. ఈ క్రమంలోనే 2019, సెప్టెంబర్ 22 మధ్యాహ్నం 1:30 గం॥ల సమయంలో సెంట్రీలో ఉన్న విమల శత్రువు అకస్మాత్తుగా జరిపిన కాల్పులను ధీటుగా ప్రతిఘటిస్తూ, వీరోచితంగా పోరాడుతూ తుదిశ్వాస విడిచింది. తను పుట్టి పెరిగిన ప్రాంతాన్ని, ఆప్తులను వదిలి అనేక కష్టనష్టాలకోర్చి, విప్లవోద్యమంలో దశాబ్దకాలం తన సేవలందించింది. అంతిమ శ్వాస వరకు పీడిత ప్రజల కోసం పని చేసిన కామ్రేడ్ విమల ఆదర్శాలను, ఆశయాలను ఎత్తిపడదాం!

# దండకారణ్య దండులో పురుడుబోసుకున్న
# కామ్రేడ్ మంగు

భూమండలంపైన వర్గరహిత మానవ సమాజం నిర్మించాలని కలలు కన్నవాడు, కలలు కనడమే కాదు కార్యాచరణకు దిగినవాడు, ఆయనకు హద్దులేముంటాయి! సరిహద్దులను చెరిపేస్తూ, అంతర్జాతీయ కార్మికవర్గ దృక్పథంతో, పుట్టిన గ్రామాన్ని, ప్రాణం కన్న మిన్నగా పెంచిన తల్లిదండ్రులనూ, వారి ప్రేమను కాదనుకొని చిరుప్రాయంలోనే నమ్మిన ఆశయం కోసం ప్రాణమివ్వడానికై కదిలినవాడు మన అమరుడు మంగు. ఆయన పుట్టింది చత్తీష్‌గఢ్ రాష్ట్రంలోని, బీజాపూర్ జిల్లా, గంగులూర్ ఏరియాలోని పొరుములు గ్రామం. వెనుకబడిన ఆదివాసీ సమాజంలోని పేదరైతు కుటుంబంలో 22 సంవత్సరాల క్రితం పోరుగడ్డపై జన్మించాడు. తల్లిదండ్రులు తమ బిడ్డను ఉన్నత చదువులు చదివించి, ప్రయోజకుడ్ని చేయాలని కలలు కని పాఠశాలకు పంపారు. ఎంతో క్రమశిక్షణగా పాఠశాలకు వెళ్ళి చదువుకున్నాడు. కాని పల్లెలో ప్రభుత్వ పాఠశాలలో పేదలకు విద్యను బోధించాలనే ఆలోచన ఈ రాజ్యానికి లేదు. పేదరికానికి తోడు, పాఠశాలలో విద్యా బోధనలేక 5వ తరగతితోనే తన చదువు ఆగిపోయింది. పల్లెలన్నీ విప్లవ పాఠశాలలే. అక్కడే విప్లవ రాజకీయాలను నేర్చుకొని, తన జీవితాన్ని సమాజానికి అర్పించి, ప్రజల బాధలకు పరిష్కార మార్గాలను అన్వేషించాడు. పోరాటాన్ని జీవితంగా మల్చుకున్నాడు. మొదట ప్రజా విముక్తి గెరిల్లా సైన్యానికి బేస్‌ఫోర్స్‌గా పని చేస్తున్న గ్రామ మిలీషియా సభ్యుడిగా చేరాడు. ప్రజల విముక్తి కోసం పూర్తికాలం పని చేయాలని నిర్ణయించుకొని పార్టీ ముందు ప్రతిపాదన పెట్టాడు. 2014లో పార్టీ తనను పూర్తికాలం కార్యకర్తగా భర్తీ చేసుకున్నది. 2015 ప్రారంభంలో ఎ.ఒ.బిలో పని చేస్తున్న సి.ఆర్.సి సప్లై దళంలోకి సభ్యుడిగా పంపినప్పుడు విప్లవోత్సాహంతో ఆమోదించి అమలు చేశాడు.

ఎ.ఒ.బి ఉద్యమ సెట్‌బ్యాక్ పరిస్థితులలో, నిరంతరం శత్రువు కొనసాగిస్తున్న ఎడతెరిపిలేని దాడుల మధ్య, నిర్దిష్ట పరిస్థితులను ఆకళింపు చేసుకొని, అక్కడే తనకు అప్పగించిన కర్తవ్యాన్ని అమలు చేయడానికి పట్టుదల, దృఢసంకల్పంతో సమాయత్తమైనాడు. నూతన ప్రాంతంలో ప్రజల భాషలైన ఒడియా, తెలుగును మాట్లాడటం నేర్చుకున్నాడు. ఎవరు పలకరించినా ముసి ముసి నవ్వులతో జవాబు చెప్పే కామ్రేడ్ మంగు ప్రజలతో చాలా సులువుగా కలిసిపోయేవాడు. అవసరము మేరకు మాత్రమే మాట్లాడుతూ, ప్రతి విషయాన్ని లోతుగా పరిశీలించేవాడు. అప్పగించిన పనులను చాలా క్రమశిక్షణతో అమలు చేస్తూ, అందరి విశ్వాస పాత్రుడుగా మారాడు. కమ్యూనికేషన్ పనిని పార్టీ పద్ధతులలో సమర్థవంతంగా నిర్వహించేవాడు. దళానికి టీచర్, డాక్టర్‌గా బాధ్యతలను నెరవేర్చాడు. ఎంత కష్టమైన పనినైనా ఓపికగా, ఏ మాత్రం వెనకడుగు వేయకుండ పూర్తి చేసేవాడు. సప్లై దళంలో సభ్యుడైనప్పటికీ, పార్టీ అవసరాల రీత్యా ప్రజలను విప్లవంలోకి సంఘటితపరిచే కర్తవ్యాన్ని కూడా చేపట్టాడు.

జోన్‌లో చేపట్టిన టి.సి.ఒ.సి, విడి ప్రతిఘటనా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనేవాడు. ఎమ్.కె.వి.బి డివిజన్‌లో స్థానిక శత్రువులనూ, పోలీసు ఏజెంట్లను శిక్షించే చర్యల్లో భాగం అయ్యాడు. నాయకత్వ రక్షణతోపాటు, ముఖ్యమైన పార్టీ కమిటీ సమావేశాలకు రక్షణ కలిపించే పనిలో కూడా చైతన్యవంతంగా పాల్గొన్నాడు. పార్టీ నిర్వహించిన రాజకీయ, మిలటరీ శిక్షణ తరగతులలో పాల్గొని, పార్టీ చేపట్టిన బోల్షివీకరణ క్యాంపెయిన్‌లో తనలోని అన్యవర్గ భావాలను తొలగించుకోవడానికి చైతన్యవంతంగా కృషి చేశాడు. లోపాలు, బలహీనతలను ఎదుటివాళ్ళు సూచించినప్పుడు నిజాయితీగా గుర్తించి సరిదిద్దుకునేవాడు. ఉద్యమంతోపాటు, అంటే ఉద్యమ డిమాండ్‌కు అనుగుణంగా తనను తాను మల్చుకున్న కమ్యూనిస్టు.

2019, జులై 27న చత్తీస్‌గఢ్–ఒడిశా సరిహద్దులోని, తిరియా అటవీ ప్రాంతంలో దళంపై జరిగిన దాడిని తిప్పికొట్టి రిట్రీట్ అవుతున్నప్పుడు మరోమారు చుట్టివేతకు గురై దానిని గండికొట్టే క్రమంలో మంగుతోపాటు, ఆరుగురు యువ పి.ఎల్.జి.ఎ యోధులు, యోధురాళ్ళు అమరులయ్యారు. ఉద్యమంలో ఎదిగివస్తున్న యువ గెరిల్లా యోధుడు కామ్రేడ్ మంగు అమరత్వం సప్లై రంగానికే కాదు, ఎ.ఒబి ఉద్యమానికి కూడా తీవ్రమైన నష్టం. నీ ఆచరణలోని విలువైన ఆదర్శాలను మా కార్యాచరణకు అన్వయించుకుంటాం. నీ ఆశయ పరిపూర్తికి అంకితమై పని చేస్తామని పార్టీ, పి.ఎల్.జి.ఎ నీకు అరుణాంజలి ఘటిస్తున్నది.

## బాల్యం నుంచి అమరత్వం వరకు ప్రజాయుద్ధ వాతావరణంలో

## విప్లవకర జీవితాన్ని గడిపి అసువుల బాసిన

# కామ్రేడ్ శాంతి



చత్తీష్‌గఢ్ రాష్ట్రం, బీజాపూర్ జిల్లా, గంగులూర్ ఏరియా, మసల గ్రామంలోని పేద ఆదివాసీ కుటుంబంలో సుమారు 20 సంవత్సరాల క్రితం కామ్రేడ్ శాంతి జన్మించింది. అప్పటికే ఆ ప్రాంతంలో బలమైన విప్లవోద్యమం నిర్మాణమయ్యింది. జనతన సర్కార్ల రూపంలో ప్రజారాజ్యాధికారం సంఘటితమవుతున్నది. ప్రజలు పెద్ద ఎత్తున ప్రజాయుద్ధంలో భాగస్వాములు అవుతుండటంతో, ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం ఏర్పడి, అది శత్రుసాయుధ బలగాలతో తలపడుతూ ఉండటం వలన, గెరిల్లా యుద్ధం ఉన్నతస్థాయికి అభివృద్ధి చెందింది. ఆ యుద్ధం మధ్యనే తన బాల్యం గడిచింది. 2005లో పోరాడుతున్న ప్రజలపై రాజ్యం సల్వాజుడుం పేరుతో అత్యంత అమానవీయమైన నరహంతక దాడిని ప్రారంభించింది. ఈ దాడిని ప్రతిఘటించి ఓడించడానికి ప్రతి పల్లె, ప్రతి కుటుంబం ముసలివాళ్ళు, పిల్లలు అనే తేడా లేకుండా, మొత్తం ఆదివాసీ సమూహం పార్టీ పి.ఎల్.జి.ఎ నాయకత్వంలో ఆయుధాలు ధరించి, అత్యంత వీరోచితంగా పోరాడి, అనన్యమైన త్యాగాలు చేసి, ఆ ప్రతిఘాతుక దాడిని ఓడించి, అంతిమంగా విజయం సాధించారు. ఈ కాలంలో ప్రజలు అనుభవించిన బాధలు, కష్టాలు, కన్నీళ్ళు మాటలకు అందనివి. వీటి మధ్య శాంతి అందరి పిల్లలలా ఆడుతూ, పాడుతూ పెరగలేదు. తన చుట్టు అలుముకున్న కల్లోల పరిస్థితులను ప్రత్యక్షంగా అనుభవించింది. వీటికి కారణాలను చిన్నతనంలోనే అర్థం చేసుకుని, దీనికి పరిష్కారంగా పార్టీ అందించిన ప్రజాయుద్ధ రాజకీయాలను నేర్చుకుంది. తన అడుగులను ఆ మార్గం వైపే వేయడం మొదలుపెట్టింది. చివరి రక్తం బొట్టు చిందేవరకు మడమ తిప్పకుండ తన విప్లవ ప్రయాణాన్ని సాగించింది. గ్రామంలోని విప్లవ నిర్మాణాలనూ, ప్రజలను రక్షించడంలో ఒక మిలీషియా సభ్యురాలిగా తన విధులను క్రమశిక్షణాయుతంగా అమలు చేసింది.

2016లో పూర్తికాలం కార్యకర్తగా పార్టీలోకి రిక్రూట్ అయ్యింది. ఆ నాటికి ఎ.ఒ.బిలో పార్టీ చరిత్రలోనే అతిపెద్ద సంఘటనగా నమోదు అయిన రాంగూడ ఎన్‌కౌంటర్ హత్యకాండలో 31 మంది వివిధ స్థాయిల కామ్రేడ్స్ అమరులయ్యారు. ఈ నష్టాన్ని భర్తీ చేయడానికి డి.కె ఎస్.జడ్.సి కొద్ది మంది కామ్రేడ్స్‌ను ఎ.ఒ.బికి పంపాలని నిర్ణయించింది. ఉద్యమ అవసరాలను గుర్తింపచేయగా, ఏ మాత్రం పరిచయం లేని ప్రాంతం అయినప్పటికీ, మనస్ఫూర్తిగా ఆమోదించి, 2017లో ఎ.ఒ.బి ఉద్యమంలో భాగం అయ్యింది. ఎ.ఒ.బిలోని సి.ఆర్.సి 1వ పి.ఎల్‌లో సభ్యురాలిగా చేరింది. అప్పటి నుంచి చదువు నేర్చుకొని, సాహిత్యం అధ్యయనం చేసే స్థాయికి ఎదిగింది. స్థానిక ఒడియా, తెలుగు భాషలను మాట్లాడటం నేర్చుకుని, ప్రజలకు రాజకీయాలు బోధించే విధంగా పట్టు సాధించింది. స్థానికంగా ప్రజల జీవన స్థితిగతులను, సమస్యలను అర్థం చేసుకుంది. టెర్రయిన్‌పైన, శత్రువుపైన అంచనాకు వచ్చింది. తీవ్రమైన శత్రువు అణచివేత దాడిని ఎదుర్కోవడానికి పార్టీ రూపొందించిన ఎత్తుగడలకు అనుగుణంగా తనను తాను తీర్చిమలుచుకుంది. పార్టీ అప్పగించే పనిని స్వతంత్రంగా నిర్వహించే విధంగా ఎదిగి, పార్టీ ఆధారపడే కామ్రేడ్‌గా మారింది. 2 సంవత్సరాల కాలం ప్రధానంగా ఎమ్.కె.వి.బి డివిజన్‌లో తను మిలటరీ కార్యకలాపాలలో పాల్గొన్నది. స్థానిక శత్రువులనూ, పోలీసు ఏజెంట్లను శిక్షించడంలోనూ, సాయుధ బలగాలను ప్రతిఘటించడంలోను కూడా ప్రత్యక్షంగా, పరోక్షంగా తన పాత్ర ఉంది. ఈ కృషి ఎమ్.కె.వి.బి ఉద్యమాభివృద్ధికి చాలా దోహదపడింది. 2019 సెప్టెంబర్ 24న మైనింగ్ మాఫియా అరకు ఎమ్.ఎల్.ఎ కిడారి సర్వేశ్వరరావు, మాజీ ఎమ్.ఎల్.ఎ సీవేరి సోమలను ఖతం చేసిన సంఘటనలోను చురుకుగా పాల్గొన్నది. ఈ సంఘటన, విస్థాపన (నిర్వాసిత) వ్యతిరేక ఆందోళనలో ప్రజలు సాధించిన రాజకీయ మిలటరీ విజయం.

అమరురాలు కావడానికి కొన్ని నెలల ముందు సి.ఆర్.సి 1వ పి.ఎల్ నుండి తనను సి.ఆర్.సి సప్లై దళానికి సభ్యురాలిగా బదిలీ చేయడం జరిగింది. అనతికాలంలోనే జులై 27న చత్తీష్‌గఢ్-ఒడిశా సరిహద్దులోని తిరియా గ్రామ సమీప అడవిలో, పోలీసులు పక్క సమాచారంతో దళం మకాంపై దాడికి రాగా, మన బలగాలు ముందే అప్రమత్తమై శత్రువును ప్రతిఘటించి క్షేమంగా రిట్రీట్ అయ్యాయి. తిరిగి 2 గం॥ల తర్వాత మరోమారు అన్ని వైపుల నుంచి అననుకూల టెర్రయిన్‌లో పోలీసులచే చుట్టివేతకు గురయ్యారు. ఆ చుట్టివేతను ఛేదిస్తూ, అక్కడున్న నాయకత్వాన్ని, క్యాడర్‌లను రక్షించే క్రమంలో గంటకుపైగా వీరోచితంగా పోరాడి తన నులివెచ్చని నెత్తురు ధారపోసింది. నీ అమరత్వపు వార్త ఆలస్యంగానే అయిన చత్తీష్‌గఢ్-ఎ.ఒ.బిలోని పార్టీ, పి.ఎల్.జి.ఎ ప్రజలకు చేరింది. వారు నీ ఆశయం సాధించేవరకు అలుపెరుగక పోరాడుతామని పిడికిళ్ళు బిగించి శపథం చేశారు.

# పీడిత ప్రజల ముద్దు బిడ్డ
# కామ్రేడ్ బగ్గం బుద్రి



చత్తీస్‌గఢ్ రాష్ట్రం, సుక్మా జిల్లా, జేగురుగొండ ఏరియా, గొందోడ్ గ్రామానికి చెందిన కామ్రేడ్ బగ్గం బుద్రి పేద ఆదివాసీ కోయ కుటుంబంలో పుట్టింది. చిన్నప్పుడే తండ్రి చనిపోయాడు. తన అన్నయ్యకు పోలియో కారణంగా అవిటివాడు కావడంతో, చిన్న వయస్సులోనే కుటుంబ పోషణ భారాన్ని తల్లితో పాటు, బుద్రి కూడా తన భుజానికెత్తుకుంది. ఆంధ్రరాష్ట్రానికి మిరపకాయల కూలీకి కూడా వెలుతుండేది. చిన్నప్పటి నుంచి పేదరికంతో, కష్టాలతో పెరిగింది. ఆ ప్రాంతంలో కొనసాగుతున్న విప్లవోద్యమ రాజకీయాలతో ప్రభావితమై, చిన్నప్పుడు బాలల సంఘంలోనూ, ఆ తర్వాత చేతన్ నాట్య మంచ్‌లోను పని చేసింది. ఈ క్రమంలోనే పూర్తికాలం పని చేయాలనే తన నిర్ణయాన్ని స్థానిక కమిటీకి తెలియజేయడంతో, అక్కడి పార్టీ తనను కొంతకాలం మిలీషియాలో పని చేయాల్సిందిగా సూచించింది. అలా 2016 చివరలో భర్తీ అయ్యి, కొంత కాలం స్థానికంగా పని చేసిన తర్వాత, పై కమిటీ తనను 2017 జూన్‌లో ఏ.ఒ.బికి బదిలీ చేసింది. ఏ.ఒ.బిలో కామ్రేడ్ బుద్రి పార్టీ నిర్ణయం ప్రకారం నాయకత్వ (ఎస్.జడ్.సి.ఎమ్) కామ్రేడ్‌కు గార్డ్‌గా బాధ్యతలు చేపట్టింది. 2018 మార్చిలో నారాయణపట్నా ఏరియా దొకిరిగాటి వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరో ఎస్.జడ్.సి.ఎమ్ గార్డుగా పని చేస్తున్న కామ్రేడ్ లక్కె అమరురాలు కావడంతో, లక్కె స్థానంలో కామ్రేడ్ బుద్రిని నియమించగా, ఎటువంటి శషభిషలు లేకుండా తనకిచ్చిన బాధ్యతను చేపట్టింది. మొత్తంగా 2017జులై నుంచి 2019 సెప్టెంబర్ వరకూ 2 సంవత్సరాల కాలం గార్డు బాధ్యతను నిర్వహించింది. పార్టీ అవసరాల రీత్యా కామ్రేడ్ బుద్రిని సి.ఆర్.సి 3వ పి.ఎల్‌కు బదిలీ చేసిన అతి కొద్ది రోజుల్లోనే, సెప్టెంబర్ 22, 2019న ఈస్ట్ డివిజన్‌లో కొండజర్త వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో కామ్రేడ్ విమలతోపాటు, సెంట్రీలో ఉన్న కామ్రేడ్ బుద్రి కూడా శతృవును ప్రతిఘటిస్తూ అమరురాలయ్యింది.

కామ్రేడ్ బుద్రి గార్డుగా వుంటూనే సమిష్టి పనుల్లో భాగమయ్యేది. చదువు పట్ల చాలా శ్రద్ధను కనబర్చేది. వ్యక్తిగతంగా చదువు నేర్చుకోవడానికి చాలా కృషి చేసింది. గార్డుగా నాయకత్వ రక్షణ విధిని నిర్వహిస్తూనే, రోజువారీ ఎక్సర్‌సైజ్‌ల్లోనూ, డ్రిల్స్, సమిష్టి అధ్యయనంలో క్రమం తప్పకుండా పాల్గొని, తన రాజకీయ, మిలటరీ జ్ఞానాన్ని మెరుగుపర్చుకున్నది. 2018 సెప్టెంబర్‌లో మన పి.ఎల్.జి.ఎ చేసిన 'ఆపరేషన్ కిడారి' ఘటనలో తన భాగస్వామ్యం కూడా ఉంది. గార్డ్‌గా పని చేస్తున్న క్రమంలో ఈస్ట్ డివిజన్‌లో జరిగిన గుడ్డవాడ, మండపల్లి ఫైరింగ్స్‌లో తన బాధ్యురాలిని అంటిపెట్టుకుని ఉంటూ, నాయకత్వ రక్షణలో తన బాధ్యతను నిర్వహించింది. తనకున్న తెలివితేటలు, చొరవ కారణంగా ప్రజలలో కలుపుగోలుగా వుంటూ, స్థానిక ప్రజల భాషలను నేర్చుకోవడానికి శ్రద్ధగా ప్రయత్నం చేసింది. దళంతో బుద్రి కనిపించకపోతే బుద్రి రాలేదా? అని ప్రజలు అడిగేంతగా ప్రజల్లో తనదైన ముద్రను వేసింది. ఏ.ఒ.బిలో తనకు అలవాటు లేని ఎత్తైన కొండలు, గుట్టలు, తీవ్రమైన శతృ నిర్బంధం మధ్యలో తనకు అనారోగ్యం కొంత ఇబ్బంది పెట్టినా, పట్టుదలగా దాన్ని అధిగమిస్తూ, పార్టీ తనకిచ్చిన బాధ్యతను, నమ్మకాన్ని వమ్ము చేయకుండా తన శక్తి మేరకు బాధ్యతలను నిర్వహించడానికి కృషి చేసింది. ఉద్యమంలోకి వచ్చిన తక్కువ కాలంలోనే గొప్ప చైతన్యాన్ని ప్రదర్శిస్తూ, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా అభివృద్ధి చెందుతున్న క్రమంలో కామ్రేడ్ బుద్రి అమరురాలయ్యింది. వీరి అమరత్వం పార్టీకీ, విప్లవోద్యమానికి ఎంతో నష్టం కలిగించింది. అమరవీరుల ఆశయాలను తుదకంటా కొనసాగిద్దామని శపథం చెస్తూ, కామ్రేడ్ బుద్రికి అరుణారుణ జోహార్లు అర్పిద్దాం!

# నాయకత్వ రక్షణలో ఉత్తమ గార్డ్‌గా తన కర్తవ్యాన్ని నిర్వహిస్తూ అమరుడైన

# కామ్రేడ్ యేమ్ల అజయ్



చత్తీస్‌గఢ్ రాష్ట్రం, బీజాపూర్ జిల్లా (పశ్చిమ్ బస్తర్), గంగులూర్ ఏరియా, తోడ్క గ్రామంలో నిరుపేద ఆదివాసీ కుటుంబంలో కామ్రేడ్ యేమ్ల అజయ్ జన్మించాడు. ముగ్గురు తోబుట్టువులలో అజయే పెద్దవాడు. తోడ్క గ్రామంలో కూడా పార్టీ నేతృత్వంలో భూ పోరాటం జరిగి, పీడిత రైతాంగానికి భూమి దక్కింది. ఈ పేద రైతాంగంలో అజయ్ కుటుంబం కూడా ఒకటి. తల్లిదండ్రులు పార్టీ ఇచ్చిన భూమితో వ్యవసాయ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించారు. పార్టీ ఆధ్వర్యంలో నిర్మాణమైన్న రైతుకూలీసంఘంలో తండ్రి, మహిళా సంఘంలో తల్లి పని చేస్తున్నారు. ఇంట్లో పూర్తిగా విప్లవ వాతావరణం వుండటంతో, అజయ్ కూడా ఆ వైపుగా ఆకర్షితుడైనాడు. తన 7వ ఏటనే బాలల సంఘంలో చేరాడు. సంఘంలో పని చేసన్తానే ఇంటిపనిలో, పొలంపనుల్లో భాగమయ్యేవాడు. దళ అవసరాలు, మిలీషియా రక్షణ వంటి పనుల్లో చురుగ్గా పాల్గొంటూ, ప్రతి పనిలో బాధ్యతగా వ్యవహరించేవాడు.

అజయ్ 2014లో మిలీషియా ప్లటూన్‌లోకి బదిలీ అయ్యాడు. ఈ క్రమంలో శత్రువును నిలువరించేందుకు మిలీషియా ప్లటూన్ నిర్వహించే బూబిట్రాప్స్ పేల్చడం, గొయ్యిలు తవ్వడం, మైన్స్ పెట్టడం, సమీపంలోకి శత్రువు వచ్చినప్పుడు సాయుధంగా శత్రువును ఎదుర్కోవడం వంటి అనేక మిలటరీ చర్యలలో పాల్గొన్నాడు. పార్టీ నిర్వహించే విప్లవ దినాల సమయంలో ప్రచార క్యాంపెయిన్ టీంలలో పాల్గొని, తన వంతు కృషి చేసాడు.

డిసెంబర్ 2, 2016 పి.ఎల్.జి.ఎ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ పిలుపునందుకొని, కామ్రేడ్ అజయ్ పూర్తికాలం కార్యకర్తగా రిక్రూట్ అయ్యాడు. ఆ తర్వాత కొద్ది నెలలు స్థానిక దళంలో పని చేసాడు. 2017 జూన్‌లో పార్టీ, ఉద్యమ అవసరాల రీత్యా అజయ్‌ని ఎ.ఒ.బికి బదిలీ చేసింది. ఎ.ఒ.బిలోని పై కమిటీ నిర్ణయం మేరకు అజయ్ ఎస్.జడ్.సి.ఎమ్ కామ్రేడ్‌కు గార్డుగా నియమించబడ్డాడు. గార్డుగా నాయకత్వ రక్షణ చూస్తూనే, చదువు నేర్చుకున్నాడు. డి.కె నుండి వచ్చే కోయ పత్రికలను నిరంతరం అధ్యయనం చేస్తూ, తన రాజకీయ కృషిని పెంచుకున్నాడు. హిందీ చదువుతూనే ఒడియా నేర్చుకునే ప్రయత్నం చేసాడు. గార్డ్‌గా తన బాధ్యతను నిర్వహించడంలో నాయకత్వ మన్ననలు పొందాడు. సహచర కామ్రేడ్స్‌తో స్నేహపూర్వకంగా మెలిగేవాడు. శత్రువు తలపెట్టే నిత్యనిర్బంధంలో సైతం ఏనాడు ఊగిసలాటకు గురి కాలేదు. అనేక ఫైరింగ్‌లలో నాయకత్వాన్ని అంటిపెట్టుకొని ఉంటూ, తన బాధ్యతను శిరసావహించాడు. నిరంతరం మలేరియా జ్వరం వేందించినప్పటికీ, ఆ బాధను అధిగమిస్తూ, తన కర్తవ్యాలను అమలు చేసే విషయంలో ఏ మాత్రం లోటు రాకుండా చూసేవాడు. తను ఏ పనిలో ఉన్నప్పటికీ, ఓ కంట నాయకత్వాన్ని కనిపెట్టుకొని, వారి రక్షణ బాధ్యతను మరిచేవాడు కాదు. రోజువారి గెరిల్లా విధులలో పాల్గొంటూ, శక్తి మేరకు పని చేసేవాడు. రాజకీయ అధ్యయనంతోపాటు, మిలటరీ డ్రిల్స్‌ను కూడా నేర్చుకోవడానికి ఆసక్తి కనబరిచేవాడు. క్రమశిక్షణ, ధైర్యం, సాహసం, వేగం మొదలైన గెరిల్లా నియమాలను పాటిస్తూ, మంచి కమ్యూనిస్టుగా ఎదిగాడు.

సెప్టెంబర్ 22న పి.ఎల్.జి.ఎ బలగాలు కొండజర్త అటవీ ప్రాంతంలో ఉన్నారనే పక్క సమాచారంతో, గ్రేహౌండ్స్ బలగాలు డేరాను చుట్టుముట్టి, ఫైరింగ్ ప్రారంభించారు. సెంట్రీలో వున్న కామ్రేడ్ విమల, కామ్రేడ్ బుద్రిలు శత్రువును నిలువరిస్తూ అమరులు కాగా, డేరాలో ఉన్న కామ్రేడ్స్ అందరూ కవర్స్‌లోకి వెళ్ళి ప్రతిఘటిస్తూ, రిట్రీట్ అవుతున్న క్రమంలో కామ్రేడ్ అజయ్ శత్రువుపై ఫైరింగ్ చేస్తూ, నాయకత్వాన్ని రక్షించి, భీకరంగా వచ్చే శత్రు తూటాలకు నేలకొరిగాడు.

మంచి కమ్యూనిస్టు లక్షణాలు అలవర్చుకున్న కామ్రేడ్ అజయ్ కలలను నిజం చేద్దాం. పీడిత ప్రజల విముక్తే లక్ష్యంగా శత్రు తూటాలకు తన నులివెచ్చని రక్తాన్ని ధారపోసి, నవయవ్వనాన్ని అర్పించిన యువగెరిల్లాకి వినమ్రంగా తలవంచి శ్రద్ధాంజలి ఘటిద్దాం. B

## శత్రువంటే వెరువని సాహసం, గెరిల్లా జీవితంలో చురుకుదనం, కమ్యూనిస్టు క్రమశిక్షణల మేలు కలయికే

# కామ్రేడ్ దన్ను (కల్మా)



చత్తీష్‌గఢ్ రాష్ట్రం, బీజాపూర్ జిల్లా, (దక్షిణ్‌బస్తర్ డివిజన్) గంగలూర్ ఏరియా, అంద్రి పంచాయితీ, మద్దూమ్ గ్రామంలో కామ్రేడ్ దన్ను జన్మించాడు. దన్ను జన్మించే నాటికే గ్రామంలో విప్లవ ప్రజా రాజ్య కమిటీ బలంగా పని చేస్తున్నది. దన్ను కుటుంబమంతా విప్లవ సంఘాలలో పని చేస్తున్నారు. అతనికి ఇద్దరు తమ్ముళ్ళు, ఇద్దరు అక్కలు ఉన్నారు.

కామ్రేడ్ దన్నుకు 7సంవత్సరాలు వచ్చేనాటికి బాలల సంఘంలో చేరాడు. పొలం పనుల్లో తల్లిదండ్రులకు సహకరిస్తూనే, బాలల సంఘంలో పని చేసేవాడు. సంఘం కర్తవ్యాలను విధిగా నిర్వహించేవాడు. దళానికి కావలసిన అవసరాలు తీర్చడంలో చాలా చురుగ్గా ఉండేవాడు. దన్ను చురుకుదనాన్ని గమనించిన కమిటీ, ఆయనను బాలల సంఘానికి కమాండర్‌గా నియమించింది. ఈ క్రమంలో రాత్రిపూట ఆర్.పి.సి ఆధ్వర్యంలో నిర్వహించే రాత్రిబడిలో చదువు నేర్చుకోవడం ప్రారంభించాడు. పశువులను మేపడానికి వెళ్ళినప్పుడు రాత్రి చెప్పిన చదువును ఎంతో శ్రద్ధతో మననం చేసుకునేవాడు.

2015లో కామ్రేడ్ దన్ను భూంకాల్ మిలీషియాలోకి బదిలీ అయ్యాడు. మిలీషియా విధులను నిర్వహిస్తూనే, పాటలు నేర్చుకోవడానికి మక్కువ చూపేవాడు. స్థానికంగా శత్రువును మట్టుబెట్టడానికి మిలీషియా నిర్వహించే దాడులలో ముందుండేవాడు. బైలాడిల్లా సమీప ప్రాంతంలో కిరండూల్, పిట్టొడిమెట్ట, హిల్‌టాప్‌లలో శత్రు వాహనాలపై దాడి చేసి, వాటిని దగ్ధం చేయడంలో కామ్రేడ్ దన్ను ప్రధాన పాత్ర వహించాడు. దళ మీటింగ్‌ల సమయంలో ప్రొటెక్షన్‌గా వెళ్ళి అనేక రోజులు దళంతో గడిపేవాడు. దళ కామ్రేడ్స్‌నడిగి రాజకీయ విషయాలను తెలుసుకునేవాడు. కొద్దికాలం సి.ఎన్.ఎమ్‌లో పని చేశాడు. పాటలమీద ఉన్న ఇష్టంతో పాట, డాకా చాలా తక్కువ టైంలో నేర్చుకుని ప్రజలనాకర్షించేవాడు.

కామ్రేడ్ దన్ను 2017లో పార్టీలోకి భర్తీ అయ్యాడు. అప్పుడు దన్ను వయస్సు 20 సంవత్సరాలు. పార్టీ దన్నును స్థానిక జనమిలీషియాలో సభ్యుడిగా నియమించింది. జన మిలీషియాలో పని చేస్తున్న క్రమంలో 2018లో ఎ.ఒ.బికి నాయకత్వ రక్షణ కోసం ఏర్పాటు చేసిన ప్రొటెక్షన్ స్క్వాడ్‌లోకి బదిలీ అయ్యాడు. అప్పటికే అతను బి.జి.ఎల్ (బెటాలియన్ గ్రెనేడ్ లాంచర్) గురించి ట్రైనింగ్ అయి ఉండటంతో, పి.ఎస్‌లోకి వచ్చాక ప్రత్యేకంగా అతనికి బి.జి.ఎల్ వెపన్ కేటాయించారు. మిలటరీ పరంగా చురుగ్గా ఉండేవాడు. గెరిల్లాలకు ఉండవలసిన క్రమశిక్షణా నియమాలను విధిగా పాటించేవాడు. గెరిల్లా నియమాలైన సాహసం, వేగం, చలనం, దృఢసంకల్పం కామ్రేడ్ దన్నులో కనిపించేవి.

2019లో జులై 27న చత్తీస్‌గఢ్–ఒడిశా సరిహద్దులోని తిరియా అటవీ ప్రాంతంలో ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్ ద్వారా సమాచారం తెలుసుకున్న శత్రువు, దళాన్ని చుట్టుముట్టి కాల్పులు జరిపాడు. ఈ ఫైరింగ్‌లో కామ్రేడ్ దన్ను చాలా ధైర్యంగా తనదగ్గరున్న బి.జి.ఎల్ సెల్స్‌ను శత్రువుపై ఉపయోగించాడు. అక్కడ నుండి క్షేమంగా రిట్రీట్ అయినప్పటికీ, అదేరోజు మరోసారి తిరియా గ్రామ సమీపంలో మధ్యాహ్నం మళ్ళీ సర్‌ప్రైజ్‌గా శత్రువు దాడి చేయడంతో, కామ్రేడ్ దన్ను ఏ మాత్రం వెనక్కి తగ్గకుండ బి.జి.ఎల్‌తో శత్రువును ప్రతిఘటించాడు. అయితే రిట్రీట్ అవుతున్న క్రమంలో భీభత్సంగా వస్తున్న శత్రు తూటాలకు ఐదుగురి కామ్రేడ్స్‌తో పాటు, కామ్రేడ్ దన్ను అమరుడయ్యాడు.

శత్రువంటే వెరువని సాహసం, గెరిల్లా జీవితంలో చురుకుదనం, కమ్యూనిస్టు క్రమశిక్షణ మొదలైన వాటిని కామ్రేడ్ దన్ను నుండి మనం నేర్చుకుందాం. దన్ను కలలుగన్న నూతన ప్రజాస్వామిక రాజ్యాన్ని నెలకొల్పుదాం.

# మితభాషి, అయితేనేం! కార్యశీలి

# కామ్రేడ్ సుజాత (సిమ్మో)



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, విశాఖ జిల్లా, పెదబయలు ఏరియా, జాడిగూడ గ్రామంలో, కువ్వి తెగకు చెందిన ఆదివాసీ కుటుంబంలో కామ్రేడ్ సుజాత జన్మించింది. తల్లిదండ్రులకు నలుగురు సంతానంలో కామ్రేడ్ సుజాతే పెద్దది. వారు సుజాతకు పెట్టిన పేరు సిమ్మో. సుజాత కుటుంబం వ్యవసాయ కుటుంబం కావడంతో, ఆమె ఇంటిపనులతో పాటు, పొలం పనుల్లో భాగమయ్యేది. ఇంటికి పెద్దబిడ్డ కావడంతో అన్నింటిలో తల్లిదండ్రులకు నేనున్నాననే భరోసా కల్పించేది.

ఆ ప్రాంతంలో, పార్టీ బలంగా వున్న గ్రామాలలో జాడిగూడ ఒకటి. అక్కడ పార్టీ నిర్మాణంతోపాటు, విప్లవకర ప్రజానిర్మాణాలన్నీ బలంగా ఉన్నాయి. ఈ నిర్మాణాల ఆధ్వర్యంలో ప్రజలు అనేక పోరాటాలు నిర్వహించి విజయాలు సాధించారు. కామ్రేడ్ సుజాతకు ఊహ తెలిసేనాటికే, ఈ సంఘటనలన్నీ జరుగుతుండటంతో, ఇవి ఆమెలో చైతన్యవంతమైన భావాలు పుట్టి పెరగడానికి పునాదిగా పని చేశాయి. ఈ క్రమంలో స్థానిక దళం గ్రామ సమీప అటవీ ప్రాంతంలోకి వచ్చినప్పుడు తన తోటివాళ్లతో కలిసి దళాన్ని కలిసేది. దళ అవసరాలను తీర్చడంలో మిలీషియాతో పాటు, భాగమయ్యేది. పార్టీ చేపట్టే ప్రత్యేకమైన మార్చి 8 అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినం, జులై 28 అమరుల వారోత్సవాలు, డిసెంబర్ 2 పి.ఎల్.జి.ఎ ఆవిర్భావ వేడుకలు మొదలైన వారోత్సవాలలో ఉత్సాహంగా పాల్గొనేది. పార్టీ చేపడుతున్న ఈ కార్యక్రమాలన్ని కామ్రేడ్ సుజాతను సహజంగానే సాయుధ పోరాటంలోకి అడుగులు వేసేలా దోహదపడ్డాయి.

కామ్రేడ్ సుజాత 2017 ప్రారంభంలో పార్టీలోకి పూర్తికాల కార్యకర్తగా రిక్రూట్ అయ్యింది. స్థానిక పెదబయలు ఏరియా దళంలో చేరింది. తను రిక్రూట్ అయ్యేనాటికి తన వయస్సు 17 సంవత్సరాలు. కామ్రేడ్ సుజాత మితభాషి, ఎవరితోనూ గల గలా మాట్లాడకపోయినా, అందరితో కలిసి అన్ని పనుల్లో పాలుపంచుకునేది. అప్పటివరకు చదువంటే ఏమిటో తెలియని సుజాత చదువు నేర్చుకోవడానికి కుతుహలంగా వుండేది. దళం రోజువారి కార్యక్రమాలలో భాగంగా నిర్వహించే స్కూల్‌లో చురుగ్గా పాల్గొంటూ, చదువు నేర్చుకోవడం ప్రారంభించింది. స్థానిక దళ కార్యకలాపాలలో తన వంతు పాత్ర నిర్వహించేది. పనుల రీత్యా గ్రామాలలోకి వెళ్ళినప్పుడు తనతోటి చెల్లెమ్మలతో తెలుగు, కువ్వి, ఒడియా భాషలలో మాట్లాడేది.

2018 జూన్‌లో, పార్టీ, కామ్రేడ్ సుజాతని నాయకత్వ రక్షణకు ఏర్పాటు చేసిన ప్రొటెక్షన్ స్క్వాడ్‌లోకి బదిలీ చేసింది. ఈ బాధ్యతను సుజాత మనస్ఫూర్తిగా స్వీకరించింది. తన దళంలోని కామ్రేడ్స్ ఎక్కువ మంది కోయ కామ్రేడ్స్ కావడంతో కోయ భాషను కూడా నేర్చుకుని, వారితో కోయలో మాట్లాడేది. అప్పటికే ప్రారంభించిన తన చదువును పి.ఎస్‌లోకి వచ్చాక మరింత మెరుగుపర్చుకుంది. సైనిక క్రమశిక్షణలో ఒకటైన కమాండర్ కాషన్‌ను తు.చ తప్పక పాటించేది. సమిష్టి పనులు, సెంట్రీలు, పెట్రోలింగ్ మొదలైన పనులలో విధిగా పాల్గొనేది. మలేరియా జ్వరం వచ్చిన సందర్భాల్లో బాధ్యతతో మందులడిగి వేసుకునేది. తొందరగా జ్వరం నుంచి బయటపడి పనుల్లోకి వెళ్ళాలనే ఆతృతను కనబర్చేది. సమిష్టి బరువులు మోయడంలో చైతన్యవంతంగా వ్యవహరించేది. "నీకు అవసరమైనంత తిను, నీ శక్తికొలది పని చేయి" అన్న కమ్యూనిస్టు నియమాన్ని కామ్రేడ్ సుజాత ఆచరణలో పెట్టేది.

**తరువాయి భాగం 40వ పేజీలో...**

### దండకారణ్యంలో ఉదయించి, ఎ.ఒ.బిలో ప్రకాశించిన యువ క్రాంతి కిరణం

# కామ్రేడ్ భూమాల్



చత్తీస్‌గఢ్ రాష్ట్రం, దర్భ డివిజన్, మలింగేర్ ఏరియా, ఆల్‌నార్ గ్రామంలో నిరుపేద ఆదివాసీ కుటుంబంలో కామ్రేడ్ భూమాల్ పురుడుబోసుకున్నాడు. తను పుట్టే నాటికే దండకారణ్యంలోని ప్రజలు విప్లవోద్యమం అందించిన చైతన్యంతో పాత వ్యవస్థను ధ్వంసం చేస్తూ, నూతన వ్యవస్థ నిర్మాణ దిశగా అడుగులు వేస్తున్నారు. దండకారణ్యంలోని విశాల ప్రాంతంలో ఆధిపత్య శక్తుల నుంచి భూమితోపాటు, అధికారాన్ని కూడా గుంజుకొని జనతన సర్కార్లను నిర్మించడం కూడా ప్రారంభించారు. విప్లవోద్యమం ఇచ్చిన ఈ ఉన్నతమైన చైతన్యంతోనే అనేక మంది యువత దేశాన్ని విముక్తి చేయాలనే లక్ష్యంతో దండకారణ్య సరిహద్దులను దాటి భారతదేశంలోని విశాల అటవీ, మైదాన ప్రాంతాలకు ఉద్యమ నిర్మాణం కోసం వెళుతున్నారు. వీరి చైతన్యాన్ని, అభివృద్ధిని సహించని దోపిడీ రాజ్యం దండకారణ్యంలో వందల కొలది క్యాంపులతో, వేల సంఖ్యలో పోలీసు బలగాలతో తెల్ల బీభత్సాన్ని సృష్టిస్తున్నది. వీటన్నింటిని ప్రత్యక్షంగా చూస్తూనే కామ్రేడ్ భూమాల్ పెరిగి పెద్దవాడయ్యాడు. తల్లిదండ్రులకు ఐదుగురి సంతానంలో ఇతను నాల్గవవాడు. ఇతనికి 10 సంవత్సరాల వయస్సు వచ్చేనాటికి తల్లిదండ్రులు చనిపోయారు. అప్పటికే తన అన్న సంఘంలో పని చేస్తున్నాడు. ఆడిపాడే వయస్సులోనే శత్రు నిర్బంధాన్ని చవిచూసాడు. ఈ ప్రాంతంలో అందరిలాగానే భూమాల్ కూడా చిన్నవయస్సులోనే బాలల సంఘంలో చేరాడు. తన పని విధానాన్నీ, చురుకుదనాన్ని గమనించిన పార్టీ, భూమాల్‌ను తక్కువ సమయంలోనే మిలీషియాలోకి బదిలీ చేసింది.

మిలీషియాలో పని చేస్తున్న క్రమంలో పార్టీ చేపట్టే ఏ కార్యక్రమాలలోనైనా కామ్రేడ్ భూమాల్ ముందుండేవాడు. శత్రు సమాచారాన్ని పార్టీకి చేరవేయడానికి పంపినప్పుడు, ఎంత దూరమైనా నడిచివెళ్ళి చెప్పేవాడు. ఈ క్రమంలోనే చేతన్ నాట్య మంచ్ నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలకు ఆకర్షితుడై, అందులో పని చేస్తానని పార్టీకి ప్రతిపాదించాడు. దీంతో పార్టీ భూమాల్‌ను సి.ఎన్.ఎమ్‌లోకి బదిలీ చేసింది. ఇందులో పని చేస్తూ, సి.ఎన్.ఎమ్ నిర్వహించే కార్యక్రమాలలో తన వంతు పాత్ర వహించాడు. ఆట, పాటలను పట్టుదలతో నేర్చుకొని, తన కళను ప్రజల ముందు ప్రదర్శించేవాడు. ఇలా రెండు సంవత్సరాల పాటు సి.ఎమ్.ఎమ్‌లో కొనసాగాడు.

2017 డిసెంబర్ 2, పి.ఎల్.జి.ఎ ఆవిర్భావ వేడుకల సందర్భంగా పార్టీ పిలుపునందుకొని, కామ్రేడ్ భూమాల్ పూర్తికాల కార్యకర్తగా రిక్రూట్ అయ్యాడు. స్థానిక మలింగేర్ ఏరియా ఎల్.జి.ఎస్‌లో ఒక సంవత్సరం పాటు పని చేశాడు. ఇందులో ఉ ంటున్న క్రమంలో ఒకరోజు కమాండర్ “పార్టీలోకి ఏం చేద్దామని వచ్చావ్ కామ్రేడ్” అని అడిగిన ప్రశ్నకు “దోపిడోళ్ళ నుంచి కొండలలో ఉన్న సంపదను కాపాడటం కోసం వచ్చాను” అని చాలా హుషారుగా సమాధానం చెప్పాడు. అప్పటికి తన వయస్సు 16 సంవత్సరాలు. తను చెప్పిన ఈ సమాధానానికి కామ్రేడ్స్ అందరూ నవ్వుతూ భూమాల్‌ను అభినందించారు.

2018 నవంబర్‌లో కామ్రేడ్ భూమాల్‌ని పార్టీ ఎ.ఒ.బికి బదిలీ

చేసింది. పార్టీ అవసరాల రీత్యా ఇతన్ని ఎస్.జడ్.సి నాయకత్వ కామ్రేడ్‌కి గార్డ్‌గా నియమించింది. అందుకు సంతోషంగా ఒప్పుకొని తన పనిని ప్రారంభించాడు. ఈ క్రమంలో ముఖ్యంగా నాయకత్వ రక్షణ చూస్తునే, రోజువారి సమిష్టి పనుల్లో భాగస్వామి అయ్యేవాడు. సమయానికి స్కూల్‌కి వెళ్ళి తన మెదడుకు పని పెట్టేవాడు. సహచర కామ్రేడ్స్‌తో కొత్త పాత అనే తేడా లేకుండా ప్రేమతో కలిసిపోయేవాడు. తన బాధ్యుడు కొన్ని సందర్భాలలో తనకు చెప్పకుండా ఎక్కడికైనా వెళ్తున్నప్పుడు "నాకు చెప్పాలిగా దాదా, నీ రక్షణ బాధ్యత నాదేకదా" అంటూ గుర్తుచేసేవాడు. చిన్నతనం నుంచే కామ్రేడ్ భూమాల్‌కు వాచీలు, బ్యాటరీలు, టార్చిలైట్స్ మొదలైన వాటిని విప్పడం, ఫిట్ చేయడంలో ఆసక్తి కనబరిచేవాడు. దీంతో తనకు రిపేర్ వాచ్‌గానీ, రిపేర్ టార్చిగానీ ఏది కనబడ్డా, తన మెకానిజంతో బాగుచేసేవాడు. వర్షాకాలంలో ఎవరి గొడుగు విగిరినా, చెడిపోయినా అక్కడ మొదట కనిపించేది కామ్రేడ్ భూమాలే.

సెప్టెంబర్ 2019లో పార్టీ అవసరాల రీత్యా తన బాధ్యుడితో పాటు కామ్రేడ్ భూమాల్ ఈస్ట్ డివిజన్‌కు వెళ్ళాడు. అయితే అక్కడ ఒక ఇన్‌ఫార్మర్ ఇచ్చిన సమాచారంతో సెప్టెంబర్ 22న కొండజర్త గ్రామం వద్ద పోలీసులు అకస్మాత్తుగా మన డేరాపై, అన్ని వైపుల నుంచి దాడి చేసారు. ఈ సందర్భంగా కామ్రేడ్ విమల, కామ్రేడ్ బుద్రి, కామ్రేడ్ అజయ్‌లు పోలీసులతో వీరోచితంగా పోరాడుతూ అమరులు కాగా, కామ్రేడ్ రమేష్, కామ్రేడ్ భూమాల్‌లు అక్కడి నుంచి తప్పుకొని, ఆర్.వి స్థలానికి వెళ్ళారు. అయితే ఆ మరుసటి రోజు పోలీసులు ఆర్.వి పెట్టుకున్న ఫేములగొంది గ్రామాన్ని చుట్టిముట్టి రమేష్, భూమాల్‌లను పట్టుకొని కౄరంగా హింసించి కాల్చి చంపారు.

దండకారణ్యంలో ఉదయించి, ఎ.ఒ.బిలో ప్రకాశించిన ఈ యువ కిరణం అమరత్వాన్ని ఎత్తిపడదాం! అమరుడు కామ్రేడ్ భూమాల్ కలలను నిజం చేద్దాం!

---

**38వ పేజీ తరువాయి భాగం...**

2019 జులైలో, ఉద్యమ అవసరాల కోసం, నాయకత్వంతోపాటు ప్రొటెక్షన్ స్క్వాడ్ కూడా చత్తీస్‌గఢ్-ఒడిశా సరిహద్దు ప్రాంతానికి వెళ్ళింది. అక్కడ దళం తిరియా గ్రామ అటవీ ప్రాంతంలో మకాం వేసినప్పుడు శత్రువు ఏర్పాటు చేసిన నెట్‌వర్క్ ద్వారా దళ సమాచారం శత్రువుకు చేరింది. జులై 27నాడు ఉదయం 10గం॥ల సమయానికి చత్తీస్‌గఢ్ బలగాలు, దళం వున్న ప్రాంతాన్ని చుట్టుముట్టాయి. శత్రు బలగాలను గమనించి, సెంట్రీలో ఉన్న కామ్రేడ్ ముందుగానే ఫైరింగ్ చేసాడు. అప్పటికే దూసుకొస్తున్న శత్రువును డేరాలో ఉన్న కామ్రేడ్స్ ఫైరింగ్ ద్వారా నిలువరించి క్షేమంగా రిట్రీట్ అయ్యారు. మధ్యాహ్నం వరకు నడిచి అదే అటవీ ప్రాంతంలో ఒకచోట ఆగారు. 2గం॥ల సమయానికి తిరిగి నడక ప్రారంభించారు. దళానికి ఫ్లాంక్‌లో వస్తున్న శత్రు బలగాలు తారసపడటంతో, తిరిగి మళ్ళీ ఫైరింగ్ ప్రారంభమైంది. ఊహించని విధంగా జరిగిన ఈ శత్రు దాడిలో ఆరుగురు కామ్రేడ్స్ అమరులయ్యారు. ఈ ఆరుగురు కామ్రేడ్స్‌లో కామ్రేడ్ సుజాత కూడా శత్రువలయంలో చిక్కుకుపోవడంతో, పోలీసుల కాల్పులకు నేలకొరిగింది.

మన్యం పోరాట వారసురాలు, జాడిగూడ పోరుపుష్పం కామ్రేడ్ సుజాతకు వినమ్రంగా జోహార్లర్పిద్దాం. పీడిత ప్రజల విముక్తే లక్ష్యంగా పని చేస్తూ, శత్రు తూటాలకు బలైన కామ్రేడ్ సుజాత ఆశయాలను ముందుకు తీసుకుపోదాం.

---

"ఒక వ్యక్తి విప్లవ కార్యకర్త అవునా కాదా అని ఎలా తెల్చకోగలం?... దీనికి ఒకటే కొలమానం. ఆ వ్యక్తి విశాల కార్మిక, రైతాంగ ప్రజలతో సమైక్యం కావడానికి ఇష్టపడుతున్నాడా లేదా అన్నదే. అలా ఉండటానికి ఇష్టపడుతుంటే, అలా నిజంగా చేస్తూ ఉంటే ఆ వ్యక్తి విప్లవకరంగా వున్నట్టు. లేకపోతే విప్లవ రహితంగా ఉన్నట్టు. లేదా విప్లవ ప్రతీఘాతుకంగా ఉన్నట్టు."

- (మావోసేటుంగ్, ఎంపిక రచనలు 2వ సంపుటి 'యువత ఉద్యమ దృక్పథం' ఫారిన్ లాంగ్వేజెస్ ప్రెస్, పెకింగ్ 1967 పు. 246)

## జులై 28 అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను గ్రామగ్రామాన జరుపుకున్న విప్లవ ప్రజానీకం

1972 జులై 28న భారత విప్లవనేత కా(మ్రేడ్ చారుమజుందార్‌ను కేంద్ర, రాష్ట్ర ఫాసిస్టు ప్రభుత్వాలు అత్యంత కిరాతకంగా హత్య చేశాయి. ఆ దినాన్ని మనం గత మూడు దశాబ్దాలుగా అమరుల సంస్మరణ దినంగా నిర్వహిస్తూ వస్తున్నాము. గత కొన్ని సంవత్సరాలుగా సంస్మరణ వారోత్సవాలుగా కూడా జరుపుకుంటున్నాము. ఈ సారి కూడా పీడిత ప్రజల విముక్తికోసం దోపిడీ వర్గాలకు వ్యతిరేకంగా అత్యంత సాహసంతో, మొక్కవోని ధైర్యంతో పోరాడుతూ, తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన కామ్రేడ్స్‌ను స్మరించుకున్నాము.

జులై 2018 నుంచి జులై 2019 వరకు ఆంధ్ర-ఒడిశా సరిహద్దులో శత్రువు అమలు జరిపిన క్రూరమైన హంతకదాడిలో 15 మంది వృత్తివిప్లవకారులు అమరులు కాగా, ఐదుగురు సాధారణ ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. వృత్తివిప్లవకారులుగా సీనియర్ మహిళా కామ్రేడ్స్ మల్కనగిరి-కొరాపూట్-విశాఖ సరిహద్దు డివిజన్ కమిటీ సెక్రటేరియట్ సభ్యురాలు కామ్రేడ్ మీనా, జిల్లా కమిటీ సభ్యురాలు కామ్రేడ్ రింకీ; ఏరియా కమిటీ సభ్యులు కామ్రేడ్స్ కీర్తి, దాస్, క్రాంతి, క్రిష్ణ, సుశీల, అడ్మాల్ (ప్రమాదంలో), స్వేత, సొమ్లు; పార్టీ సభ్యులు కామ్రేడ్స్ సున్ని, గీత, మంగు, శాంతి, సుజాత, దన్నులు అమరులయ్యారు. వీరంతా ఎ.ఒ.బి ఉద్యమంలో వివిధ స్థాయిలలో కీలకమైన పాత్ర పోషించి, ఏటికి ఎదురీదిన, ఉక్కు సంకల్పం కలిగిన దృఢమైన కమ్యూనిస్టు యోధులు, యోధురాళ్ళు. వీరి అమరత్వం ఉద్యమానికి తీరని నష్టం. వీరు నడిచిన దారి, అందించిన నాయకత్వం విప్లవ శ్రేణులకూ, ప్రజలకు విప్లవ గమ్యం దిశగా మార్గదర్శకత్వాన్ని అందించాయి. ఈ అమరులతో పాటు, భారత విప్లవోద్యమంలో అసువులు బాసిన అమరులందరిని స్మరించుకుంటూ, జులై 28 నుంచి ఆగస్టు 5 వరకు అమరుల వారోత్సవాలను జరపాలని డివిజన్ కమిటీ కార్యక్రమం రూపొందించుకుంది. పోస్టర్స్, బ్యానర్స్, క్యాంపెయిన్ టీంల ద్వారా డివిజన్‌లోని అన్ని గ్రామాలలో ప్రచారం నిర్వహించింది. అయితే ఈ వారోత్సవాలు ప్రజలలో విప్లవ స్ఫూర్తిని నింపుతాయనే భయంతో శత్రువు చాలా ముందు నుండే పెద్ద ఎత్తున బలగాలను మోహరించి, గాలింపు చర్యలు చేపట్టి, ప్రజలను భయభ్రాంతులకు గురి చేయాలని చూసాడు. దీనికి తోడు ఆ సమయంలో ఎడతెరిపిలేని భారీ వర్షాలు కురవడంతో, వరదలవల్ల గ్రామాల మధ్య సంబంధాలు తెగిపోయాయి. అయినప్పటికీ, ప్రజలు పోలీసు కూంబింగ్‌లనూ, భారీ వర్షాలను లెక్క చేయకుండా, ఎక్కడికక్కడ గ్రామాలలో అమరుల సంస్మరణ సభలు జరిపారు.

* మల్కనగిరి జిల్లా, కటాఫ్ ఏరియా, ఒంద్రపల్లి సమీపంలో కామ్రేడ్ మీనా స్మారక స్థూపాన్ని, నిర్మించి 300 మంది ప్రజలు స్థూపాన్ని ఆవిష్కరించి, సభ జరిపి శ్రద్ధాంజలి ఘటించారు.

* పనసపుట్ పంచాయితీలో సుమారు 10 గ్రామాల ప్రజలు భోరున కురుస్తున్న వర్షం మధ్యనే 400 మంది ఊరేగింపుగా వెళ్ళి, అమరుల స్థూపం వద్ద సంస్మరణ సభను జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రజలు 14వేల రూ॥లు విరాళంగా యివ్వగా, వాటిని స్థూపానికి రక్షణగా కంచె వేయాలని నిర్ణయించి అమలు చేశారు.

* జోడాంబ పంచాయితీలోని దార్లబెడ వద్ద నిర్మించిన రాంగూడ అమరుల హాలు వద్ద సభను అడ్డుకోవడానికి పోలీసులు కుంతిలిపొద్దార్‌లో చాలా ముందన్తగానే బలగాలను మోహరించారు. ఈ విషయం గమనించిన ప్రజలు, శత్రువు కళ్ళుగప్పి 30 సెంట్రీ పోస్టులు, అనేక పెట్రోలింగ్ బ్యాచీలు ఎంగేజ్ చేసి, సుమారు 10 గ్రామాలకు చెందిన 480 మంది ప్రజలు, ఎడతెరిపి లేకుండా పడుతున్న వర్షం మధ్యనే అమరుల హాలు వద్ద ఎర్రజెండా ఎగురవేసి, విప్లవ గీతాలు ఆలపించి, అమరులను స్మరించుకుంటూ శ్రద్ధాంజలి ఘటించారు.

* రంగబయలు పంచాయితీ, కొసంపూట్ ప్యాకెట్‌లోని 8 గ్రామాలకు చెందిన 300 మంది ప్రజలతో, నక్కమామిడి పంచాయితిలోని అమ్లిబెడలో సుమారు 500 మంది ప్రజలతో, బూసిపుట్ పంచాయితీలో 200 మంది ప్రజలతో అమరుల సంస్మరణ సభలు పోలీసుల కూంబింగ్‌లను ధిక్కరించి, భారీ వర్షాలను లెక్క చేయకుండా విజయవంతం చేశారు.

* విశాఖపట్నం జిల్లా, పెదబయలు ఏరియాలో వారోత్సవాలకు వారం రోజులు ముందే వందలాది గ్రేహౌండ్స్ బలగాలతో గాలింపులు ప్రారంభించి, అమరుల సంస్మరణ వారోత్సవాలు జరగకుండ అడ్డుకోవాలని శతవిధాల ప్రయత్నాలు చేశారు. పార్టీ-ప్రజలచేతిలో శిక్షించబడిన ప్రజా వ్యతిరేకులనూ, పోలీసు ఏజెంట్లను అమరులగా కీర్తిస్తూ, పోలీసులు మండల సెంటర్‌లలో, సంతలలో పోస్టర్స్ వేయడం , జులై 28న రాత్రికి రాత్రే ప్రజలకు తెలియకుండ రెడిమేడ్ తెల్లగుడ్డ స్థూపాలు నిర్మించారు. ప్రజలు మావోయిస్టు అమరుల సంస్మరణ సభలలో పాల్గొనవద్దని హెచ్చరికలు జారీ చేశారు. వీటిని ప్రజలెవరూ పట్టించుకోకుండా వారం రోజుల ముందు నుండే అనేక ప్రచార దళాలు ఏరియాలోని గ్రామ గ్రామాన తిరుగుతూ, పోస్టర్లు, కరపత్రాలు, సభల ద్వారా విస్తృతంగా ప్రచారం చేశారు. కుండపోతగా కురుస్తున్న వర్షాలను లెక్క చేయకుండ నదులను దాటుకొని వెళ్ళి 5, 10 గ్రామాల ప్రజలు కలిసి సభలు జరుపుకున్నారు. అందులో భాగంగా గిన్నెలకోట గ్రామం వద్ద 250 మంది ప్రజలు విప్లవ రైతు కూలి సంఘం నాయకత్వంలో ఊరేగింపు జరిపి, అమరుల సంస్మరణ సభను జరుపుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులు విప్లవ ప్రతీఘాతుకుల్ని అమరులుగా గుర్తింపజేయాలని చేసిన అత్యంత హేయమైన, నీచమైన ప్రయత్నాన్ని ప్రజలు తమ నిజమైన ప్రజావీరులకు సంస్మరణలు జరుపుకోవడం ద్వారా తిప్పికొట్టారు.

★ జాముగూడ పంచాయితీ, చింతలవీధి గ్రామంలో సుమారు 6 గ్రామాలకు చెందిన 400 మంది ప్రజలు, గిన్నెలకోట పంచాయితీ, అంబ్రిపడలో 10 గ్రామాలకు చెందిన 500 మంది ప్రజలు కలిసి అమరుల సంస్మరణ సభలను జరుపుకోగా, ఎక్కడికక్కడ అనేక గ్రామాలలో ప్రజలు కలిసి అమరులను స్మరించుకున్నారు.

★ అక్టోబర్ 24, రాంగూడ అమరుల సంస్మరణ దినాన్ని స్థానిక ప్రజలు విడిగా జరుపుకున్నారు. అందులో భాగంగా జొంత్రి పంచాయితీలోని తోటగూడ గ్రామంలో రాంగూడ అమరుల పేరుతో నిర్మించిన స్మారక భవనం వద్ద సుమారు 6 గ్రామలకు చెందిన 300 మంది ప్రజలు, తాబేరు గ్రామ పాకెట్ పరిధిలో 250 మంది ప్రజలు, రాంగూడ అమరులనూ, వారి త్యాగాలనూ, పోరాట స్ఫూర్తిని ఎత్తిపడుతూ, ఊరేగింపులు చేసి, సంస్మరణ సభ జరిపి, అమరులైన కుటుంబాలను ఆదుకుంటామని నిర్ణయించుకున్నారు.

ఈ సంస్మరణ సభలు ప్రజలను అమరుల బాటలో పయనించేలా గొప్ప విప్లవ స్ఫూర్తిన్ని కలిగించాయి. అలాగే ప్రపంచ పీడిత ప్రజల శత్రువులైన సామ్రాజ్యవాదులు, వారి తాబేదారులు ఎంతటి శిథిలావస్థకు చేరుకున్నప్పటికీ, వారిని పూర్తిగా ధ్వంసం చేసేందుకు అపారమైన త్యాగాలు అవసరమనే సత్యాన్ని, ఈ సభల ద్వారా అవగతం చేసుకున్నారు.

**కటాఫ్ ఏరియాలో విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలంటూ ఆందోళన బాట పట్టిన విద్యార్థులు, ప్రజలు**



వర్షం నీటితో వసతీ గృహాలు, పాకర పట్టిన బాత్‌రూమ్‌లు... వగైరా సమస్యలతో పనసపుట్ పాఠశాల అందుకు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

ఒడిశా ప్రభుత్వం రాష్ట్రంలో అధిక అక్షరాస్యతను సాధించామని ప్రగల్భాలు పలుకుతుంటే, ప్రభుత్వ మానస పుత్రికలైన పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా దానికి వంత పాడుతున్నాయి. కానీ వాస్తవం ఏమిటంటే నేటికీ వెనుకబడిన ఆదివాసీ ప్రాంతాలలో అక్షరాస్యత 10-15 శాతానికి మించలేదంటే అతిశయోక్తికాదు. మల్కనగిరి జిల్లా, చిత్రకొండ బ్లాక్, విచ్ఛింనాచల్ (కటాఫ్ ఏరియా)లో 9 పంచాయితీల పరిధిలో నేటికీ ఒక్క హైస్కూల్ కూడా ఏర్పాటు చేయలేదు. కొన్ని గ్రామాలలో ప్రాథమిక పాఠశాలలున్నా, అవి ఏనాడు పని చేసింది లేదు. ఉపాధ్యాయుల కొరతతోపాటు, ఉన్న ఉపాధ్యాయులు కూడా విధులకు హాజరు కాకపోయినా, పట్టించుకునే నాథుడే లేడు. శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనాలు పశువులకు, పందులకు ఆవాసాలుగా మారాయి. పేరుకు కొన్ని హాస్టల్స్ పెట్టినా, అందులో ఏనాడు పిల్లలకు సరైన ఆహారం, వసతి సౌకర్యం లేక మూలనపడ్డాయి. ఈ నిర్లక్ష్యపూరిత వైఖరిని ప్రభుత్వం కావాలనే చేపట్టింది. మరోవైపు పీడిత ప్రజలకు అందుబాటులో లేని ప్రైవేటు విద్యను ప్రోత్సహిస్తున్నది.

కటాఫ్ ఏరియా ప్రజలు అనేక సంవత్సరాలుగా ఈ ప్రాంతం ఎదుర్కొంటున్న విద్యా సమస్యను అనేకమార్లు అధికారుల దృష్టికి తీసుకుపోయారు, ఆందోళనలు చేశారు. అయినా ప్రభుత్వ వైఖరిలో మార్పు రాలేదు. పైగా ప్రభుత్వం 'రవాణా వ్యవస్థ సరిగా లేదనీ, గురుప్రియ బ్రిడ్జిని నిర్మిస్తే ఈ ప్రాంతంలో ఈ సమస్యతోపాటు, ప్రజలు ఎదుర్కొనే అనేక సమస్యలు పరిష్కారం అవుతాయని' పొంతనలేని ప్రకటనలు చేస్తూ వచ్చింది. తర్వాత కాలంలో గురుప్రియ బ్రిడ్జిని నిర్మించి ఈ ప్రాంతాన్ని 'స్వాభిమానాంచల్'గా ముఖ్యమంత్రి నవీన్‌పట్నాయక్ ప్రకటించాడు. కానీ వాస్తవంలో జరిగిందేమిటంటే ఆ ప్రాంతంలో అభివృద్ధి (విద్యా, వైద్యం) పనులు జరగకపోగా, పోలీసు క్యాంపులు పెరిగి, నిర్బంధం తీవ్రతరమైంది. ఈ కుట్రను ప్రారంభంలోనే ప్రజలు అర్థం చేసుకొని వ్యతిరేకించినప్పటికీ, నవీన్ ప్రభుత్వం సాయుధ బలగాలను వినియోగించి, బలప్రయోగం ద్వారా గురుప్రియ బ్రిడ్జిని నిర్మించి, దాడిని తీవ్రతరం చేసింది. ఈ నేపథ్యంలో ఈ ప్రాంతంలోని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సమావేశమై, ఈ క్రింది డిమాండ్‌లను రూపొందించారు.

1. ప్రతి పంచాయితీకి ఒక హైస్కూల్‌తోపాటు, హాస్టల్ సౌకర్యం కల్పించాలి.

2. ప్రస్తుత హాస్టల్స్‌లో సౌకర్యాలను మెరుగుపర్చాలి.

3. నూతన పాఠశాల భవనాలను నిర్మించాలి.

4. ప్రస్తుత పాఠశాలలో టీచర్స్ కొరతను వెంటనే భర్తీ చేయాలి.

5. ఉపాధ్యాయులు స్థానికంగానే వుంటూ, రెగ్యులర్‌గా స్కూల్స్‌కు హాజరు కావాలి.

పై డిమాండ్‌లతోపాటు, ఇతర సమస్యలను కూడా జోడించి సెప్టెంబర్ 22న జొడాంబ, పనసపూట్, జొంత్రి, ఒండ్రపల్లి, నక్కమామిడి పంచాయితీలకు చెందిన విద్యార్థులు, ప్రజలు కలిసి, సుమారు 3వేల మంది మల్కనగిరిలోని కలెక్టర్ కార్యాలయం ముందు ర్యాలీ నిర్వహించడానికి బయలుదేరారు. ఈ సమాచారం అందుకున్న జిల్లా ఎస్.పి తమ అంగ, ఆయుధ బలంతో చిత్రకొండ సమీపంలోని స్పీల్‌వే వద్ద అందరిని అడ్డుకున్నాడు. ప్రజలు అక్కడే ఆందోళనకు దిగడంతో సబ్‌కలెక్టర్ చర్చలకు దిగివచ్చాడు. కలెక్టర్ జిల్లాలో అందుబాటులో లేరనీ, మీ సమస్యలను ప్రభుత్వం చర్చించి పరిష్కరించడానికి సిద్ధంగా వుందనీ, 10 రోజుల తర్వాత ఒక ప్రతినిధి బృందం కలెక్టర్‌ను కలువమని విజ్ఞప్తి చేశాడు. అయితే ప్రజలు పోలీసు వ్యవహరించిన తీరును నిరసిస్తూ, సబ్‌కలెక్టర్ ప్రతిపాదనను తోసిపుచ్చారు. 15 రోజుల తర్వాత విద్యార్థుల ప్రధాన డిమాండ్‌లను ఆమోదిస్తూ, ప్రభుత్వం ఈ క్రింది ఉత్తర్వులు జారీ చేయక తప్పలేదు.

1. పంచాయితీకి ఒక హైస్కూల్, హాస్టల్ చొప్పున అన్ని పంచాయితీలకు మంజూరు చేయడం,

2. భవన నిర్మాణాలు చేయడం,

3. ప్రస్తుతం నడుస్తున్న పాఠశాలలకు ఉపాధ్యాయులను కేటాయించడం,

4. హాస్టల్ వసతులలో మెరుగుదలను చేపట్టడం

ఈ విజయాన్ని విద్యార్థులు, ప్రజలు సమైక్యంగా పోరాడి సాధించుకున్నారు.

## సెప్టెంబర్ 14న జితేన్‌దాస్ వర్ధంతిని రాజకీయ ఖైదీల హక్కుల దినంగా పాటిస్తూ జరిపిన బహిరంగ సభ

కేంద్రంలో బ్రాహ్మణీయ హిందూ ఫాసిస్టు బి.జె.పి అధికారం చేపట్టిన వెంటనే విప్లవకారులు, ప్రజాస్వామికవాదులు, హేతువాదులు, దళితులు, ఆదివాసీలు, మహిళలు, ముస్లీం మైనారిటీలు మొదలైన వారిపై దాడులు, హత్యలు, అక్రమ అరెస్టులు ప్రారంభమైనాయి. ప్రజాస్వామికవాదుల, బుద్ధిజీవుల భావ ప్రకటనా స్వేచ్ఛను హరించివేసేందుకు అర్బన్ నక్సలైట్‌ల పేరుతో తప్పుడు కేసులు బనాయించి, వారిని జైళ్ళలో నిర్బంధిస్తున్నది. ఉపా నల్లచట్టాన్ని మరింత కఠినతరం చేసింది. ఎన్.ఐ.ఎకు ఉద్యమకారుల ఆస్తులను స్వాధీనం చేసుకునేలా చట్టంలో మార్పు తెచ్చింది. జైళ్ళను నరక కూపాలుగా మార్చింది. రాజకీయ ఖైదీలకు ఎలాంటి హక్కులు లేకుండా చేసి, వారికి కనీస అవసరాలను కూడా అందించడం లేదు. కేసులు సకాలంలో విచారణ జరుపకుండా, బెయిల్స్ యివ్వకుండా ఏళ్ళకి ఏళ్ళు జైళ్ళలో నిర్బంధించి, వారి ప్రాణాలతో చెలగాటమాడుతున్నది. ముఖ్యంగా ఎ.ఒ.బి ప్రాంతంలో, నూతన



**సెప్టెంబర్ 14 జతిన్‌దాస్ వర్థంతి సందర్భంగా ర్యాలీ నిర్వహించి, సభ జరుపుకున్న పెదబయలు ఏరియా ప్రజలు**

ప్రజాస్వామిక విప్లవంలో భాగంగా జరుగుతున్న ఆదివాసీ రైతాంగ ఉద్యమంపై అమలవుతున్న ఫాసిస్టు నిర్బంధకాండలో, అనేక మంది ఆదివాసీ రైతాంగ కర్యకర్తలు జైళ్ళలో మగ్గుతున్నారు. చివరికి బాక్సైట్ గనుల తవ్వకాన్ని ఆపేస్తున్నట్లుగా జగన్ ప్రకటించినప్పటికీ, బాక్సైట్ తవ్వకాల వ్యతిరేక పోరాటంలో కేసులు మోపబడిన అనేక మందిపై ఇప్పటికీ కేసులు ఎత్తివేయలేదు. కానీ చంద్రబాబు పాలనలో ప్రత్యేకహోదాకోసం జరిగిన ఉద్యమంలో తన పార్టీ (వై.ఎస్.ఆర్.సి.పి)కార్యకర్తలపై మోపిన కేసులను మాత్రం, జగన్ అధికారంలోకి రాగానే ఎత్తివేశాడు. ఈ పరిస్థితులలో, దేశంలో జరుగుతున్న ప్రజాస్వామిక విప్లవంలో భాగస్వాములవుతూ అరెస్టయిన వారిని రాజకీయ ఖైదీలుగా గుర్తించాలనీ, వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ, ప్రజాసభ జరిగింది.

విశాఖపట్నం జిల్లా, పెదబయలు ఏరియాలో సెప్టెంబర్ 16న వింజరి పంచాయితీలోని 15 గ్రామాలకు చెందిన సుమారు 1500 మంది ప్రజలు "గ్రామాలపై పోలీసుల దాడులు, అక్రమ అరెస్టులు నిలిపివేయాలి. తప్పుడు కేసులు బనాయించి జైళ్ళలో నిర్బంధించిన రాజకీయ ఖైదీలను విడుదల చేయాలి. బాక్సైట్ వ్యతిరేక ఆందోళనలో ప్రజలపై మోపిన కేసులను బేషరతుగా ఎత్తివేయాలి. అర్బన్ నక్సలైట్ పేరుతో విప్లవ సానుభూతిపరులనూ, ప్రజాస్వామిక, అభ్యుదయ మేధావుల అరెస్టులను నిలిపి వేయాలి. వారిపై మోపిన తప్పుడు కేసులను ఎత్తివేసి విడుదల చేయాలి" అనే డిమాండ్‌లతో నినాదాలిస్తూ, ప్లాకార్డులతో ఊరేగింపు నిర్వహించారు. ఆ తర్వాత కోండ్రు, జువ్వ గ్రామాల మధ్య సభ జరిపి, అరెస్టయిన వారి కుటుంబాలను హార్థికంగా, ఆర్థికంగా ఆదుకోవాలనీ, గ్రామాలపై దాడులకు వచ్చే పోలీసులను ప్రతిఘటించి ఎదుర్కోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అన్ని గ్రామాల నుంచి తరలివచ్చిన ప్రజలు 35వేల రూపాయలు, 10 క్వింటాళ్ళ బియ్యం, కొన్ని బట్టలు, నిర్బంధ బాధిత కుటుంబాలకు అక్కడికక్కడే సహాయం అందించారు. వాటిని జైళ్ళలో ఉన్న నిరుపేద కామ్రేడ్స్‌కు చెందిన 12 కుటుంబాలకు పంపిణీ చేశారు. నిర్బంధ బాధిత కుటుంబాలకు అండగా నిలబడుతామనీ, వారి విడుదలకు ఉద్యమిస్తామని అన్ని కుటుంబాలకు హార్థిక మద్దతును తెలియజేశారు. బాధిత కుటుంబాలు పత్రిక విలేఖరుల సమావేశంలో 'తమ కుటుంబాలు ఒంటరిగా లేవనీ, ప్రభుత్వం పోరాడే వారిపై తప్పుడు కేసులు పెట్టి, జైళ్ళలో నిర్బంధించినంత మాత్రాన విప్లవోద్యమాన్ని అడ్డుకోలేదనీ, ప్రజల మద్దతుతో మా కష్టాలను అధిగమిస్తామ'ని ప్రకటించారు.

## బలిమెల డ్యాం ముంపు బాధిత గ్రామాల ప్రజలకు అండగా నిలబడి, సహాయాన్ని అందించి, ఆదుకున్న ఆంధ్ర-ఒడిశా సరిహద్దు గ్రామాల ప్రజలు

మల్కనగిరి జిల్లాలో, బలిమెల జలవిద్యుత్తు ప్రాజెక్టును నిర్మించడం వలన, ప్రజల వందలాది ఎకరాల సాగు భూములు ముంపుకు గురైనాయి. వేలాది మంది ప్రజలు నిర్వాసితులుగా మారారు. దీంతో ఆ ప్రాంతంలో మిగిలిన రైతాంగం, అరకొరగా మిగిలిన రిజర్వాయర్ పరివాహక (అంచు) భూములను మాత్రమే సాగు చేసుకుంటున్నారు. ఈ పరిస్థితులలో 'గోరుచుట్టుపై రోకటి పోటులా' ప్రభుత్వం జలవిద్యుత్ ప్రాజెక్టుకోసం రిజర్వాయర్ నీటిమట్టాన్ని తనకవసరమైనప్పుడల్లా పెంచుతుండటంతో, రైతాంగం పరివాహక ప్రాంతంలో వేసుకున్న పంటలు ముంపుకు గురికావడం జరుగుతున్నది. ప్రజలు కరువు కాటకాలకు గురవుతున్నారు. 2019లో పెంచిన నీటిమట్టం మూలంగా వందలాది ఎకరాలలో చేతికి వచ్చిన పంట ముంపుకు గురయ్యి నష్టపోయారు. నష్టపరిహారం చెల్లించి, రైతులను ఆదుకోవాలని వేలాదిమంది ప్రజలు ఆందోళనకు దిగి ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినా, పట్టించుకున్న పాపానపోలేదు. ప్రభుత్వం మాత్రం 'దున్నపోతు మీద వర్షం కురిసిన చందంగా' ప్రజల బాధలకు ఏ మాత్రం



**బలిమెల డ్యాం ముంపుకు గురైన ప్రజలకు 8వేల మందితో సభ జరిపి**

**ఆర్థిక, హార్దిక సహాయానందించిన ఎమ్.కె.బి విప్లవ ప్రజానీకం**

స్పందించలేదు. ప్రజల డిమాండ్‌లను ఏ మాత్రం పట్టించుకోలేదు. దీంతో ఆ ప్రాంత ప్రజలు, ముఖ్యంగా ముంపుకు గురయిన పేద ఆదివాసీ రైతాంగాన్ని ఆదుకొనేందుకు ఒక సహాయక కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ ప్రభుత్వ నిర్లక్ష్య, ప్రజా వ్యతిరేక వైఖరిని నిరసిస్తూ, బాధిత ప్రజలను ఆదుకోవాలని వారం రోజులపాటు, ఆంధ్ర-ఒడిశాలోని సరిహద్దు గ్రామాలలో తిరిగి ప్రచారం చేశారు. ఈ పిలుపుకు ప్రజల నుండి గొప్ప స్పందన వచ్చింది. ఆంధ్రప్రదేశ్‌లోని సరిహద్దు బూసిపుట్, జామ్‌గూడ, వింజరి, కుమ్డ, బొంగపుట్, బరడా, లక్ష్మీపూర్ పంచాయితీలతో పాటు, కటాఫ్ ఏరియాలోని అనేక గ్రామాల ప్రజలు స్వచ్ఛందంగా ధాన్యం, రాగులు, బట్టలు, డబ్బులు తీసుకొని స్వయంగా తరలివచ్చి, ఒరపొదూర్ గ్రామంలో 7వేల మంది ప్రజలతో, ప్రభుత్వ ప్రజావ్యతిరేక వైఖరిని నిరసిస్తూ, ఊరేగింపు నిర్వహించి, భారీ బహిరంగ సభ జరిపారు. బాధిత గ్రామాల ప్రజలను పిలిచి అక్కడ జమచేసిన క్వింటాళ్ళకుపైగా, ధాన్యం, రాగులను ప్రతి కుటుంబానికి 25 కిలోల చొప్పున పంపిణీ చేశారు. ఆ తర్వాత కూడా ప్రజలు ఇంకా వసూలు కొనసాగిస్తూ, బాధితులను ఆదుకునే కార్యక్రమం కొనసాగింది. ప్రజలు తమంతటతాము నిర్వహించుకుంటున్న ఈ సహకార కార్యక్రమాన్ని అడ్డుకోవడానికి ప్రభుత్వం సాయుధ బలగాలను మోహరించింది. కూంబింగ్‌లకు వచ్చిన బలగాలను నిలదీయడానికి ప్రజలు వెంబడించడంతో, పోలీసులు తోకముడిచి అందుబాటులో ఉన్న కుంతిరిపొదూర్ క్యాంపులో తలదాచుకున్నారు. అయినా ప్రజలు వదిలిపెట్టకుండా వేలాది మంది క్యాంపును ఘెరావ్ చేసి, నిలదీయడంతో పోలీసులు క్షమాపణ చెప్పడంతోపాటు, మరోసారి కూంబింగ్‌కు రామని ప్రజలకు హామి యివ్వడంతో వెనుతిరిగారు. దీనితో ప్రభుత్వ ప్రజా వ్యతిరేక వైఖరి బహిర్గతం కావడంతోపాటు, ప్రజలలో ఒక సమిష్టి, సహకార చైతన్యం వెల్లువిరిసింది.

## ప్రజా సంక్షేమాన్ని పట్టించుకోని ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ, విప్లవ చైతన్యంతో సమిష్టి శ్రమ ద్వారా చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు

విశాఖపట్నం జిల్లాలోని మన్యం ప్రాంతంలో సహజసిద్ధంగానే పుష్కలమైన నీటి వనరులు ఉండి అనేక జలపాతాలు, నదులు సంవత్సరం పొడవునా ప్రవహిస్తున్నాయి. ప్రభుత్వానికి ప్రజాసంక్షేమం, అభివృద్ధి చేపట్టాలనే చిత్తశుద్ధి ఉంటే చిన్న చిన్న డ్యాంలు, చెక్ డ్యాంలు, కుంటలు నిర్మించడం ద్వారా లక్షలాది ఎకరాల భూములను వ్యవసాయ సాగుయోగ్యంగా మార్చవచ్చు. ప్రజలకు సురక్షితమైన త్రాగునీటిని అందిచవచ్చు. కానీ ఈ దేశసంపదను ముఖ్యంగా ఆదివాసీ ప్రాంతాలలోని ప్రకృతి సిద్ధమైన సహజ సంపదను సామ్రాజ్యవాదులకు దోచిపెట్టే విధానాలను అవలంభిస్తూ, ప్రకృతిని ధ్వంసం చేస్తూ, ప్రజలను నిర్వాసితులుగా మార్చడానికి కంకణం కట్టుకున్నది. అలాంటి ప్రభుత్వాల నుండి ప్రజలు అభివృద్ధిని ఆశించడం అంటే నేతిబీరలో నెయ్యిఉంటుందని భ్రమపడటం లాంటిదే అవుతుంది. అందుకే ఆదివాసీలు, పీడిత ప్రజలు, పార్టీ, విప్లవ రైతుకూలి సంఘాలు, విప్లవ ప్రజా రాజ్యధికార కమిటీల నాయకత్వంలో స్వావలంబనతో కూడిన ప్రజాభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నారు.

- పెదబయలు ఏరియాలోని, నానబరి గ్రామంలో చెరువు నిర్మించాలనే నిర్ణయం తీసుకుని, 6 గ్రామాలకు చెందిన ప్రజలు నెలరోజులపాటు శ్రమించి (సుమారు 3600 మంది) చెరువు నిర్మాణాన్ని పూర్తి చేశారు. ఈ నీటిని పంటల సాగుకు వినియోగించడంతోపాటు, చెరువులో చేపల పెంపకం కూడా చేపట్టారు. అలాగే దాని పక్కనే ఉన్న ఇంజరి గ్రామంలో కూడా 3 రోజులు పని చేసి, మరో చెక్‌డ్యాంను నిర్మించారు. ఆ నీటిని పంట పొలాలకు ఉపయోగిన్తానే, చెరువులో చేపలను పెంచుకుంటున్నారు.
- ఆంధ్ర సరిహద్దు ఒడిశా రాష్ట్రంలోని ఈతలపాడు, చీకటిపల్లి గ్రామాలలో ప్రజలకు నేటికి సురక్షితమైన త్రాగునీరు లేక, గడ్డ (నదులు) నీరు అంటే కలుషితమైన నీటిని త్రాగడం మూలంగా ప్రజలు అనేక జబ్బుల(రోగాల) బారినపడి, వైద్యం అందక, అకాల మరణాలకు గురవుతున్నారు. ఈ పరిస్థితులలో స్థానిక పార్టీ ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం కేటాయించిన నిధులను వెచ్చించి, పైపులు కొనితెచ్చి, కొండ నుంచి గ్రామానికి పైపులైన్ వేసి, గ్రామాలలో నల్లాలు ఏర్పాటు చేసి, ప్రజలందరికి సురక్షితమైన త్రాగునీటిని అందించింది. మహిళలు దూరం నుండి నీటిని మోసుకువచ్చే శ్రమను తగ్గించారు.
- ఇంజరి పంచాయితీలో బంగారుకొండ గ్రామంలో పైపులైన్‌ల ద్వారా వస్తున్న నీటిని నిల్వచేసి, నల్లాల (ట్యాప్‌ల) ద్వారా అదించటానికి నీళ్ళట్యాంక్‌ను నిర్మించారు. అలాగే దొడ్డంపాడు,నానబరి, దొసులబంద, ఊర్లపాలెం, చెరువుగొయ్యి గ్రామాలలో నీటికుండీలను ప్రజల సమిష్టి శ్రమ ద్వారా నిర్మాణం చేసి, మంచినీటిని అందిస్తున్నారు.

ఈఈ సంక్షేమ పథకాలు ప్రజలలో తమ స్వశక్తిపైన విశ్వాసాన్ని పెంచుతున్నాయి. సమిష్టితత్వాన్ని ఇమడింపజేస్తున్నాయి. ముఖ్యంగా ఈ దోపిడీ ప్రభుత్వం ఎడల ఒక స్పష్టమైన రాజకీయ వైఖరిని ఏర్పరుస్తున్నాయి.

## విప్లవోద్యమంపై శతృవు బహుముఖ దాడిని మరింత తీవ్రతరం చేయడంలో భాగంగా, అమలు చేస్తున్న ఆపరేషన్ 'సమాధాన్' వ్యూహాత్మకదాడి

ఎ.ఒ.బిని మావోయిస్టు రహిత ప్రాంతంగా మార్చుతామని ప్రకటించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ శక్తినంత కేంద్రీకరించి సంపూర్ణ నిర్మూలన లక్ష్యంగా, దాడి తీవ్రతను అనేకరెట్లు పెంచారు. అందులో భాగంగా వ్యూహాత్మక ప్రాంతాలలోకి చొరబడటానికి కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని ఖర్చు చేసి, రోడ్లు, కీలకమైన బ్రిడ్జీలు, సెల్‌టవర్లు నిర్మిస్తూ, ఇందతా వెనకబడిన ప్రాంతాలను అభివృద్ధి చేయడంలో భాగంగా చేస్తున్నామని అసత్య ప్రచారం చేస్తున్నారు. నిరుద్యోగ, లంపెన్ యువతకు డబ్బులు వెదజల్లి, మోటర్‌సైకిల్, సెల్‌ఫోన్స్ యిచ్చి పూర్తికాలం ఇన్‌ఫార్మర్లుగా తయారు చేసుకుంటూ, రెగ్యులర్‌గా దళాలు, సంఘ నాయకత్వం కదలికల సమాచారం సేకరించుకుంటున్నారు. లొంగిపోయిన కొందరు మాజీలను విప్లవ ద్రోహులుగా తయారు చేసుకుని, దాడులలో వినియోగించుకుంటున్నారు. ప్రజా నిర్మాణాలలో బలహీనమైన శక్తులను రహస్యంగా అరెస్టు చేసి, లొంగదీసుకుని, బ్లాక్ మెయిల్‌చేస్తూ, కోవర్టులుగా మార్చుకుని, దళాలపై దాడులకు పథకాలు వేస్తున్నారు. మనం ఎప్పుడూ వెళ్ళని కొత్త ప్రాంతాలలో కూడా కొందరిని రహస్యంగా హోంగార్డులుగా నియమించి, వారి సమాచారం మీద ఆధారపడి మన దళాలు ఆ ప్రాంతాలకు వెళ్ళగానే దాడులు చేస్తున్నారు. ఒడిశాలో కూడా ఎ.పి ఎస్.ఐ.బి అధికారులు మకాం వేసి, నెట్‌వర్క్‌ను తయారు చేయడంపై ప్రత్యేకంగా కేంద్రీకరిస్తున్నారు. రెండు రాష్ట్రాల పోలీసు అధికారులు సమాచారం యిచ్చిపుచ్చుకోవడం ద్వారా జాయింట్ ఆపరేషన్స్ చేపడుతున్నారు.

పై అంశాలలో గతం కన్న అభివృద్ధిని సాధించి, ప్రధానంగా సమాచార ఆధారిత దాడులకు పూనుకుంటున్నారు. మరోవైపు ఏ మాత్రం విరామం లేకుండా కూంబింగ్‌లు కొనసాగిస్తూ, మన దళాలను ప్రజలతో కలవనీయకుండా చేసేందుకు ఒత్తిడి పెంచుతున్నారు. ఇంకోవైపు గ్రామాలపై నిరంతరం దాడులు కొనసాగిస్తూ, అక్కడి పార్టీ, ప్రజానిర్మాణాలను దెబ్బతీస్తున్నారు. ఈ మొత్తం దాడి, పార్టీకున్న ప్రజాపునాదిని దెబ్బతీసి, పార్టీనీ, పి.ఎల్.జి.ఎని ఒంటరి చేసే లక్ష్యంతో ఒక క్యాంపెయిన్‌గా కొనసాగుతున్నది.

2019 జులై నుంచి డిసెంబర్ మధ్య వరకు, శత్రువు దళాలపై 4 చోట్ల దాడులు చేశాడు. అందులో జులై 27న ఒడిశా–ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని, తిరియా గ్రామ అటవీ ప్రాంతంలో ఫారెస్టు డిపార్ట్‌మెంట్ నియమించిన ఏజెంట్ ఇచ్చిన పక్క సమాచారంతో, ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టి చేసిన దాడిలో ఒక సాధారణ స్కూల్ విద్యార్థితోపాటు, ఆరుగురు కామ్రేడ్స్ అమరులయ్యారు. మల్కనగిరి జిల్లా, గుమ్మ ఏరియాలోని డాబగూడ గ్రామంలో రహస్యంగా పని చేస్తున్న హోంగార్డు యిచ్చిన ఖచ్చితమైన సమాచారంతో, పోలీసులు నిర్వహించిన ఆంబుష్‌లో సి.ఆర్.సి పి.ఎల్ కమాండర్, డి.వి.సి.ఎమ్ కామ్రేడ్ రాకేష్ అమరుడయ్యాడు. ఈ సందర్భంగా అమరుడు రాకేష్ చేసిన ప్రతిఘటనలో ఒక డి.బి.ఎఫ్ జవాన్ హతం కాగా, మరొకడు గాయపడ్డాడు. ఈస్ట్ డివిజన్‌లోని మండపల్లి అటవీ ప్రాంతంలో కూంబింగ్‌లో ఉన్న గ్రేహౌండ్స్ బలగాలపై దళం ఫైరింగ్ చేసింది. సెప్టెంబర్ 22న కొండజర్త అటవీ ప్రాంతంలో దళమకాంపై జరిగిన దాడిలో ముగ్గురు కామ్రేడ్స్ అమరులు కాగా, అక్కడ నుండి రిట్రీట్ అయి, ఆర్.వికి వెళ్ళిన మరో ఇద్దరు కామ్రేడ్స్‌ను పోలీసులు 24వ తేదీన పట్టుకొని కాల్చిచంపారు. మల్కనగిరి జిల్లా, చిత్రకొండ బ్లాక్, రంగినిగూడ సంఘ నాయకుడు కామ్రేడ్ చిన్నారావును జంతబాయి సంతలో అరెస్టు చేసి, చిత్రహింసలు పెట్టగా లాకప్‌లో చనిపోయాడు.

## సమాధాన్' దాడిని ప్రతిఘటిస్తూ, విప్లవోద్యమాన్ని పురోగమింపజేస్తున్న ప్రజలు

2019 సెప్టెంబర్ నెలలో, మల్కనగిరి జిల్లా, చిత్రకొండ బ్లాక్‌లోని రంగినిగూడ గ్రామ సంఘ నాయకుడు, పార్టీ సభ్యుడైన కామ్రేడ్ చిన్నారావు అనారోగ్యంతో వైద్యం చేయించుకోవడానికి కూతురు తోడురాగ జంతబాయి సంతకు వెళ్ళాడు. పోలీసు ఏజెంటు అందించిన సమాచారంతో మఫ్టిలో వున్న ముగ్గురు పోలీసులు వచ్చి సంతలోనే పట్టుకున్నారు. ఆ సమయంలో తనతోపాటు ఉన్న కూతురు పోలీసులను అడ్డుకుంటూ వారితోపాటు, జంతబాయిలో ఉన్న బి.ఎస్.ఎఫ్ క్యాంపు వరకు వెళ్ళింది. చిన్నారావుతో మాట్లాడి సాయంత్రం ఇంటికి పంపిస్తామని చెప్పడంతో కూతురు ఒక్కతే తిరిగి గ్రామానికి వెళ్ళి, జరిగిన విషయాన్ని కుటుంబ సభ్యులకు, గ్రామస్తులకు చెప్పింది. తెల్లవారి ఉదయమే వందలాది మంది ప్రజలు, బంధువులు కలిసి, జంతబాయి క్యాంపుకు వెళ్ళి, చిన్నారావు గురించి ప్రశ్నించారు. అప్పటికే చిన్నారావును లాకప్‌లో తీవ్ర చిత్రహింసలకు గురి చేసి, హత్య చేసి, శవాన్ని గ్రామంలోని అంగన్‌వాడీ భవనంలో దాచిపెట్టారు. కానీ ఈ విషయాలేవి చెప్పకుండా, చిన్నారావు మా వద్ద లేదని బుకాయించారు. ప్రజలు వెంటనే స్థానిక బొడిపడ పోలీస్‌స్టేషన్‌లో చిన్నారావు కోసం ఎంక్వయిరీ చేయగా, అక్కడి పోలీసులు ఈ విషయంతో మాకు సంబంధంలేదనీ, ఎక్కడ ఉన్నాడో కనుక్కొని తెలియజేస్తామని తిప్పి పంపించారు. ఈ పరిణామాలన్ని చూస్తుంటే ప్రజలకు సందేహాలు పెరిగాయి. అదేరోజు సాయంత్రానికి సమారు 1500 మంది ప్రజలు కర్రలు, విల్లుకాడులతో, బొడపడ బి.ఎస్.ఎఫ్ క్యాంపు, పోలీస్‌స్టేషన్‌పై దాడి చేయగా, పోలీసులు పరుగులు తీసారు. బంకర్‌పైన ఉన్న సెంట్రీని పట్టుకుని మహిళలు చెప్పులతో కొట్టారు. స్టేషన్‌లోని సామాగ్రిని ధ్వంసం చేసి, కాల్చివేశారు. మరుసటి రోజు హడావిడిగా జంతబాయి అంగన్‌వాడి భవనం వద్ద గుర్తు తెలియని శవం లభ్యమైనట్లుగా పోలీసులు ప్రకటించారు. ప్రజలు ఊహించినట్లుగానే పోలీసులు చిన్నారావును హత్యచేశారు. సుమారు 3వేల మంది ప్రజలు జంతబాయికి వెళ్ళగా, అప్పటికే శవాన్ని బి.ఎస్.ఎఫ్ క్యాంపుకు తరలించి దాచి పెట్టారు. ప్రజలు శవాన్ని చూపించాలని డిమాండ్ చేయగా, తెలియదని బుకాయించారు. ప్రజలు క్యాంపులోకి చొరబడి పోలీసులపై దాడి చేస్తూనే, క్యాంపులో వెతకగా మూటగట్టిన శవం కనబడింది. కుటుంబ సభ్యులు సంతకం చేస్తే, శవాన్ని పోస్ట్‌మార్టం అనంతరం అప్పగిస్తామని రాజీబేరాలకు దిగారు. కుటుంబ సభ్యులు అందుకు నిరాకరించడంతో, రాత్రికి రాత్రే శవాన్ని రహస్యంగా పోస్ట్‌మార్టం నిర్వహించేందుకు హాస్పటల్‌కు తరలించారు. తెల్లవారి ఉదయం ఆంధ్రప్రదేశ్ సరిహద్దు, ఒడిశా గ్రామాలకు చెందిన వేలాదిమంది ప్రజలు సాంప్రదాయక ఆయుధాలతో ఆ గ్రామానికి చేరుకున్నారు. పోలీసులు రాజకీయ నాయకులను పంపి ప్రజలతో రాజీ చేయాలని చూసారు. అప్పటికే అదనపు బలగాలను మోహరించారు. శవాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించడానికి తిరిగి జంతబాయికి తరలించారు. చిన్నారావును అరెస్టు చేసిన పోలీసులను అప్పగించాలనీ, తక్షణమే పోలీసు క్యాంపు ఖాళీ చేయాలని డిమాండ్‌లతో క్యాంపును చుట్టుముట్టారు. కత్తులు, గొడ్డళ్ళతో దాడికి దిగడంతో పోలీసులు వాహనాలతో కొందరు, పంటపొల్లాలో కొందరు పరుగులు లంఖించుకున్నారు. రాళ్ళతో దాడి చేస్తూ, చేతికి దొరికిన వారిని గొడ్డళ్ళతో గాయపర్చుతూ, వాహనాలను తగలబెట్టారు. ఈ దాడిలో ఏడుగురు పోలీసులు తీవ్రంగా

గాయపడగా, అనేక మంది పోలీసులకు స్వల్ప గాయాలయ్యాయి.

చిన్నారావు శవాన్ని తీసుకొని, భారీ ఊరేగింపుగా గ్రామానికి తీసుకువెళ్ళి, విప్లవ సాంప్రదాయాలతో అంతిమ సంస్కారాలు పూర్తి చేశారు. మరుసటి రోజు ఆంధ్ర-ఒడిశా సరిహద్దులోని అనేక గ్రామాలకు చెందిన సుమారు 7వేల మంది ప్రజలు సమావేశమై 1. చిన్నారావుతోపాటు గతంలో పోలీసులు ఎన్‌కౌంటర్ల పేరిట చేసిన హత్యలన్నింటిపై న్యాయ విచారణ జరిపి దోషులను శిక్షించాలనీ, 2. వాకపల్లి, బల్లుగూడ మహిళలపై అత్యాచారానికి పాల్పడిన గ్రేహౌండ్స్ పోలీసులకు శిక్షలు విధించాలనీ, 3. జంతబాయి పోలీసు క్యాంపును తక్షణమే ఎత్తివేయాలనీ, 4. గ్రామాలపై దాడులు, అక్రమ అరెస్టులు నిలిపివేయాలనే ప్రధాన డిమాండ్లతో జంతబాయి క్యాంపును ఘెరావ్ చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ సమాచారం తెలుసుకున్న ప్రభుత్వం వందలాది మంది అదనపు బలగాలను మోహరించి బారికేడ్లు నిర్మించి క్యాంపుకు చేరుకునే దారులన్నింటిని మూసివేశారు. అయినా ప్రజలు వాటిని ధిక్కరించి ముందుకెళ్ళారు. జిల్లా ఎస్.పి, బి.ఎస్.ఎఫ్ ఐ.జి, జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్.ఎల్.ఎతో కలిసి ప్రజల డిమాండ్లపై చర్చించడానికి ముందుకు వచ్చారు. ప్రజలు తమ డిమాండ్లను ఆమోదించే వరకు చర్చలకు రామని తెగేసి చెప్పారు. ప్రజలతోపాటు, బూర్జువా పార్టీల స్థానిక నాయకులను పిలిచి ఈ ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తామనీ, చిన్నారావు కుటుంబ సభ్యులకు ఎక్స్‌గ్రేషియా చెల్లిస్తామనీ, మిగిలిన డిమాండ్లను కూడా అమలు చేస్తామని పోలీసు క్యాంపు ఎత్తివేతపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి నిర్ణయించాల్సి ఉంటుందనీ, అందుకు నెల రోజుల సమయం కావాలనీ, అప్పటి వరకు ఈ ప్రాంతంలో కూంబింగ్‌లు, అరెస్టులు నిలిపివేస్తామని ప్రకటించారు. ఒకరోజు వ్యవధితో కటాఫ్ ఏరియా ప్రజలు కూడా ఈ ఆందోళనలో భాగం అవుతూ, నిర్దిష్టమైన డిమాండ్‌లను రూపొందించారు. 1. ఏజెన్సీలో మోహరించిన పోలీసు క్యాంపులన్నింటిని వెంటనే ఎత్తివేయాలి. 2. కూంబింగ్‌లు, గ్రామాలపై దాడులు నిలిపివేయాలి. 3. ఇప్పటివరకు జరిగిన లాకప్ హత్యపు, అత్యాచారాలు, బూటకపు ఎన్‌కౌంటర్లపై న్యాయ విచారణ జరిపి, తక్షణమే అందుకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలి. ఈ డిమాండ్లతో 3వ రోజున ఆంధ్ర, ఒడిశా రాష్ట్రాలకు చెందిన ప్రజలు ఉమ్మడిగా ఆందోళనకు దిగారు. పోలీసులు క్యాంపు గేట్లకు తాళాలు వేసి, విలేఖరుల బృందాన్ని ప్రజల వద్దకు మధ్యవర్తులుగా పంపి, "ఇప్పటికే ప్రభుత్వం మీ డిమాండ్‌లను ఆమోదించింది కనుక, వాటి అమలుకు ఒక నెల రోజులు గడువు ఇవ్వాల"ని సమాచారం పంపుతూ రాజీబేరానికి వచ్చారు. దీంతో ప్రజలు తమ ఆందోళనను తాత్కాలికంగా విరమించారు. ఈ ఆందోళన సరిగ్గా 8 రోజులు కొనసాగింది. సాధారణ ప్రజలలో కూడా పోలీసులపై గూడు కట్టుకొని ఉన్న కసి, ఈ ఉద్యమంలో వివిధ రూపాలలో వ్యక్తమయ్యింది. ఈ పోరాటంలో పాల్గొన్న వేలాది మంది ప్రజలకు స్థానిక గ్రామాల ప్రజలు ఆహారం, మంచినీరు, జావ అందించి, వారి ఇళ్ళలో ఆశ్రయం కల్పించారు.

ఈ ఆందోళనలో ప్రజలు అత్యంత సమరశీలతతో పాల్గొన్నారు. పోలీసులు, ప్రభుత్వం పట్ల కసిని ప్రదర్శించారు. 'ఒక చిన్న నిప్పురవ్వ గొప్ప దావనలాన్ని సృష్టిస్తుంది' అనడానికి ఈ ఆందోళన ఒక నిదర్శనం. ఈ ప్రతిఘటనా ఉద్యమంలో ప్రజల మధ్య ఉన్న ఐక్యత చాలా స్పష్టంగా వ్యక్తమయ్యింది. ఈ ప్రతిఘటనలో మహిళలు ముందు భాగాన ఉండి క్రియాశీలక పాత్రను పోషించారు. వ్యూహాత్మకంగా శత్రువు కాగితపు పులే అనీ, ప్రజలే నిర్ణయాత్మక శక్తులని మరోమారు ఋజువయ్యింది. చిన్నారావు కుటుంబం ప్రభుత్వం కల్పించే ఆశలకు, భ్రమలకు లొంగకుండా వీటిని ధిక్కరిస్తూ, ఆయన ఆశయ సాధనకు అంకితమై చైతన్యయుతంగా ఉద్యమించింది.

**పెదబయలు ఏరియాలో పోలీసు దాడులు, అక్రమ అరెస్టులకు నిరసనగా ప్రజా ర్యాలీ**



కూంబింగ్‌లు, అక్రమ అరెస్టులకు వ్యతిరేకంగా ర్యాలీ అనంతరం పోలీసు అధికారులను నిలదీస్తున్న ప్రజలు

విశాఖపట్నం జిల్లా, పెదబయలు ఏరియాలోని ముంచింగిపుట్, జి.మాడుగుల, చింతపల్లి, పెదబయలు మండలాల్లో గ్రేహౌండ్స్, సి.ఆర్.పి.ఎఫ్, స్థానిక పోలీసులు అడవులలో కూంబింగ్‌ల పేరుతో వ్యవసాయ పనులు చేసుకుంటున్న వారిని, వేటకు వెళ్ళిన ప్రజలను, బంధువుల ఇళ్ళకు ప్రయాణించే వారిని పట్టుకోవడం, వేధించడం, అక్రమంగా నిర్బంధించడం, గ్రామాలపై రాత్రిళ్ళు దాడులు చేయడం, సంతలకు, వైద్యానికి వెళ్ళినవారిని అక్రమంగా అరెస్టు చేసి, వారాల తరబడి పోలీసుస్టేషన్‌లో చిత్రహింసలకు గురి చేయడం, తప్పుడు కేసులు బనాయించి, జైళ్ళకు పంపడంతో ప్రజలు, వారి కుటుంబాలు తీవ్రమైన అభద్రతతో జీవనం కొనసాగించవలసి వస్తున్నది.

ప్రభుత్వం అమలు జరుపుతున్న ఈ నిర్బంధాన్ని ప్రజలు సామూహికంగా ఎదుర్కోవాలనీ, అందుకు కలిసివచ్చే పార్టీలు, సంస్థలు, వ్యక్తులు ముందుకు రావాలని పార్టీ పిలుపునిచ్చింది. ప్రజలకు దూరం అవుతామనే భావంతో అన్ని పార్టీలు, స్థానిక రాజకీయ నాయకులు కూడా ఈ సమస్యలపై ఏర్పాటు చేసిన ఐక్య సంఘటనలో కలిసి రావడానికి ముందుకు వచ్చారు.

1. గ్రామలపై దాడులు, సంతలలో అక్రమ అరెస్టులు నిలిపివేయాలి.

2. అడవులలో ప్రత్యేక బలగాల కూంబింగ్ నిలిపివేయాలి.

3. పోలీసుల అదుపులో ఉన్న ప్రజలను, సంఘనాయకులను బేషరతుగా విడుదల చేయాలి.

4. మన్యంలో ఏర్పాటు చేసిన పోలీసు క్యాంపులను వెంటనే ఎత్తివేయాలి.

అంటూ పై డిమాండ్స్‌తో ఐక్యకార్యాచరణ కమిటీ ఏర్పడింది. ఈ డిమాండ్‌లపై, నవంబర్‌లో వేలాది మంది ప్రజలు సాంప్రదాయక ఆయుధాలు చేబూని, స్థానిక పోలీసు క్యాంపులతోపాటు, పెదబయలు మండల కేంద్రానికి ర్యాలీగా బయల్దేరారు. ఈ సమాచారం అందుకున్న పోలీసు అధికారుల(ఒ.ఎస్.డి, చింతపల్లి ఎ.ఎస్.పి సతీష్‌కుమార్, పాడేరు డి.ఎస్.పి, సి.ఐ, ఎస్.ఐ) నాయకత్వంలో వందలాది మంది సాయుధ బలగాలు దారుల్లో మోహరించి, ర్యాలీకి వెలుతున్న ప్రజలను ఎక్కడికక్కడ ఉదయమే అడ్డుకున్నారు. అయినప్పటికీ, ప్రజలు, పోలీసుల బెదిరింపులు, అడ్డంకులు, అరెస్టులు మొదలైన వాటిని లెక్క చేయకుండా ఎక్కడికక్కడే ఆందోళనకు దిగారు. పోలీసులతో ఘర్షణ పడ్డారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులకు, ప్రజలకు మధ్య చాలాసేపు వాగ్వివాదాలు జరిగాయి. ఈ సమచారాన్నందుకున్న విలేఖరులు కూడా అక్కడికి చేరారు. చివరికి పోలీసులు పరిస్థితి చేజారిపోతుందని భావించి, అంతకుముందే అరెస్టు చేసిన మిలీషియా, సంఘ సభ్యులను వదిలి, ప్రజలను శాంతిపజేసి వెనుదిరిగారు.

## వ్యూహాత్మక ప్రాంతాలలో ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న నూతన పోలీసు క్యాంపుల నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ ప్రజాందోళన



1. కూంబింగ్‌లు ఆపేయాలంటూ కుంతిర్‌పాదూర్ క్యాంపు పోలీసులను నిలదీస్తున్న ప్రజలు

2. నూతన క్యాంపుకు వ్యతిరేకంగా ఒంతలగూడలో ప్రజాసభ

మల్కనగిరి జిల్లాలోని, చిత్రకొండ బ్లాక్‌లో, కటాఫ్ ఏరియాను దిగ్బందిచే లక్ష్యంతో ప్రభుత్వం ఆ ప్రాంతంలో నూతనంగా పోలీసు క్యాంపులను ఏర్పాటు చేసేందుకు పథకం రూపొందించుకుంది. ఈ పథకంలో భాగంగా ఒంతలగూడ గ్రామంలో క్యాంపు నిర్మాణానికి సన్నాహాలు ప్రారంభించింది. అందుకనుగుణంగా గ్రామంలో బోరింగ్‌లు వేయడం, రోడ్డును నిర్మించడం, క్యాంపు నిర్మాణ స్థలాన్ని చదును చేయడం వగైరా పనులను భారీ యంత్రాలను ఉపయోగిస్తూ మొదలుపెట్టింది. ఇందుకుగాను గ్రామపెద్దతోపాటు, మరికొందరు దళారీలను పోలీసులు తమకనుకూలంగా మలుచుకున్నారు. ఈ విషయం అర్థమై చుట్టుపక్కల గ్రామల నుంచి సుమారు 4వేల మంది ప్రజలు ఒంతలగూడలో పోలీసు రక్షణలో జరుగుతున్న క్యాంపు నిర్మాణాన్ని అడ్డుకోవడానికి సాంప్రదాయక ఆయుధాలతో తరలివెళ్ళారు. ప్రజలు కదిలిరావడాన్ని గమనించిన పోలీసులు వాహనాలను తరలించుకొని కొండదిగి సమీప క్యాంపుకు వెళ్ళిపోయారు. గ్రామ తెగపెద్ద కూడా గ్రామాన్ని వదిలి పారిపోయాడు. ప్రజలు ఒంతలగూడ గ్రామానికి చేరుకొని, పోలీసులు వేసిన బోరింగులను ధ్వంసం చేసి, పోలీసు క్యాంపు నిర్మాణానికి గ్రామస్తులు సహకరించవద్దనీ, భయపడవద్దనీ, అందుకు ఈ ప్రాంత ప్రజల మద్దతు మీకు వుంటుదని అర్థం చేయించారు. రోడ్ల నిర్మాణం ప్రజల అభివృద్ధిలో భాగం కాదనీ, ప్రజలను అణచివేసేందుకేననీ, ఆచరణ పూర్వకంగా మనకు ఋజువు అవుతున్నందున రోడ్లనూ, పోలీసు క్యాంపులను ప్రజలందరూ కలిసి అడ్డుకుందామని సమిష్టింగా నిర్ణయం తీసుకున్నారు. ఈ సంఘటన తర్వాత నవీన్ ప్రభుత్వం ఆ ప్రాంతంలో పోలీసులను పెద్ద ఎత్తున మోహరించి, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి, నూతన క్యాంపును నిర్మించింది.

## ప్రజల భాగస్వామ్యంతో పోలీసు ఏజెంట్లకు శిక్షలు విధించిన పి.ఎల్.జి.ఎ

కోరుకొండ ఏరియాలోని వీరవరం గ్రామంలో కలికి భగవాన్ ముసుగులో సంజీవరావు అనే పోలీసు ఏజెంటు, వాడి గురువు సింహాచలం పోలీసుల గైడెన్స్‌లోనే అనేక గ్రామాలు తిరుగుతూ, మతం ప్రచారం ముసుగులో పోలీసు ఏజెంట్లను తయారు చేయడం ప్రారంభించారు. ఈ విషయంలో 2014లో సంజీవరావును ప్రజాకోర్టు తీర్పు మేరకు పి.ఎల్.జి.ఎ ఖతం చేసింది. సింహాచలాన్ని ప్రజాకోర్టులో విచారిస్తుండగా, సంజీవరావు కుటుంబ సభ్యులు, మతం ముసుగులో వున్న కొందరు ప్రజా వ్యతిరేకులు, పోలీసు ఏజెంట్లు కలిసి, పి.ఎల్.జి.ఎ సభ్యులపై ఆకస్మాత్తుగా గొడ్డళ్ళతో దాడి చేయగా, డి.వి.సి.ఎమ్ కామ్రేడ్ శరత్‌తోపాటు, సంఘ నాయకుడు గణపతి అమరులయ్యారు. ఈ సంఘటనను "మావోయిస్టులపై ఆదివాసీల తిరుగుబాటు"గా పోలీసులు పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. ఈ సంఘటనకు కారకులైన సంజీవరావు కుటుంబం, బంధువులకు రివార్డులు ప్రకటించి, వారిని చింతపల్లి మండల కేంద్రంలో పెట్టి రక్షణ కల్పించారు. కొద్దికాలం వీరిని పోలీసులు వారి అవసరాలకు ఉపయోగించుకొని వదిలేశారు. వీరు కోరుకొండలో ఉద్యమం బలహీనపడిందనీ, తమను ఎవరు ఏమి చేయలేరనే ధీమాతో తిరిగి గ్రామానికి చేరుకొని ప్రజలను బెదిరించి, ప్రజలకు పార్టీ పంపిణీ చేసిన భూములను తిరిగి స్వాధీనం చేసుకున్నారు. దీంతో ప్రజలలో వీరిని శిక్షించాలనే డిమాండ్ మళ్ళీ ముందుకు వచ్చింది. 2019, జులైలో వీరవరం చుట్టుపక్కల గ్రామాల ప్రజలతో కలిసి, సంజీవరావు అన్న భాస్కర్‌రావు, వాడి బావమరిది సత్తిబాబు ఇళ్ళను చుట్టుముట్టి, పట్టుకొని గ్రామంలోని ప్రజాకోర్టులో విచారించి, ప్రజల తీర్పు మేరకు పి.ఎల్.జి.ఎ వీరిద్దరిని ఖతం చేసింది. మావోస్టులే లేరని ప్రచారం చేస్తున్న పోలీసులు ఈ సంఘటనతో ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. బాస్కర్‌రావు, సత్తిబాబులను రక్షించుకోలేని తమ అసమర్థత బయటపడటంతో, వాళ్ళిద్దరు తాము చెప్పినట్లుగా నడుచుకోకపోవడం వలనే ఈ ఘటన జరిగిందని ప్రకటన చేస్తూ, తమ చేతగాని తనాన్ని సమర్థించుకోచూసారు. ఈ సంఘటన ప్రజలలో మంచి ప్రభావం వేసింది. ప్రజాద్రోహులకు ఎన్నటికైనా శిక్ష తప్పదని ఇలాంటి ఎన్నో సంఘటనలు ఋరుజు చేశాయి. ఈ దెబ్బ పోలీసు ఏజెంట్లకు ఒక హెచ్చరికయ్యింది.

## డాబగూడ ఎన్‌కౌంటర్ కారకుడు హోంగార్డు సురేంద్ర ఆస్తులు స్వాధీనం చేసుకున్న ప్రజలు

మల్కనగిరి జిల్లా, కొయిరిపుట్ బ్లాక్‌లోని డాబగూడ గ్రామానికి దళం (2019) ఆగస్టు 28న సాయంత్రం చేరుకుంది. ఆ గ్రామానికి పార్టీ వెళ్ళక దాదాపు 4 సంవత్సరాలు కావస్తున్నది. ఈ మధ్య కాలంలో, గ్రామంలో జరిగిన పరిణామాలు మన కామ్రేడ్స్‌కు తెలియవు. ఆ రోజు సాయంత్రం జరిగిన ప్రజాసమావేశంలో కూడా మారిన పరిస్థితులపై లోతైన చర్చ జరగలేదు. అయితే ఈ మధ్య కాలంలో పోలీసులు సురేంద్ర అనే వాడిని రహస్యంగా లొంగదీసుకొని, హోంగార్డుగా చేర్చుకొని, ఆ ప్రాంతంలో పార్టీ కదలికలుంటే సమాచారం అందించే విధంగా నియమించారు. వీడు గ్రామంలోనే ఉంటూ, ప్రజలకు అర్థం కాకుండా పని చేస్తున్నాడు. ఆగస్టు నెలలో దళం గ్రామానికి వెళ్ళిన వెంటనే ఫోన్ ద్వారా పోలీసులకు సమాచారం అందించాడు. ఈ సమాచారంపై ఆధారపడి

పోలీసులు 29వ తేదీ ఉదయం 5గం॥ 15 నిమిషాలకు దళంపై దాడి చేసారు. ఈ దాడిలో కామ్రేడ్ రాకేష్ అమరుడు కాగా, ఒక ఒక డి.బి.ఎఫ్ పోలీసు చనిపోయాడు, ఒకడు గాయపడ్డాడు. ఈ సంఘటన తర్వాత గ్రామ ప్రజలకు సురేంద్రపై అనుమానం వచ్చి వాడిని ప్రశ్నించగా, వాడు పోలీసులు ఇచ్చిన రివార్డు తీసుకొని గ్రామం నుంచి పారిపోయి, పోలీసుల రక్షణలోకి వెళ్ళాడు.

సంఘటన జరిగిన నెల రోజుల తర్వాత దళం, మిలీషియా కలిసి సుమారు 60 మంది వెళ్ళి, ఎన్‌కౌంటర్ సంఘటనపై విచారించగా సురేంద్ర ద్రోహం మూలంగా జరిగిందని ప్రజలు తేల్చి చెప్పారు. గ్రామస్తులు సురేంద్రను పరిశీలించడంలో, పార్టీకి రిపోర్ట్ చేయడంలో పొరపాటు జరిగిందని ఆత్మవిమర్శ చేసుకున్నారు. సురేంద్ర భార్యను విచారించగా, జరిగిన విషయాన్ని వివరంగా ప్రజల ముందు చెప్పింది. దానితో ప్రజలు సురేంద్ర కుటుంబాన్ని గ్రామ బహిష్కరణ చేయాలనీ, భూములు, పంటలు, పశువులు ప్రజలకు పంపిణీ చేయాలని నిర్ణయించారు. వాడు నివాసముంటున్న ఇంటిని ధ్వంసం చేసి, ప్రజాతీర్పుతో దళం ఆదేరోజు సురేంద్ర కుటుంబాన్ని గ్రామం నుండి పంపించి వేసింది. ఆస్తులను ప్రజలకు పంపిణీ చేసింది.

## పోలీస్ ఇన్ఫార్మర్ లంబయ్య (దివుడు)కు ప్రజాకోర్టులో మరణశిక్ష

గూడెం మండలం, పెద్దపాడు గ్రామానికి చెందిన లంబయ్య (దివుడు) గతంలో మన పార్టీ నాయకత్వంలో జరిగిన కాఫీతోటల స్వాధీన పోరాటంలో పాల్గొన్నాడు. అనేక ప్రజా పోరాటాల్లో కూడా క్రియాశీలకమైన పాత్ర పోషిస్తూ, క్రమంగా సంఘ నాయకుడుగా, పార్టీ సభ్యుడిగా అభివృద్ధి అయ్యాడు. ఆ ప్రాంతంలో జన మిలీషియా దళంలో చేరి, కమాండర్ కామ్రేడ్ జాంబ్రితో కలిసి పని చేస్తున్న క్రమంలోనే, 2015లో ఇతడిని పోలీసులు అరెస్టు చేసి, లొంగదీసుకుని, ఇన్‌ఫార్మర్‌గా పని చేయాలనే ఒప్పందంతో విడిచిపెట్టారు. అనాటి నుంచి ఇతడు రహస్యంగా పోలీసు ఇన్ఫార్మర్‌గా పని చేస్తూ, దళం, మిలీషియా, సంఘనాయకుల సమాచారాన్ని ఎప్పటికప్పుడు పోలీసులకు చేరవేయడంతో, ఆ ప్రాంతంలో చాలా మంది సంఘ నాయకుల, సానుభూతిపరుల అరెస్టులు జరిగాయి. అనేకసార్లు మిలీషియా, దళం తృటిలో పోలీసుల నుంచి తప్పించుకుంది. చివరకు కామ్రేడ్ జాంబ్రి ఎన్‌కౌంటర్ ఘటనలో కూడా వీడి పాత్ర ఉంది. ఈ విషయంపై అనుమానంతో పార్టీ, ప్రజలు ఇప్పటికే మూడుసార్లు వీడిని ప్రజాకోర్టులో పెట్టి, విచారించి తన బుద్దిని మార్చుకోమ్మని హెచ్చరించడం జరిగింది. తనను ఎక్కడికీ తిరగవద్దని ప్రజాకోర్టులో కండిషన్స్ పెట్టారు. అయినప్పటికీ, వీడు తన బుద్ధిని మార్చుకోకపోగా, ఈ ప్రజాకోర్టు పెట్టిన అనంతరం గ్రామం నుంచి వెళ్ళిపోయి పోలీసులతో కలిశాడు. 2019 సెప్టెంబర్ 21 మన పార్టీ ఆవిర్భావ వారోత్సావ సందర్భంగా, కొండజర్త వద్ద పి.ఎల్.జి.ఎపై జరిగిన పోలీసు దాడి సందర్భంగానూ వచ్చిన పోలీసు బ్యాచ్‌లతో లంబయ్య కూడా కూంబింగ్‌లో పాల్గొన్నాడు. ప్రత్యక్షంగా చూపిన ప్రజలు, పెద్దపాడు గ్రామస్తులు కూడా ఇక వీడిని క్షమించేది లేదనీ, ఇతడిలో మార్పు రాదని అభిప్రాయపడటంతో, మన పి.ఎల్.జి.ఎ 2019 అక్టోబర్ 25వ తేదీన వీడిని పట్టుకుని మరణశిక్షను విధించింది.

## పోలీసు ఇన్ఫార్మర్, హోంగార్డు, ప్రజావ్యతిరేకి కొర్రా రంగారావును శిక్షించిన ప్రజలు

విశాఖ జిల్లా, పెదబయలు మండలం, గిన్నెలకోట పంచాయితీ, లందుల గ్రామానికి చెందిన కొర్ర రంగారావు గతంలో ఆదివాసీ రైతూకూలి సంఘం ఏరియా కమిటీ ఉపాధ్యక్షుడిగా, పాకెట్ కమిటీ అధ్యక్షుడిగా పని చేశాడు. ఇతడిని పోలీసులు 2017లో అరెస్టు చేసి, ఇతడి భార్యను బెదిరించి "గ్రామంలోని మరింకొంత మంది సంఘనాయకులనూ, మిలీషియా సభ్యులను సరెండర్లు చేయిస్తేనే, నీ భర్తను విడిచిపెడతామ"ని అనటంతో, ఆమె కొంత మందిని సరెండర్స్ చేయించింది. తర్వాత రంగారావు కూడా పోలీసుల ప్రలోభాలకు లొంగిపోయి హోంగార్డుగా పని చేయటానికి ఒప్పుకోవడంతో వీడిని 6 నెలలు జైలులో ఉంచి పోలీసులు విడిచిపెట్టారు. అలా 2018 నుంచి వీడు హోంగార్డుగా పని చేస్తున్నాడు. వీడితోపాటు వీడి అన్న ఆనంద్, అంబ్రపాడు క్రిష్ణ, బొంగ్గంగి మోహన్, లక్ష్మణ్, నానాబరి ఓగి వీళ్ళంతా కలిసి ఇన్ఫార్మర్‌లుగా మాత్రమే కాకుండా, గంజాయి మాఫియాగా కూడా తయారయ్యి, ప్రజలను మోసం చేసి, లక్షలాది రూపాయల ప్రజల సొమ్మును కాజేశారు. జి.మాడుగుల, పెదబయలు మండల సెంటర్స్‌కు తమ మకాం మార్చి, ప్రజలను పోలీసుల అండతో అరెస్టులు, బెదిరింపులకు గురి చేస్తున్నారు. ప్రజలు తమ అవసరాలు తీర్చుకోవడానికి సంతలకు, మండల సెంటర్స్‌కు వెళితే అక్రమంగా అరెస్టులు చేయించారు. వీరి ఆకృత్యాలను అడ్డుకోవడానికి ప్రజల సహకారంతో మిలీషియా కొర్ర రంగారావుని పట్టుకొని, అక్టోబర్ 20, 2019న విచారించి ఖతం చేసింది. ఈ సంఘటన ప్రజల్లో మంచి ప్రభావం వేసింది.

## దోపిడీ పాలకవర్గాల మెడలు వంచి, బాక్సైట్ గనుల తవ్వకాలను నిలుపుదల చేయించిన సందర్భంగా, విజయోత్సాహ సభ జరుపుకున్న ప్రజలు

గత మూడు దశాబ్దలుగా మన్యం ప్రాంతంలో బహుళజాతి సంస్థలు బాక్సైట్‌ను వెలికితీసేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తూ వచ్చారు. ఈ బహుళజాతి సంస్థలకు దళారీలుగా పని చేస్తున్న ఆంధ్ర పాలకవర్గాలు, అన్ని విధాల వారికి సహకరిస్తూ వచ్చారు. ముఖ్యంగా తెలుగుదేశం, కాంగ్రెస్ పార్టీలు అధికారంలో ఉన్నప్పుడు ఈ బహుళజాతి సంస్థలకు పూర్తిస్థాయిలో సహాయసహకారాలు అందించారు. అయితే ఈ 30 సంవత్సరలుగా మన్యంలో పీడిత ఆదివాసీ రైతాంగం, పార్టీ నేతృత్వంలో సమరశీలంగా పోరాటం నిర్వహిస్తూ వచ్చారు. ఈ క్రమంలో కేంద్ర, రాష్ట్ర పోలీసులు అమలు జరిపిన కౄరమైన నిర్బంధంలో అనేక మంది తీవ్ర చిత్రహింసలకు గురై, జైలు శిక్షను అనుభవించారు. మహిళలు అత్యాచారాలకు గురైనారు. కొంతమంది బూటకపు ఎన్‌కౌంటర్లలో మరణించారు. ఈ పోరాటం ఫలితంగా, 2019 మేలో అధికారంలోకి వచ్చిన వై.ఎస్.ఆర్.సి.పి నాయకుడైన జగన్ అనివార్య పరిస్థితులలో బాక్సైట్ తవ్వకాల నిలుపుదలను ప్రకటించారు.

ప్రజలు తమ సుదీర్ఘమైన, త్యాగపూరితమైన, సాహసోపేతమైన పోరాటాన్ని గెలిచిన సందర్భంగా విజయోత్సాహ సభ జరిపారు. ఈ సందర్భంగా బలపం పంచాయితీ, లబడంపల్లి గ్రామంలో, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు 22టీంలు హాజరైనాయి. వీరందరికీ భోజనాలు ఏర్పాటు చేయడంతోపాటు, గెలిచిన టీంలకు బహుమతులు అందజేశారు. ఈ సభకు 500 మంది వరకు ప్రజలు హాజరైనారు. వక్తలు ఈ విజయాన్ని ప్రజావిజయంగా శ్లాంఘించారు. ఈ కార్యక్రమం మంచి రాజకీయ వాతావరణంలో ముగిసింది.

## అక్టోబర్ 24న రాంగూడ ఘటనలో అమరులైన కామ్రేడ్స్‌ను స్మరించుకున్న ప్రజలు









# పి.ఎల్.జి.ఎ వారోత్సవాలు



1. జొంత్రి, 2. అమ్లిబెడ, 3. కొసంపూట్, 4. సిమిలిపాదూర్

పి.ఎల్.జి.ఎ ఆవిర్భావ వేడుకలు జరుపుకున్న కటాఫ్, గుమ్మ ఏరియాల విప్లవ ప్రజానీకం




తెలంగాణ రాష్ట్రం, ఉమ్మడి వరంగల్ జిల్లా,

బచ్చన్నపేట మండలం, పోచన్నపేట గ్రామంలో

**కామ్రేడ్ మీన (ప్రమీల)** స్థూపాన్ని

ఆవిష్కరిస్తున్న తల్లి రాములమ్మ